అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 1-1-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 4 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలు వెల : 5.00



## కొత్త రాష్ట్రం తెలంగాణ మూడున్నరేళ్ళలో ఆవిష్కరించిన అద్భుతం

# నేటి నుండి వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా నాణ్యమైన ఉచిత విద్యుత్




## దేశంలో ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

### ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి కృషితో మూడున్నర దశాబ్దాల కరెంటు కష్టాలకు చరమగీతం



**తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నేటి నుండి 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది.**

**ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖిస్తున్నది.**

సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత వల్ల గంటల కొద్దీ విద్యుత్ కోతలతో జనజీవనం దుర్భరంగా మారింది. కనీసం మూడు నాలుగు గంటలు కూడా కరెంటు అందక పంటలు ఎండిపోయినయి. అర్ధరాత్రి, అపరాత్రి నీళ్లు పెట్టుకోవడానికి పోయిన రైతుల ప్రాణాలు కరెంటు షాకులకు బలైపోయినయి. లో ఓల్టేజి సమస్యతో ట్రాన్స్ ఫార్మర్లు పటాకుల వలె పేలిపోయేవి. నిరంతరం మోటార్లు కాలిపోయేవి.

పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వారంలో కొన్నిరోజులు పవర్ హాలిడేలు ప్రకటించే దుస్థితి ఆవరించి, పరిశ్రమలు మూతపడే స్థాయికి సంక్షోభం చేరింది.

సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో, కార్యదీక్షతో కృషి చేసి, మూడున్నరేళ్ల అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. తెలంగాణలో కరెంటు కోతలు ఇప్పుడు ప్రజలు మరిచిపోయిన గతం. 24 గంటల విద్యుత్ సరఫరా ఇప్పుడు ప్రజల నిత్యానుభవం. పవర్ హాలిడేలు పోయి ఎవ్రీ డే ఈజ్ పవర్ డే అనే రోజులొచ్చినయి. నిరంతర విద్యుత్ సరఫరాతో పరిశ్రమలలో ఉత్పత్తి పెరిగింది. కార్మికులకు కావాల్సినంత పని దొరుకుతున్నది. పెరిగిన వ్యవసాయోత్పత్తులతో రైతాంగంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. కొద్ది కాలంలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించబోతున్నది.

వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

## తెలంగాణలో ఇప్పుడిక అన్ని రంగాలకు 24x7 నాణ్యమైన విద్యుత్

### ఎత్తిపోతల పథకాలకు 12వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి సర్వసన్నద్ధం.

### లోటు నుంచి మిగులు వరకు

2వ జూన్ 2014 తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు.

1 జనవరి 2018 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 మెగావాట్లు.

కొద్ది కాలంలోనే అందుబాటులోకి వచ్చే విద్యుత్ 28,000 మెగావాట్లు.

### రూ.12,316 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థల పటిష్టం

వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ.12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1,724 కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించింది.

### సోలార్ పవర్‌లో దేశంలో నెంబర్ వన్

3,142 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

### జాతీయ సగటును దాటిన తలసరి విద్యుత్ వినియోగం

ఆర్థిక ప్రగతికి సూచికగా చెప్పబడే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1,200 యూనిట్లు, నేడు 1,505కు పెరిగింది. ఇది తెలంగాణలో జీవన ప్రమాణాల పెరుగుదలకు అద్దం పడుతున్నది.

### శరవేగంగా అల్ట్రా మెగా & సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం


- 4000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో టి.ఎస్.జెన్‌కో సారథ్యంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు నిర్మాణం జరుగుతున్నది.
- 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిశంబరు 2018 లో పూర్తి కానున్నవి
- 800 మెగావాట్లు కెటిపిఎస్ పవర్ ప్లాంటు ఈ మార్చిలో ఉత్పత్తి ప్రారంభం కానున్నది.

### తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్- 765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

### రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

- జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది.
- విద్యుత్ సంస్థల్లో 24,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత. దళారీ వ్యవస్థను నిర్మూలించింది.




తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ | ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

R.O.No.62/17

## సీఎంలూ.. అలా వెళ్లొద్దు

• ఇతర రాష్ట్రాల పర్యటనలపై కేంద్ర హోంశాఖ




**న్యూఢిల్లీ:** ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల్లో పర్యటనకు వెళ్లే పర్యటించవద్దని కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు పంపించింది. సీఎం పర్యటనకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా వెళ్లడం వల్ల భద్రతా పరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని.. ఇలాంటి సమస్యను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు హోంశాఖ తన నోటీసుల్లో పేర్కొంది. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు జెడ్ లేదా జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉంటుంది. 'వేరే రాష్ట్రంలో పర్యటనకు వెళ్లినపుడు ఆతిథ్యమిచ్చే రాష్ట్రం వచ్చిన ముఖ్యమంత్రికి ఒక్కోసారి సరైన సదుపాయాలు కల్పించలేకపోవచ్చు. అందువల్లే ముందస్తుగా సమాచారం ఇస్తే సీఎంకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు ఎటువంటి లోటు లేకుండా చేయడం జరుగుతుంది ' అని హోంశాఖ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు పంపించిన నోటీసుల్లో పేర్కొంది.

## నవ భారత నిర్మాతలకు స్వాగతం

• 2017 ఆఖరి 'మన్ కీ బాత్'లో ప్రధాని

**న్యూఢిల్లీ:** 21వ శతాబ్ది ప్రారంభంలో జన్మించిన వారందరూ 2018 లో ఓటుహక్కును పొందబోతున్నారని... వారే నవ భారత నిర్మాతలని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం 2017 'ఆఖరి మన్ కీ బాత్'లో మాట్లాడుతూ... 'సోమవారం ప్రత్యేకమైన రోజు, నవభారతానికి పునాదులు వేయడానికి 21వ శతాబ్ది వారసులు ఈ ఏడాది ఓటుహక్కును వినియోగించుకోబోతున్నారన్నారు'. మీ ఓటు మీకోసం కాకుండా భావి భారతం కోసం ఉపయోగించేలా ఉండాలన్నారు. 18–25ఏండ్ల వయస్సుగల యువకులు దేశంలోని అన్ని జిల్లాల్లో 'మాక్ పార్లమెంట్'లను నిర్వహించి దేశాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని పిలుపునిచ్చారు. 2022నాటికి స్వాతంత్య్ర సమర యోధులు కలలు కన్న దేశాభివృద్ధిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. సమాజంలో అసమానతలు తొలగిపోయి, శాంతి వికసించే భారతాన్ని నిర్మించాలని యువతకు సూచించారు. దేశంలో వీఐపీ సంస్కృతి పోయి ఈపీఐ (ఎవ్రీ పర్సన్ ఈజ్ ఇంపార్టెంట్) సంస్కృతి రావాలని ఆకాంక్షించారు. బౌద్ధిక యువతకోసం నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా ఎన్నో అవకాశాలు సృష్టిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆవు మాంసం తరలిస్తున్నారని...
## ఇద్దరు బాలికల అరెస్టు

• యూపీ ముజఫర్నగర్లో దారుణం

**ముజఫర్నగర్:** ఆవు మాంసం తరలిస్తున్నారనే ఆరోపణతో ఇద్దరు బాలికలను అరెస్టు చేసిన ఘటన యూపీలోని ముజఫర్నగర్లో కలకలం రేపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు మైనర్ బాలికల ను కటకటాల వెనక్కి నెట్టారు. వీరిలో ఒకరి వయస్సు 12ఏండ్లు కాగా మరొకరి వయస్సు 16 ఏండ్లు. శుక్రవారం ఉదయం ఆవును చంపారని ఆరోపిస్తూ కటౌలీ పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు మైనర్ బాలికలు ముగ్గురు మహిళలున్నారు. ఒకరింట్లో పది క్వింటాళ్ల ఆవుమాంసాన్ని పోలీసులు సీజ్ చేశారు. సాయంత్రం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా మైనర్ బాలికలని జువైనల్ హోమ్కు తరలించారు. వారి తండ్రిని కూడా దోషిగా తేల్చారు.

## పదినెలల పాలన.. వెయ్యి ఎన్కౌంటర్లు

**లక్నో:** ఉత్తరప్రదేశ్లో యోగి సర్కారు అధికారంలోకి వచ్చాక..నేరాలు,ఘోరాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. అయితే వీటిని కట్టడి చేయటానికి చట్టాలు, న్యాయస్థానాలు ఉన్నా.. గన్రాజ్ నడుస్తోంది. యోగి ముఖ్యమంత్రి అయ్యాక పదినెలలు పూర్తయ్యాయో.. లేదో కానీ ఇప్పటిదాకా సుమారు వెయ్యి మంది ఎన్కౌంటర్లో బలయ్యారు. రెండు వేలమందికి పైగా క్రిమినల్స్ కటకటాల వెనక్కి వెళ్లారు. అయినా ఉత్తరప్రదేశ్లో సామాన్యులకు రక్షణ లేదనేలా ఆటవిక రాజ్యమేలుతోంది. అండర్ వరల్డ్, బలవంతపు వసూళ్లు, భూ కబ్జా, వేశ్యవృత్తి, అపహరణ, బెదిరింపు లాంటి తీవ్రమైన నేరాలను నియంత్రించటానికి (యూపీసీఓసీఏ) చట్టాన్ని తెరపైకి తెచ్చింది. మహారాష్ట్రలో నేర నియంత్రణకు తెరపైకి తెచ్చిన మోకా చట్టాన్ని అచ్చుగుద్దీ యూపీలోనూ అమలు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయించారు. గూండాలు యూపీ వదిలి పారిపోవాలంటూ యోగి వార్నింగ్లిచ్చారు. పెద్ద పెద్ద వాగ్దానాలు చేశారు. కానీ యూపీలో శాంతిభద్రతల పరిస్థితులు అదుపు తప్పాయని అక్కడి పోలీసు అధికారులిచ్చిన వార్షిక నివేదికలో తేటతెల్లమైంది. దుండగులు, పోలీసుల మధ్య 895 కాల్పుల ఘటనలు జరిగితే, అందులో 358 (అత్యధికంగా) ఎన్కౌంటర్లు మీరట్లోనే జరగటం విశేషం. ఆగ్రాలో 175 మంది, బరేలీలో 149 మంది ఎన్కౌంటర్లో హతమార్చారు..ఈ పదినెలల వ్యవధిలో..2186 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిలో 1680 వాంటెడ్ క్రిమినల్స్ కాగా, వీరిపై రివార్డులు కూడా ప్రకటించి ఉన్నవి. ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి లోనూ 39 ఎన్కౌంటర్లు జరిగాయి... గోరఖ్పూర్ జోన్లో 24, లక్నోలో 27 ఎన్కౌంటర్లు జరిగాయని రిపోర్టుల్లో ప్రస్తావించారు. ఉత్తరప్రదేశ్లో పంచాయతీల స్థాయిలోనే నేర ఘటనలు పరిష్కారం కావటం వల్లనే పోలీసు స్టేషన్లలో అడుగుపెట్టని కేసుల సంఖ్య భారీగా ఉండొచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**సీఎం కాన్వాయ్ను అడ్డుకున్నాడని..**

యూపీ సీఎం కాన్వాయ్ను అడ్డుకున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకున్నారు.సోన్భద్ర ప్రాంతంలో బీజేపీ ఎమ్మెల్యే, అధికారులు కుమ్మక్కై ఇసుక అక్రమ తవ్వకాలకు చేస్తున్నారని..ఈ విషయాన్ని యోగి దృష్టికి తీసుకెళ్లేందుకే తాను ఈ ప్రయత్నం చేసినట్టు అతను తెలిపాడు. ఈ విషయాన్ని బీజేపీ నేతలకు విన్నవించినా ఫలితంలేదని..ముఖ్యమంత్రికి నివేదించా లనుకున్నానని చెప్పాడు.

# విద్య, ఆరోగ్యం, గిరిజనులు, దళితుల అభివృద్ధే..
# వామపక్ష ప్రభుత్వ ఎజెండా

## అందుకే మమ్మల్ని ప్రజలు ఆదరిస్తున్నారు

• సంఘ్పరివార్ సాగిస్తున్న జాతి,మత విభజన కుట్రల్ని సమైక్యంగా ఎదుర్కొంటాం
• సీపీఐ(ఎం) నేత, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్తో ప్రత్యేక ఇంటర్వ్యూ


ఏచూరితో త్రిపుర సీఎం మాణిక్ సర్కార్

**కోల్కతా:** మూడువైపులా బంగ్లాదేశ్తో సరిహద్దు కలిగి మూసివేసి నట్టుండే త్రిపుర చిన్న రాష్ట్రమే అయినా అక్కడ ఒకే పార్టీ సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగడం ఆషామాషీ కాదు. పలు జాతులు, మతాలతో కూడిన ఆ రాష్ట్ర ప్రజల్ని ఐక్యతా భావంతో సమన్వయపరుస్తూ సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం ప్రజారంజక పాలన కొనసాగిస్తోంది. విద్య, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ కనబరుస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఇటీవల ఆ రాష్ట్రంలో జాతులు, మతాల పేరుతో చిచ్చు పెట్టేందుకు సంఘ్పరివార్ శక్తులు పలు కుయుక్తులు పన్నాయి. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు జరుగుతున్న విచ్ఛిన్నకర దోరణుల్ని ఎండకడుతూ డిసెంబర్ 28న కోల్కతాలో త్రిపుర సంఘీభావ దినాన్ని వామపక్ష పార్టీలు పాటించాయి. అంతకుముందురోజు త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్సర్కార్తో నవతెలంగాణ కోల్కతా విలేకరి సందీప్ చక్రవర్తి ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించారు.

**సందీప్:** జాతీయ మానవాభివృద్ధి సూచీలో త్రిపురను ముందు భాగాన నిలబెట్టడంలో వామపక్ష ప్రభుత్వం ఏ అంశాలను కీలకంగా ఎంచుకున్నది..?

**మాణిక్:** విద్య, ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టి సారించాం. మానవ


త్రిపురలో సీపీఐ(ఎం) ఎన్నికల ప్రచార సభకు హాజరైన జనం

వనరులను అభివృద్ధి చేయడంలో మేం ఎంచుకున్న ప్రాధామ్యాలే మాకు మార్గ నిర్దేశనం చేశాయి. విద్య మన జన్మహక్కు. అక్షరాస్యత లేకుండా అభివృద్ధి సాధించలేం. ప్రణాళికలో పంచాయతీలు, స్థానిక సంస్థలు, సంఘాలు, ప్రగతిశీల మేధావులను భాగస్వాములను చేశాం. అక్షరాస్యతను పెంచడం కోసం స్పష్టమైన బ్లూప్రింట్తో ప్రజల దగ్గరికెళ్లాం. గ్రామాలు, పట్టణాలకే మా కార్యక్రమాలు పరిమితం కాలేదు. దోషులుగా శిక్షలు పడి జైళ్లలో ఉన్నవారినీ అక్షరాస్యులుగా మార్చేందుకు జిల్లా మెజిస్ట్రేట్లతో కలిసి సమన్వయంతో పని చేశాం. ఆవాసాలున్న ప్రతిచోటా, రెండు మూడు కుటుంబాలే ఉన్నాసరే ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్ని ఏర్పాటు చేశాం. అటువంటి చోట్ల రెండుమూడు మాధ్యమిక పాఠశాలలకు అనుసంధానంగా ఓ హైస్కూల్ను ఏర్పాటు చేశాం. ప్రతి సబ్డివిజన్లో ఓ పారిశ్రామిక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేశాం. అటవీ హక్కుల చట్టం కింద గిరిజనులకు భూమి పట్టాలు ఇవ్వడంలో మేం ముందున్నాం. యూపీఏ–1 హయాంలో వామపక్షాల ప్రోద్బలంతోనే ఈ చట్టం వచ్చింది. ప్రాధామ్యాలను గుర్తించడంలో ఇతరులకూ మాకూ తేడా ఉన్నది. ఇతర పార్టీల నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్లు, పెట్టుబడిదారులు,వడ్డీ వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా ప్రాధామ్యాలను నిర్ణయిస్తాయి. శ్రామికులు, రైతులు,ఉద్యోగులు, మధ్యతరగతి, పేదల అభివృద్ధే మా ప్రాధామ్యాలు.

**సందీప్:** త్రిపుర అభివృద్ధి నమూనా గురించి చెప్పండి..?

**మాణిక్:** త్రిపుర అభివృద్ధి నమూనాలో మా నినాదం 'ప్రజల కోసం కార్యక్రమాలు, కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం'... అదే మాకు విజయాన్ని చేకూర్చింది. ఇది ప్రత్యామ్నాయ విధానం. ఇక్కడ ప్రజలే తమ ప్రణాళికల్లో భాగస్వాములవుతారు. ఇతరుల అభివృద్ధి నమూనా దోపిడీదారుల కోసం, మాది దోపిడీకి గురవుతున్నవారి కోసం. అదే వారికీ మాకూ తేడా..

**సందీప్:** భారత రాజ్యాంగం నుంచి లౌకిక భావనను తొలగించాలని కేంద్రమంత్రి అనంత్హెగ్డే చేసిన డిమాండ్పై..

**మాణిక్:** అది కొత్తదేమీకాదు. వాస్తవానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ మనసులో ఉన్నదే చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా పని చేస్తున్నారు. హిందూత్వ పేరుతో వారు గోవులను పూజించడం ప్రారంభించారు. ప్రజలు ఏమి తినాలో నిర్ణయించుకునే హక్కును లాగేసుకున్నారు. ఘర్ వాపసీవంటివన్నీ రాజ్యాంగానికి నష్టం కలిగించేవే. అయితే, లౌకికత్వాన్ని వ్యతిరేకించే ఈ శక్తుల పట్ల దేశంలోని మెజార్టీ జనాల నుంచి నిరసన వ్యక్తం కావడం శుభపరిణామం. విచ్ఛిన్న శక్తులపై పోరాటానికి ప్రగతిశీల, మేధావి వర్గాలు ఐక్యంగా ముందుకు వస్తున్నాయి.

**సందీప్:** త్వరలో మీ ప్రభుత్వం కీలకమైన అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉన్నది. ఇటీవల మీ రాష్ట్ర రాజకీయాల్లోకి కేంద్రంలోని అధికార పార్టీ ప్రవేశించింది. అక్కడ రహస్య కార్యక్రమాలేవో ఆ పార్టీ నిర్వహిస్తున్నట్టు అంతా అనుకుంటున్నారు. మీరెలా ఎదుర్కొంటారు..?

**మాణిక్:** మేం పాఠశాలల్లో చదువుకునే రోజుల్లో జన్సంఘ్ ఉండేది. అది బీజేపీకి మాతృ సంస్థ. ఆర్ఎస్ఎస్ కూడా పని చేసేది. అవి అప్పుడు ప్రభావం చూపలేకపోయాయి. ఇప్పుడు వారు మార్క్సిజాన్ని తమ ఆగర్భ శత్రువుగా భావిస్తున్నారు. వారికి వామపక్ష కూటమి పట్ల భయం కూడా ఉన్నది. దాంతో,వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కేరళ, త్రిపుర ప్రభుత్వాలను కూల్చేందుకు వారు కుట్రలు పన్నుతున్నారు. అందుకు జాతులు, మతాల మధ్య విభజనను వారు ఎంచుకున్నారు.

ఆర్థిక తోడ్పాటు కోసం త్రిపురలాంటి చిన్న రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడాలి. ప్రాజెక్టులకు క్లియరెన్స్ తెచ్చుకోవాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎన్ఆర్ఈజీఏ)ని అమలు చేయడంలో త్రిపుర మొదటి స్థానంలో ఉన్నది. కానీ, వారు మాకు పని దినాలను పెంచేందుకు అనుతించడంలేదు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కూడా రానివ్వడంలేదు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలోనూ సీఐఏ, ఐఎస్ఐ సహకారంతో ఆ పార్టీ అధికారంలో ఉన్నపుడు ప్రగతిశీల శక్తుల్ని అణిచివేసేందుకు ప్రయత్నించారు. అటువంటి దాడుల్ని చైతన్యవంతమైన పౌర సమాజం తిప్పి కొట్టింది. ఇప్పుడు కూడా జాతులు, మతాల పేరుతో అటువంటి కుట్రలే జరుగుతున్నాయని గ్రహించిన ప్రజలు వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు.

**సందీప్:**స్వాతంత్య్రానంతరం దేశంలోని మిగతా ప్రాంతాలతో సమాచార సంబంధాలను నెలకొలుపుకోవడంలో త్రిపుర సమస్యలనెదుర్కొంటోంది. బంగ్లాదేశ్ ద్వారా సమాచార కారిడార్ను ఏర్పాటు చేయాలన్న మీ పట్టుదల గురించి..?

**మాణిక్:** దేశ విభజన తర్వాత త్రిపుర పరివేష్టిత రాష్ట్రం(ల్యాండ్ లాక్డ్)గా మారింది. మూడు వైపులా వేరే దేశం, ఓవైపు అస్సాం రాష్ట్రం. తర్వాతి కాలంలో తూర్పు పాకిస్థాన్ వేరుపడి బంగ్లాదేశ్ ఏర్పడింది. రోడ్డు మార్గం కోసం త్రిపుర.. చికెన్ నెక్ ద్వారా ఈశాన్య ప్రాంతంపై ఆధారపడుతోంది. జాతీయ రహదారి,రైల్వేలైన్, టెలీకమ్యూనికేషన్ నెట్వర్క్ను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. ఇప్పటికే చెప్పుకోదగినస్థాయిలో మెరుగుపరిచాం.

**సందీప్:** భారత్, బంగ్లాదేశ్ మధ్య ప్రత్యేక సంబంధాలున్నాయి. మీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకుంటూ ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం చేయడంపై..మీ కామెంట్స్..

**మాణిక్:** బంగ్లాదేశ్, త్రిపుర మధ్య దీర్ఘకాలిక సంబంధాలున్నాయి. త్రిపుర ప్రజల అభివృద్ధి కోసం పని చేయడానికి బంగ్లాదేశ్ సంసిద్ధతతో ఉన్నది. స్వాతంత్ర్యానికి పూర్వం మా రాష్ట్రం బంగ్లాదేశ్ నదీజలాలపై ఆధారపడేది. ద్వైపాక్షిక సంబంధాలపై త్రిపుర భవిష్యత్ ఆధారపడి ఉన్నది. దక్షిణాసియాతో ఈశాన్య రాష్ట్రాలకు త్రిపుర ఓ గేట్వేగా మారేందుకు అవకాశమున్నది. ఢాకా–ఛత్తర్గ్రామ్, అగర్తలాను కలుపుతూ విమానాలు నడపాలని కేంద్ర విమానయానశాఖకు ఇప్పటికే మేం లేఖ రాశాం. బంగ్లాదేశ్తో సముద్ర మార్గాన్ని అభివృద్ధి చేయాలని కూడా కోరాం. అండర్గ్రౌండ్ కేబుల్ ద్వారా కాక్సబజార్ మార్గంలో అగర్తలాకు కనెక్టివిటీ ఇప్పటికే ఏర్పాటైంది. టెలీ కమ్యూనికేషన్ను అభివృద్ధి పరచడంలో త్రిపుర ప్రభుత్వం సాధించిన చెప్పుకోదగిన అంశం ఇది.

**సందీప్:** ఈశాన్య రాష్ట్రాల్లో సైనిక దళాల ప్రత్యేక చట్టాన్ని వ్యతిరేకించేవారిలో మీది ప్రముఖ పాత్ర. అందుకు దారితీసిన కారణాలేమిటి..?

**మాణిక్:** ఉగ్రవాదం పెచ్చుమీరినపుడు సైన్యాన్ని పిలుస్తాం. ఆ సమయంలో ఏఎఫ్ఎస్పీఏ, ఎన్ఏఎస్ఏకు కట్టుబడి ఉంటాం. సైనిక కార్యకలాపాలు ప్రారంభం కాగానే అతిక్రమణలేమైనా జరుగుతున్నాయా అన్నదానిపై దృష్టి సారిస్తాం. ఒకటి రెండు అతిక్రమణలు జరిగినప్పటికీ సైన్యం అవగాహనతోనే పని చేసింది. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఉగ్రవాదాన్ని ఓడించలేమని వారికి కూడా తెలుసు. పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఏఎఫ్ఎస్పీఏను ఉపసంహరించాలని కోరుతాం. సూత్రరీత్యా ప్రత్యేక చట్టాన్ని మేం వ్యతిరేకించాం.

**సందీప్:** త్రిపురలో ఉన్నత విద్యా సంస్థలు కొన్ని మాత్రమే ఉన్నాయి. దీనికి సంబంధించి మీ డిమాండ్స్..?

**మాణిక్:** కోల్కతాకు వెళ్లాల్సి రావడంతో యూనివర్సిటీ విద్యకు నేను దూరమయ్యాను. పాఠశాల బోర్డు పరీక్షలు కూడా నేను పశ్చిమబెంగాల్ బోర్డు ద్వారా పాసయ్యాను. ఇప్పుడు మాకు సొంత బోర్డు ఉన్నది. ప్రతి సబ్డివిజన్లోనూ కాలేజీ ఉన్నది. 25 కళాశాలలు, మూడు యూనివర్సిటీలు మా రాష్ట్రంలో ఉన్నాయి. పాఠశాల డ్రాపవుట్స్ను 4–5 శాతానికి తగ్గించాం. ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. పదిలక్షలకన్నా కాస్త ఎక్కువ జనాభాకు 17 ఐటీఐ, ఆరు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ప్రతి బ్లాక్లో ఐటీఐ కోసం ప్రయత్నిస్తున్నాం.

**సందీప్:** ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఇంకా ఎలాంటి ప్రణాళికలున్నాయి. ముఖ్యంగా గిరిజనుల కోసం..?

**మాణిక్:** సంస్థానాల పాలనలో ఉన్నపుడు త్రిపురలోని పేద ప్రజల అభివృద్ధి కోసం జరిగిన కృషి చాలా తక్కువ. ఆ సమయంలో గిరిజనుల జనాభా అధికంగా ఉండేది.

**సందీప్:** త్రిపురలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య సమన్వయం సాధించడంలో మీ కృషి గురించి చెప్పండి..? 80లలో ఎదురైన ఉగ్రవాద సమస్యను ఎలా నియంత్రించగలిగారు..?

**మాణిక్:**వామపక్ష ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉగ్రవాదాన్ని ఆయుధాల ద్వారా కాకుండా రాజకీయంగా, సిద్ధాంతపరంగా ఎదుర్కొన్నాం. ప్రజల మధ్య సమన్వయంతో ఉగ్రవాదాన్ని లేకుండా చేశాం.

**సందీప్:** దేశంలోని నిరాడంబర ముఖ్యమంత్రుల్లో మీరొకరు. మీ పట్ల, మీ పార్టీ పట్ల ప్రజలు విశ్వాసాన్ని కొనసాగిస్తూ వచ్చారు. రానున్న ఎన్నికల్లో మీరు ఎంచుకున్న ప్రత్యామ్నాయం పట్ల ప్రజా స్పందన ఎలా ఉంటుంది..?

**మాణిక్:**లౌకిక శక్తులతో కలిసి పని చేస్తాం. ప్రజా జీవితాలను మెరుగు పరచడం, గిరిజనులు,దళితులకు భూమి పట్టాలు మంజూరు చేయడం కొనసాగిస్తాం. ప్రజలకు నష్టం కలిగించే ఎలాంటి కార్యక్రమం చేపట్టం. అదే ప్రజల్ని మళ్లీ మాపై విశ్వాసం ఉంచేలా చేస్తుంది. మేం మూడు కార్యక్రమాలు ప్రారంభించాం. ఒకటి..గిరిజనుల అభివృద్ధి, రెండు..దళితుల అభివృద్ధి, మూడు..మొత్తంగా రాష్ట్ర అభివృద్ధి.. ప్రతి ఎన్నికా కీలకమే. రాష్ట్ర అభివృద్ధే మా ప్రచారంలో ఉంటుంది.

**సందీప్:** పర్యాటక రంగంలో మీ ప్రభుత్వ విధానం గురించి చెప్పండి..?

**మాణిక్:** మనది బహు భాషల, బహుళ జాతుల దేశం. ప్రార్థనల కోసం ప్రజలు ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ ఉన్నది. మా ప్రభుత్వం పర్యావరణ పర్యాటకానికి ప్రాధాన్యత ఇస్తుంది. మత వైభవాలు, చారిత్రక ప్రాంతాలు కలగలసి ఉన్నాయి. జాతీయ సమైక్యతను కోరుకునే ఎవరైనా ఇక్కడికొస్తారు.

## త్రిపుర మళ్లీ 'లెఫ్ట్'దే

• సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

**అగర్తల :** త్రిపురలో ఈ ఏడాది ప్రారంభంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ఘన విజయం సాధిస్తుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అంతేకాక, బీజేపీ విజయాల పరంపరకు ఈశాన్య రాష్ట్రమైన త్రిపుర బ్రేక్ వేయగలదని స్పష్టం చేశారు. అగర్తలలో లెఫ్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రజల్లో ఉత్సాహం చూస్తుంటే రాష్ట్రంలో లెఫ్ట్ఫ్రంట్ ఎనిమిదోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదని కచ్చితంగా చెప్పగలనన్నారు. గుజరాత్లో ప్రజలను విడగొట్టి బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. అంతేకాక, మణిపూర్, గోవాలో సైతం రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. బీజేపీ పార్టీ మతతత్వంలో మునిగిపోయిందని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం..దేశాన్ని వెనక్కి తీసుకెళ్లిందని తెలిపారు. మోడీ సర్కారు ఇప్పటికే ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ, వీటిలో ఏదీ నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఇప్పుడు కూడా అనేక హామీలు ఇస్తుందని, వాటిని ప్రజలు నమ్మొద్దని ఈ సందర్భంగా తెలిపారు.



## అమెరికా, రష్యాల మధ్య ఆచరణాత్మక సహకారం

• ట్రంప్కి పంపిన నూతన సంవత్సర సందేశంలో పుతిన్ పిలుపు

**మాస్కో:** ప్రపంచ సుస్థిరతకు అగ్రరాజ్యాలైన రష్యా, అమెరికాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరగాల్సిన అవసరం ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఆచరణాత్మక సహకారం ఉండాలనీ ఆకాంక్షించారు. ఈ విషయాన్ని ట్రంప్కు పంపిన నూతన సంవత్సర సందేశంలో పుతిన్ పేర్కొన్నారని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. రెండు దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పటానికి పరస్పర గౌరవం పునాదులు వేస్తుందనీ, ఆచరణాత్మక సహకారానికి ఇది దారి చూపుతుందని పుతిన్ అభిప్రాయపడ్డారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ తదితరులకూ పుతిన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ లేఖలు పంపారని క్రెమ్లిన్ కార్యాలయం పేర్కొన్నది.

## కెన్యాలో ఘోర రోడ్డు ప్రమాదం

• బస్సు, ట్రక్కు ఢీ : 36 మంది మృతి, 11 మందికి గాయాలు

**నైరోబీ :** కెన్యాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 36 మంది మృతి చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. రిఫ్ట్ వ్యాలీ డీఎస్పీ జీరో అరోమ్ తెలిపిన వివరాల ప్రకారం...నాకూర్–ఎల్డోరెట్ హైవేలో ఆదివారం తెల్లవారుజామున నాకూర్ ప్రాంతం నుంచి బుసియా వైపునకు వస్తున్న ట్రక్కు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్నది. ఈ ఘటనలో బస్సు, ట్రక్కు డ్రైవర్ల సహా 36 మంది చనిపోయారు. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు అరోమ్ తెలిపారు.

# అఫ్ఘాన్లో ఆత్మాహుతి దాడి

## 15 మంది మృతి, 13 మందికి గాయాలు



**కాబూల్ :** అఫ్ఘనిస్తాన్లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 15 మంది మృతి పౌరులు మృతి చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. జలాలాబాద్ ప్రావిన్స్ గవర్నర్ అధికార ప్రతినిధి అత్తావుల్లా ఖోగ్యానీ తెలిపిన వివరాల ప్రకారం.. హస్కమేనా మాజీ గవర్నర్ అంత్యక్రియలు జరుగుతున్న సమయంలో ఆత్మాహుతి దాడి జరిగింది. స్మశానవాటికలో ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. ఈ ఘటనలో 15 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 13 మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి పరిసర ప్రాంతాలన్నీ దద్దరిల్లాయి. స్థానిక ప్రజలు ప్రాణ భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకో లేదు. కాబూల్లో గతవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 41 మంది మృతి చెందగా, 80 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఐఎస్ ప్రకటించుకుంది. ఐఎస్ ఉగ్రవాదులే ఈ ఘాతుకానికి కూడా ఒడిగట్టి ఉంటారని అధికారులు, పోలీసులు అనుమాని స్తున్నారు. ఇదిలా ఉండగా, ఉగ్రవాదుల ఏరివేత కోసం అఫ్ఘాన్ ప్రత్యేక భద్రతా బలగాలు, అమెరికా సంకీర్ణదళాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్ను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని తాలిబన్లు హెచ్చరించారు. ప్రభుత్వం ఐఎస్, తాలిబన్ల హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని ఐఎస్ కుట్ర పన్నింది. సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడులకు పాల్పడుతున్నది.

## రక్కాలో ఐఎస్ నరమేధం

• 115 మృతదేహాలను వెలికితీసిన బలగాలు

**డమాస్కస్ :** ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ ) ఉగ్రవాదులు రక్కా నగరంలో నరమేధం సృష్టించారు. వందలాది మంది అమాయక ప్రజలను పొట్టనబెట్టుకున్నారు. సిరియా, రష్యా భద్రతా బలగాలు నిర్వహించిన జాయింట్ ఆపరేషన్లో వేలాది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మరి కొంత మంది ఇతర ప్రాంతాలకు పారిపోయారు. అయితే, రక్కా ప్రాంతంలో ఐఎస్ సృష్టించిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా, అల్వావీ నగరంలో గృహ నిర్మాణం కోసం కూలీలు తవ్వకాలు జరుపుతుండగా 115 మృతదేహాలు బయటపడ్డాయి. వీటిలో పలు మృతదేహాలు కుళ్లిపోయి ఉన్నాయి. ఉగ్రవాదులు భారీ ఎత్తున నరమేధానికి పాల్పడ్డారని అధికారులు ధ్రువీకరించారు. మృతదేహాలను పోస్ట్మార్టమ్ కోసం పంపించారు. ఇదిలా ఉండగా, రక్కా ప్రాంతాన్ని 2014లో ఐఎస్ స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాంతంలోని ప్రజలను అపహరించి తమ బానిసలుగా మార్చుకుంది. వేలాది మందిని హతమార్చింది. ఐఎస్ అరాచకాలతో విసిగిపోయిన స్థానిక ప్రజలు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. ఐఎస్ ఆధీనంలో ఉన్న రక్కా నగరాన్ని సిరియా భద్రతా బలగాలు గతేడాది మార్చిలో తిరిగి స్వాధీనం చేసుకున్నాయి.

## ఇరాన్లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు..

**టెహ్రాన్ :** ఇరాన్లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు భగ్గుమంటున్నాయి. దొరౌద్ నగరంలో నిరసనకారులు భారీ ర్యాలీ తీశారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో చెలరేగిన అల్లర్లలో ఇద్దరు పౌరులు మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. లోరెస్టాన్ గవర్నర్ అధికార ప్రతినిధి హబీబ్ తెలిపిన వివరాల ప్రకారం...దొరౌద్ నగరంలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. కాగా, ఇరాన్లో నిత్యవసర ధరలు మిన్నంటాయి. నిరుద్యోగ సమస్య విలయ తాండవం చేస్తున్నది. ధరలు నియంత్రించడంలో, నిరుద్యోగ సమస్యను నిర్మూలించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దీంతో, ప్రజలు వీధుల్లోకి చేరుకొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఇరాన్ స్టేట్ మీడియా తెలిపిన వివరాల ప్రకారం...ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతమయ్యాయి.

అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 1-1-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 4 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు వెల : 5.00







పదినెలల పాలన..

## వెయ్యిఎన్‌కౌంటర్లు..

- యోగిరాజ్‌లో అంతులేని అరాచకాలు
- మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో 39 ఎన్‌కౌంటర్లు

2లో



నేటి నుంచి వ్యవసాయానికి

# 24గంటల కరెంట్

### రైతాంగానికి సర్కారు నూతన సంవత్సర కానుక

### పోతాయిపల్లి రైతు పొలంలో ప్రారంభించిన డి ప్రభాకరరావు

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

నూతన సంవత్సర కానుకగా రాష్ట్రప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను సరఫరా లాంఛనంగా ప్రారంభించింది. మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలం పోతాయిపల్లి గ్రామంలో చింతల వెంకటరెడ్డి అనే రైతు పొలంలో టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు శనివారం అర్ధరాత్రి 12 గంటల ఒక్క నిముషానికి లాంఛనంగా 24 గంటల విద్యుత్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన ప్రకారం జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు విద్యుత్ సంస్థలు ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాయి. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది. రైతులు తమ మోటార్లకు



పెట్టిన ఆటోస్టార్టర్లను తొలగించుకోవాలని ఇప్పటికే సూచించింది. ఆటోస్టార్టర్ల వల్ల భూగర్భ జలాలు అడుగంటి, పంట పొట్టకొచ్చే దశలో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వం రైతాంగానికి ...9లో




# రూటు మారిన చదువులు



### యూఎస్ కాదు..కెనడా వైపు చూపు

### ట్రంప్ విధానాలతో అయోమయంలో అమెరికా విద్య

### ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు కెనడాలో మెండు

### మూడేండ్లలో పెరుగుతున్న భారతీయ విద్యార్థులు

వలస చదువుకు హద్దులు..ఎల్లలనేవి ఉండవు. ఏ దేశంలో చదువుకుంటే.. ఆ దేశంలో తమకు ఉపాధి దొరుకుతుందో.. అటువైపు విద్యార్థులు ఆసక్తి చూపటం సహజం. ఏండ్ల తరబడి ఎలాంటి ఇబ్బందుల్లేకపోవటంతో..యూఎస్ చదువులపై భారతీయ యువతరం దృష్టిపెట్టింది. ప్రధానంగా మోడీ సర్కారు అధికారంలోకి వచ్చాక..స్వదేశంలో ఉపాధి అవకాశాలు సన్నగిల్లటం.. మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న వలస వ్యతిరేక విధానాలు అక్కడ చదువునే అవకాశాలను దెబ్బతీశాయి. దీంతో మరో వలసదేశమైన కెనడాపై చూపు పడింది.

వివరాలు 9లో

# భ్రష్టుపట్టిన రాజకీయాలు

### పార్టీ పెడతా.. ఎన్నికల్లో పోటీ చేస్తా

### తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కీలక ప్రకటన



**చెన్నై:** ఏండ్లుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ఆరంగేట్రం చేస్తారా? లేదా? అన్న అనుమానాలు ఒక్కసారిగా పటాపంచలయ్యాయి. త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్టు ఆయనే స్వయంగా సంచలన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో దేశం దృష్టి తమిళ రాజకీయాలపై పడింది. అమ్మ మరణం తర్వాత ప్రజల నేత తమిళనాడులో కరువయ్యారని వార్తలొస్తున్న నేపథ్యంలో రజనీకాంత్ చేసిన ప్రకటన ఆ రాష్ట్ర రాజకీయాల దశ దిశను మార్చుతుందేమోనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశంలో రాజకీయాలు భ్రష్టు పట్టి పోయాయంటూ రజనీకాంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెన్నైలో అభిమానులు, మద్దతుదారులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. త్వరలోనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. అంతేకాదు.. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పుడు గనుక రాజకీయాల్లోకి రాకపోతే ఆ అపరాధం తనను వెంటాడి వేటాడుతుందని తెలిపారు. 'అభిమానులారా.. యుద్ధానికి సిద్ధంగా ఉండండి. రాజకీయ వ్యవస్థలోని అవినీతిపై పోరాడేందుకు ఇదే సరైన సమయం' అంటూ ఆయన మాట్లాడిన తీరు తమిళ ప్రజల్లో కొత్త ఊపును ...9లో

# ముష్కరదాడి

### జమ్ముకాశ్మీర్ సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై...

### ఐదుగురు జవాన్లు మృతి, ముగ్గురికి గాయాలు

### ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన బలగాలు

**శ్రీనగర్:** జమ్మూకాశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత శిబిరంపై గ్రెనేడ్‌లతో విరుచుకుపడ్డారు. పెద్ద ఎత్తున ఆయుధాలతో ప్రవేశించిన వారు.. విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూ విధ్వంసం సృష్టించారు. దీంతో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులూ హతమయ్యారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న మరో జవాను గుండెపోటుతో మరణించినట్టు సమాచారం. మరోవైపు దాడికి తమదే బాధ్యత అని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. ఈ ఘటన కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసుల ...9లో



# యువకుడు ఆత్మహత్య

### గ్రూప్-2 ఫలితాల జాప్యంతో మనస్తాపం

**నవతెలంగాణ -మిర్యాలగూడటౌన్**

గ్రూప్-2లో 461 మార్కులు వచ్చి సర్టిఫికేషన్ల వెరిఫికేషన్ పూర్తయ్యాక కూడా పలు కారణాల వల్ల జాబు రాకపోవటం...మరోవైపు అనారోగ్య సమస్యతో తాళలేక మనస్తాపంతో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడపట్టణంలో ఆదివారం జరిగింది. రైల్వేపోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రానికి చెందిన మొడం బచ్చిరెడ్డి, వరమ్మ దంపతుల మూడవ కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి (30) ఆదివారం తెల్లవారుజామున మిర్యాలగూడలోని రైల్వేస్టేషన్ 115 కిలోమీటర్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల జరిగిన గ్రూప్-2 పరీక్షలో 461 మార్కులు సాధించి ఎంపికయ్యాడు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం కూడా పోయివచ్చాడు. హైకోర్టులో కేసు ఉండటం ఇంటర్వ్యూలు నిలిచిపోయాయి. దీంతో కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలోనే పెద్దపేగు సంబంధింత వ్యాధి సోకంది. ఆ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఇటీవల ఆస్పత్రిలో చూపించుకున్నా జబ్బునయం కాదని డాక్టర్లు చెప్పారు. ఓవైపు ఉద్యోగం రాక, మరోవైపు జబ్బు నయం కాక దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరెడ్డి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

### సర్కారు నిర్లక్ష్యం వల్లే ఆత్మహత్యలు

9లో

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం విప్లవకుమార్, ఎ విజయ్‌కుమార్

# మరుణ విషాదం

### అప్పుల బాధతో కౌలు రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

**నవతెలంగాణ-లక్షెట్టిపేట**

సాగు కోసం చేసిన అప్పులు కట్టలేక కౌలు రైతు, అతని భార్యా పురుగుల మందు తాగారు. భార్య అక్కడికక్కడే చనిపోగా...భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం చందారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ఇసాక్ వివరాల ప్రకారం.. చందారం గ్రామానికి చెందిన బానావత్ బాపులాల్, విజయ(28) దంపతులు. వారు ఐదెకరాలను కౌలుకు తీసుకొని పత్తి, వరి, కంది పంటలు సాగుచేశారు. పంట పెట్టుబడి కోసం రూ.ఐదు లక్షల అప్పు చేశారు. పంట ...9లో

# గురుకుల పీజీటీ ఫలితాలు విడుదల

- 921 పోస్టులకు 838 మంది ఎంపిక
- ఆప్షనల్ సబ్జెక్టులకు 475 మంది, లాంగ్వేజ్‌లకు 363 మంది
- 83 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల్లేరు : టీఎస్‌పీఎస్సీ

వివరాలు 6లో








## ప్రతిభ ఉంటే కాదు..

# పైసలిస్తేనే..

### స్పోర్ట్స్ కోటా మెడికల్ సీట్ల భర్తీలో అక్రమాలు

### ఓ విద్యార్థినికి పతకం

### రాకున్నా వచ్చినట్టు అధికారుల సృష్టి

### అంతర్జాతీయ స్థాయిలో ఆడినా సీటు సున్నా

### సీట్లు కోల్పోతున్న ప్రతిభావంత క్రీడాకారులు

మెడికల్ సీటు పొందాలంటే చాలా కష్టపడాలి. లేదా కోట్లరూపాయలన్నా ఉండాలి. ఈ రెండూ లేకుండా మరోదారి కూడా ఉంది. అదే స్పోర్ట్స్ కోటా. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉపయోగపడాల్సిన ఈ కోటా, కొందరు అక్రమాధికారుల చేతలతో వారికి దూరమవుతున్నది. కోట్లు పెట్టి మెడికల్ సీట్లు కొనుక్కోలేని వారు...లక్షలిచ్చి స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో పాటు అధికారులనూ కొనుక్కుంటున్నారు. దీంతో ప్రతిభ ఉన్న పేద, మధ్యతరగతికి చెందిన క్రీడాకారులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఇలాంటి ఘటనే ఈ ఏడాది వెలుగులోకి వచ్చింది. ఉన్న పది సీట్ల కేటాయింపుల్లోనూ అక్రమాలు జరిగినట్టు ఆధారాలు బయటపడ్డాయి.

వివరాలు 9లో

# సాహిత్యోద్యమ దీప్తి తెలంగాణ సాహితి



కె.ఆనందాచారి
కన్వీనర్ – తెలంగాణ సాహితి

సామాజిక రాజకీయ రంగంలో వచ్చిన మార్పులు, ఆలోచననలు, అలజడులు, ఆలోచనలు సాహిత్య రంగంలో ప్రతిఫలిస్తాయి. ప్రతిఫలించడమే కాక వ్యాఖ్యానిస్తాయి. తిరిగి ప్రభావాన్ని కలిగిస్తాయి. సాహిత్య కళారంగాలు, సమాజపు పాలపై కట్టిన మీగడ తీరుగా ఆ పాల సారాన్ని స్వరూపాన్ని కలిగి వుంటాయి. కాబట్టి ఆనాటి సాహిత్య కళారంగాన్ని అర్థం చేసుకుంటే దాదాపుగా సామాజిక స్థితిగతులు మనకు అవగతమవుతాయి.

నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టేముందు ఒకసారి మనం నడిచి వచ్చిన దారిని పరిశీలించుకున్నట్లయితే ఏ దిశలో మనం ప్రయాణం చేయాల్సి వుందో తెలిసి అడుగు ముందుకేయవచ్చు. పోయిన సంవత్సరం దేశంలోనూ రాష్ట్రంలోనూ చాలా కీలకమైన సంవత్సరంగా భావించవచ్చు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో మొదటి రెండు సంవత్సరాలు గ్రేస్ పీరియడ్‌గా చూసినా మూడో ఏడులో ప్రభుత్వ ఆలోచన, ప్రజల పట్ల, ప్రజా సంస్కృతి, కళాసాహిత్యాల పట్ల దాని దృక్పథం తెలిసి వస్తుంది. ముఖ్యంగా సాంస్కృతిక వైవిధ్యాన్ని, స్వాభిమానాన్ని ప్రధానం చేసుకుని ఏర్పాటు చేసుకున్న రాష్ట్రంలో ఆ రకమైన సాంస్కృతిక ప్రజా వారసత్వాన్ని ప్రత్యేకతను కొనసాగించేందుకు గానీ సాహిత్య వైభవాన్ని వర్తమానంలోనూ ముందుకు తీసుకెళ్ళేందుకు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం ఏ రకమైన పథకాన్ని రచించలేకపోయింది. కనీసం ఆలోచనా చేయలేదు.

ఇక దేశంలో ఏర్పడిన మితవాద, మతవాద ఆలోచనలకు ఊతమిచ్చే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలోని ప్రజల సాంస్కృతిక జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. హేతువాద దృక్పథంతో ఆలోచిస్తున్న రచయితలు, సాహితీకారులను బెదిరింపులకు గురిచేయటమే కాకుండా వారిపై భౌతిక దాడులు, ప్రాణాలు తీయడం మొదలైన దుశ్చర్యలకూ మద్దతుగా ఉంటున్నారు.

ఈ దేశంలో ఆకలితో, అప్పులతో, పౌష్టికాహార లోపంతో చనిపోతున్న ప్రజల గురించి, రైతన్నల గురించి కించిత్ ఆలోచించనివారు గోవును రక్షించడం, పూజించడం ప్రధాన చర్యగా మార్చి గోమాంసం తింటున్నారనే నెపంతో మనుషులను హతమార్చే సంఘటనలు చోటు చేసుకోవటం సాహితీ కారులను తీవ్ర మనస్థాపానికి వేదనకు గురిచేస్తున్నది. అంటే ప్రజల ఆహారం, ఆహార్యం, మతం, కులం మొదలైన సాంస్కృతిక వైవిధ్యాన్ని వైరుధ్యంగా నిలిపి ప్రజల మధ్య విభేదాలను సృష్టించి తమ ఉనికిని కొనసాగించడమనేది జరుగుతున్నది.

ఈ రకమైన పోకడలు, ధోరణులు రచయితలకు, సాహితీకారులకు, సృజనశీలురకు తీవ్ర వ్యతిరేకమైనవి. సృజనకారునికి స్వేచ్ఛ అవసరం. అలాంటి భావప్రకటనా స్వేచ్ఛను నియంత్రించే ఫాసిస్టు ఆలోచనలను ముందుగా ఖండించేది సాహిత్య కళారంగమే.

ఆ విధంగా తెలంగాణ సాహితి దేశంలో సృజనకారులపై జరుగుతున్న, ప్రజల ఐక్యతపై జరుగుతున్న దాడులను ఖండించి, రచయితలను మేల్కొలిపే కార్యక్రమాలను చేపట్టింది. సమాజంలో వస్తున్న మార్పులను, పరిణామాలను ఈ అవగాహనతో అర్థం చేసుకుని ముందుకు పోవాలని రచయితలను కోరింది. ప్రముఖ రచయిత్రి గౌరీలంకేష్ హత్యను తెలంగాణ సాహితీ తీవ్రంగా ఖండించింది.

ఇక రాష్ట్రంలో తెలంగాణా సాంస్కృతిక వైతాళికులుగా చెప్పుకోదగిన ప్రజారచయిత, ఉద్యమకారుడు వట్టికోట ఆళ్వారుస్వామి వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవడంలోనే ఈ తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని



> ప్రశ్నించే గొంతుకగా, ప్రత్యామ్నాయ వేదికగా సాహిత్యోద్యమంలో తెలంగాణ సాహితీ కీలక పాత్ర పోషిస్తున్నది. తెలంగాణ సాహిత్య శ్రేణులు ప్రజల పక్షంగానే కాదు ప్రతిపక్షంగా ఉండాల్సిన అవసరాన్ని చెబుతున్నది. ఈ క్రమాన 2017 సంవత్సరంలో తెలంగాణ సాహితి చేపట్టిన అనేక కార్యక్రమాల అవలోకనమే ఈ వ్యాసం

కాపాడగలుగుతాం. అలాంటి ఆలోచన చేయటానికి పూనుకోవాలని ప్రజలనూ, ప్రభుత్వాన్ని మేలుకొల్పుతూ తెలంగాణ సాహితీ సాహితీయాత్రలను చేపట్టింది. అందులో భాగంగానే వట్టికోట గ్రామమైన 'మాధవరం' గ్రామానికి యాభై మంది రచయితలు, సాహితీకారులతో యాత్ర చేసి వట్టికోట ఆశయాలను కొనసాగిస్తామని ప్రతినబూనాం. ఆ గ్రామంలో ప్రజలతో ఆళ్వారుస్వామి కుమారునితో కలిసి వట్టికోట రచనలను ఆయన కృషిని నేటి తరానికి అందించేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వమూ పూనుకుని ఆయన పేర ఒక అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరాం. భౌగోళికమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ తెలంగాణ నిజమైన సాంస్కృతిక చైతన్యంతో ప్రజా తెలంగాణ ఏర్పడాల్సి వుందని, అప్పుడే ఆనాడు వట్టికోట ఆశించిన సమాజం వస్తుందన్న ఎరుకను యాత్ర ప్రజల్లోకి తీసుకుపోయింది.

మహాజన పాదయాత్ర సందర్భంగా స్ఫూర్తి రచించిన 'పాదముద్ర' పుస్తకాన్ని వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ ఆవిష్కరించారు.

అలాగే నిరంకుశ నిజాం పాలనపై ఎక్కుపెట్టిన తుపాకీలాంటి గొంతుక దాశరథి కృష్ణమాచార్య గారి జన్మస్థలమైన చినగూడూరుకు జనవిజ్ఞాన వేదిక వారితో తెలంగాణ సాహితీ యాత్ర చేసి దాశరథి స్మృతి చిహ్నంగా చిన్నగూడూరు ఒక సాంస్కృతిక కేంద్రంగా రూపొందించాలని, ఆయన పేరుమీద ఒక పరిశోధనా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరటం జరిగింది. ఈ యాత్రలో గ్రామంలోని ప్రజలు కూడా పాల్గొని వారి చైతన్యాన్ని చాటుకున్నారు.

అంతకుముందు సంవత్సరమే తెలంగాణ ఆది కవిగా భావిస్తున్న పాల్కురికి సోమన గ్రామం పాలకుర్తి, పోతన జన్మస్థలమైన బమ్మెర గ్రామం సాహితీ యాత్ర నిర్వహించి మన సాహితీ వారసత్వాన్ని కాపాడుకోవాలని ఆయా కేంద్రాలు నిరాదరణకు గురవుతున్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకురావటం, ప్రభుత్వం స్పందించి బమ్మెర గ్రామంలో పోతన కేంద్రం అభివృద్ధికి డబ్బులను కేటాయించడం జరిగింది.

మొత్తంగా ఈ యాత్రలు సాహితీరంగంలోనూ అటు ప్రజలలోనూ ఒక సాంస్కృతిక చైతన్యాన్ని నింపడంలో విజయవంతం అయ్యాయి.

ఇక తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో అక్టోబర్ మాసంలో రెండు రోజులపాటు



నిర్వహించిన కార్యశాల సామాజిక విషయం పట్ల ఒక సమగ్ర ఆలోచనను అందించింది.

ప్రముఖ విమర్శకులు, పత్రికా సంపాదకులు కె.శ్రీనివాస్ ప్రారంభించిన ఈ కార్యశాలలో ప్రసిద్ధ కవులు శివారెడ్డి, వేదగిరి రాంబాబు, మేడిపల్లి రవికుమార్, సీతారాం, గుడిపాటి, శిరంశెట్టి కాంతారావు, పత్రికా సంపాదకులు ఎస్.వీరయ్య మొదలైన వారు పాల్గొని కథ, కవిత, విమర్శ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగానే యువ సాహితీ పురస్కారాన్ని పొందిన మెర్సీ మార్గరెట్‌ను సత్కరించి అభినందించడం జరిగింది. సామాజిక పరిణామాల పట్ల ఎలాంటి అవగాహనను రచయితలు కలిగి వుండాలో ఈ సందర్భంగా చర్చించి, తెలంగాణ సాహితి రాష్ట్ర నిర్మాణం నలభై రెండు మంది రచయితలు, పద్దెనిమిది మంది జిల్లాల ప్రాతినిధ్యంతో ఏర్పాటు చేయడం జరిగింది.

కవులు రచయితలు కేవలం సామాజిక సంఘటనలకు సాక్షులుగా మాత్రమే నిలువజాలరనే అవగాహనతో ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక చర్యలపై గళమెత్తడం జరిగింది. నేరెళ్ళలో ఇసుక మాఫియా ఆగడాలను, విచ్చలవిడి తనాన్ని ప్రశ్నించిన దళితులు, వెనుకబడిన తరగతుల ప్రజలపై ప్రభుత్వమూ, పోలీసులు జరిపిన పాశవిక దాడిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బాధితులను వేములవాడలో పరామర్శించి, వారికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలియజేయి, వారికి నైతిక మద్దతును అందించింది తెలంగాణ సాహితి. ఈ కార్యక్రమాన్ని సాహితీలోకం అభినందించింది.

ఈ మధ్యకాలంలో మన తెలంగాణలో జరుగుతున్న కులదురహంకార హత్యలపై కవి సమ్మేళనం నిర్వహించి, కుల వివక్షను ఎండగట్టింది. ఉగాది సందర్భంగా కవిసమ్మేళనం హైద్రాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, సిద్ధిపేట, కరీంనగర్ మొదలైన ప్రాంతాలలో నిర్వహించాం. కాళోజీ, వట్టికోట జయంతిని, రచయిత, నాటక కర్త రుక్మిణి వర్ధంతి కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించాం.

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో తెలంగాణ సాహితి యువకవి సమ్మేళనం ఎంతో ఉత్సాహపూరితంగా జరిగింది. నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు, విద్యాసంస్థ చైర్మన్ శైలజ, మెర్సీమార్గరెట్ పాల్గొని ఈ ప్రయత్నాన్ని అభినందించారు.

ప్రముఖ ఉర్దూకవి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మగ్దూం మొయినుద్దీన్ సమగ్ర చరిత్రను మిత్రుడు వాహెద్ అక్షరబద్దం చేయగా, పుస్తక రూపంలో దీనిని నవతెలంగాణ ప్రచురించింది. ఆ పుస్తకాన్ని తెలంగాణ సాహితి ఆవిష్కరణలు నిర్వహిస్తున్నది. మహబూబ్‌నగర్‌లో నిర్వహించింది. తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటి సభ్యులు అనంతోజు మోహనకృష్ణ కవితా సంకలనం 'ఆలోచన చేద్దామా!' పుస్తకావిష్కరణను నవతెలంగాణ సంపాదకులు వీరయ్య చేయగా, ప్రసిద్ధ కవయిత్రి కొండెపూడి నిర్మల, భూపతి వెంకటేశ్వర్లు సమీక్షించారు. నాగర్‌కర్నూల్ సాహితి బాధ్యులు వాహెద్ రచించిన 'చారాణా' కథా సంపుటిని అంపశయ్య నవీన్ ఆవిష్కరించగా పరిమళ్ వల్లభాపురం జనార్ధన్ సమీక్షించారు. నేటి యువతకు కాళోజీని పరిచయం చేయటానికి ఆనందాచారి రచించిన 'ధిక్కారగళం మన కాళోజి' పుస్తకాన్ని స్వాతంత్ర్య సమరయోధులు జైని మల్లయ్య ఆవిష్కరించగా, ప్రముఖ సాహితీవేత్త మోతుకూరి నరహరి సమీక్షించారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా తెలంగాణ సాహితి సామాజిక సమస్యలపైన 'అడుగు' అనే కవితా సంకలనాన్ని 'పోడు – పోరు' అనే సంకలనాన్ని తీసుకువచ్చి ఆవిష్కరించారు.

సాహిత్యరంగంలో చైతన్యయుతంగా యాత్రలు, కార్యశాలలు, కవి సమ్మేళనాలు, సదస్సులు నిర్వహిస్తూనే పుస్తకాలనూ వెలుగులోకి తెస్తూ సాహిత్యరంగంలో తెలంగాణ సాహితీ ముందుకు పోతున్నది. ప్రతి సంవత్సరం నిర్వహించే 'తెలంగాణ సాహితి సాహిత్యోత్సవం' (లిటరరీ ఫెస్ట్ – 17) ఈ సారి ఫిబ్రవరిలో భాషా సాంస్కృతిక ఉత్సవంగా నిర్వహించాలని అనుకుంటున్నాం. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో ఏ విధమైన చర్చలు చేయాలో, భాషాభివృద్ధికి ఏ చర్యలు తీసుకోవాలో సూచించారు.

ఒక సమగ్ర ఆలోచనతో ముందుకు పోతున్న తెలంగాణ సాహితికి రచయితలు, కవులు, సాహితీ ప్రియులు భవిష్యత్తు కార్యక్రమాల్లో అండగా ఉండాలని కోరుతున్నది.

**రచయిత సెల్ : 9948787660**

## సాహిత్యవార్తలు

### 5న 'తెలంగాణ సినిమా దశ దిశ' ఆవిష్కరణ

వారాల ఆనంద్ రచించిన ' తెలంగాణ సినిమా దశ దిశ' పుస్తకావిష్కరణ రాష్ట్ర పట్టణాభివృద్ధి, ఐ.టి. శాఖల మంత్రి కె.టి.ఆర్ ఆవిష్కరిస్తారు. జనవరి 5వ తేదీన ఉదయ 10.30 లకు సెక్రెటేరియట్ లోని కార్యాలయంలో జరిగే ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తలసాని శ్రీనివాస యాదవ్, దేశపతి శ్రీనివాస్, కవి వజ్జల శివకుమార్ తదితరులు హాజరవుతారు.

### 7న మద్దూరి నగేష్‌బాబు స్మారక సాహిత్య సభ

మద్దూరి నగేష్‌బాబు స్మారక కవితా పురస్కారం 2017 సంవత్సరానికి రామా చంద్రమౌళికి జనవరి 7వ తేదీన అందజేస్తారు. నర్సరావుపేటలోని లూథరన్ స్కూలు కమ్యూనిటీ హాల్లో జరిగే ఈ సభలో ఉషా.యస్.డానీ, చల్లపల్లి స్వరూపరాణి, ఉన్నవ వినయ్‌కుమార్, మాతంగి దిలీప్, డాక్టర్ నూకతోటి రవికుమార్ తదితరులు ప్రసంగిస్తారు.

**– బహుజన రచయితల వేదిక, 98481 87416**

### గోరేటి వెంకన్నకు అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారం

గోరేటి వెంకన్న ఈ ఏడాది అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. జనవరి 2న తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఆయనను పురస్కారం అందజేస్తారు.

### 31వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన శాల

31వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన శాల ఈ నెల 18 నుండి 28 వరకు తెలంగాణ కళాభారతి (ఎన్.టి.ఆర్.స్టేడియం)లో జరుగుతుంది. ఇందులో 10 రాష్ట్రాల నుండి ప్రచురణ కర్తలు పాల్గొంటారు. తెలుగు సాహిత్యానికి ప్రాధాన్యత వుంటుంది. 250 మంది ప్రచురణ కర్తలు, రచయితలు, పుస్తక విక్రేతలు పాల్గొంటారు. తొలిసారిగా తెలంగాణ రచయితలకు మాత్రమే ఉచితంగా హాల్ కేటాయించారు. సాహితీ ప్రియులు, పుస్తక ప్రదర్శనను జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నారు.

**– జూలూరి గౌరీశంకర్; అధ్యక్షులు – హైదరాబాద్ బుక్‌ఫెయిర్**
**– కె.చంద్రమోహన్; కార్యదర్శి – హైదరాబాద్ బుక్‌ఫెయిర్**

### ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం

ఈదూరు సుబ్బయ్య స్మారక సాహితీ పురస్కారం 2017 సంవత్సరానికి గుడిపాటి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 11వ తేదీన నెల్లూరు టౌనుహాల్లో జరిగే కార్యక్రమంలో సన్మానం, పురస్కార ప్రదానం ఉంటాయి.

### కవితా సంపుటాలకు ఆహ్వానం

కీ.శే.నాగభైరవ కోటేశ్వరరావు పేరుతో ఇస్తున్న నాగభైరవ పురస్కారం 2017 కోసం కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. 2016, 2017 సంవత్సరాలలో వెలువరించిన కవన కవితా సంపుటాలను జరవరి 30 లోపు చిన్ని నారాయణరావు, ప్రధాన కార్యదర్శి, శ్రీకేతనమ్, ఆదిత్యనగర్, చిల్డ్రన్ పార్క్ రోడ్, నెల్లూరు – 524003. వివరాలకు : 9440202942

## దేశం కోసం...

గ్రామీణ భారతాన్ని బీడు చేస్తూ
ఏలికల విధానాలు పల్లెను పట్నాన్ని
ఆర్థిక దాహంతో మింగే గ్లోబులో భూతం...
మానవ మస్తిష్కాల్లోంచి లాభాల పంటను...
ప్రపంచ పటం అంతా నాటుతోంది...
స్వేచ్ఛ – స్వతంత్రాల పేరిట యువత
తేజాన్ని నిర్వీర్యం చేసే నెట్
మాయా వలయంలో డాటర్ చిప్ విప్‌లు చేస్తోంది
దేహ సౌభాగ్యాన్ని – దేశ సంస్కృతిని
చిదిమే... పడమటి గాలి సునామీ ఓ అశనిపాతం!!
ఈ భూమి సంపన్నులది; షావుకార్లది; అనే
ఏలికల నీతిని... ఒక్క క్షణం కూడా ఒప్పుకోని
చరిత్రా ముందుకు పద!!
నీ వెంట కోటానుకోట్ల యువత ఉంది!
నేటి స్వప్నాలే... రేపటి వాస్తవాలు!! అని
చాటుదాం!!! కొత్త దారుల వెంట
సామ్యవాద మొక్కల్ని కొత్త వత్సరంలో
నాటుదాం! రేపటి ప్రపంచాన్ని గెలుద్దాం!!
రెండు వేల పద్దెనిమిదీ ఏమంటావ్!!
...........
నిన్నూ మా దారి వెంట కొని పోతాం!!
రా... నేస్తమా... రా... రా నేస్తమా... రా...


**– తంగిరాల చక్రవర్తి, 9393804472**

## నువ్వా సూర్యుడ వౌతావ్

నీకున్న సమయంలో
తొంభైశాతాన్ని నీకు కేటాయించుకొని
పదిశాతం ఇతరులకు కేటాయించు!

పదిమందికి వెలుగు నిచ్చే
పదికిరణాల వంటి ఆలోచనలు చేయ్!
పదికిరణాల వంటి మాటలు మాట్లాడు!
పదికిరణాల వంటి పనులకు పూనుకో!
అప్పుడు–నువ్వా
ముప్పై కిరణాల సూర్యుడ వౌతావ్!!!

**– రఘువర్మ, 9290093933**



## తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల పాత్ర

రాజకీయోద్యమం, సాంస్కృతికోద్యమంగా విభజించిన తెలంగాణ పోరాటంలో స్త్రీలు కూడా తమ వంతు పాత్రను సమర్ధనీయంగా పోషించారు. ముఖ్యంగా సాంస్కృతికోద్యమంలో మహిళల పాత్రను వివరించడానికి గాను పరిషత్తువారు 'తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల పాత్ర' అనే అంశంపైన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో 'తెలంగణ మహిళా సాహితి' అనే మొదటి భాగంలో తెలంగాణలోని 'ఉద్యమ కథ'పై తాయమ్మ కరుణ, 'మహిళా పరిశోధకులు'పై వి.త్రివేణి, 'కవయిత్రుల కవిత్వం'పై కొండపల్లి నీహారిణి, 'రచయిత్రుల ప్రచురణలు'పై అనిశెట్టి రజిత, 'స్త్రీల వ్యాసాలు'పై గోగు శ్యామల, 'నిశ్శబ్దాన్ని బద్దలు కొడదాం' అంటూ కె.విమల, 'పాటను ఆయుధంగా మార్చిన గాయనీమణులు' గురించి కరిమిండ్ల లావణ్య తమ తమ వ్యాసాల్లో తెలియజేశారు. 'ఉద్యమం – ప్రచారానుభవాలు' అనే రెండవ భాగంలో – ఉద్యమంలో ప్రత్యక్షంగా క్రియాశీలతతో పాల్గొన్న 25 మంది రచయిత్రుల అనుభవాలను – జ్ఞాపకాలను వాటితో పాటు వారు రాసిన వ్యాసాలు, గీతాలు, కవితలు, ప్రసంగాల రూపంలో ఉద్యమానికి చైతన్యస్ఫూర్తిని అందజేసిన విధానాన్ని తెలియజేశారు. ఈ సంకలనంలోని వ్యాసాలన్నింటిలోనూ భావోద్వేగం, నిశిత పరిశీలన, ఉద్యమ నిబద్ధత, ప్రబోధ ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

**కదనంలోనూ, కథనంలోనూ మేమే..., సంపాదకులు : డా॥జె.చెన్నయ్య, పేజీలు : 200, వెల : 150/-,**
**ప్రతులకు : తెలంగాణ సారస్వత పరిషత్తు.**

**– కె.పి.అశోక్‌కుమార్**

## మొగ్గలు

మానవతా దీప్తితో వెలిగితేనే కదా
సమాజంలో మనిషికి సమున్నత గౌరవం
మంచి ఎప్పుడూ వాడిపోని సుగంధం

మధురమైన మనస్సుతో పలికితేనే కదా
మనిషికి నిండుగా నీరాజనం
మాట ఎప్పుడూ పరిమళభరితం


అక్షరాలకు రెక్కలు మొలిపిస్తేనే కదా
కవిత్వమై సాహిత్యంలో విహంగవీక్షణం చేసేది
అక్షరం వేవేల భావాల అమృతసూక్తం

అక్షరాలను భావాలతో వెలిగిస్తేనే కదా
సాహిత్యంలో కవితా కిరణమై భాసించేది
కవిత్వం భావోద్వేగాల సంగమం

నిండు మనస్సుతో పలకరిస్తేనే కదా
ఆత్మీయత గుండెల నిండా పరుచుకునేది
ఆప్యాయత ఒక అనురాగబంధం

**– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, 9032844017**

## ఒక అమెరికన్ నర్తకి కథ




అమెరికాలో స్థిరపడిన తెలుగు పండితులుకు ఇద్దరమ్మాయిలు. తల్లి నిర్మలకు చిన్నప్పటి నుండి నాట్యం అంటే ఇష్టం. తాను నేర్చుకోలేకపోయిన నాట్యాన్ని, తన కూతుళ్ళు ఇద్దరికి నేర్పాలని భావించి అందుబాటులో ఉన్న అమెరికన్ డాన్స్, బాలే డాన్స్ నేర్పించింది. పెద్దమ్మాయి సుష్మ మాత్రం ఆ నృత్యంలో ఆరితేరింది. నృత్యకళలో అశేష ప్రతిభతో అంకితభావంతో, బాలే నృత్యాలను మెరుపు తీగలాంటి అందంతో నర్తించే సుష్మ ఎదుర్కొన్న సమస్యలు, తల్లిదండ్రులిచ్చే ప్రోత్సాహం, తనతో పాటు నృత్యంలో రాణిస్తున్న డేవిడ్ అనే అమెరికన్‌తో వివాహం, భర్తతో స్వల్పమైన అంతరం, తర్వాత పరస్పర అవగాహనతో చివరకు ఒకటి కావడంతో నవల సుఖాంతమవుతుంది. ప్రధాన ఇతివృత్తానికి అనుబంధంగా అమెరికాలో స్థిరపడిన తెలుగువాళ్ళు, వాళ్ళ ఉద్యోగ ప్రయత్నాలు, కుటుంబ జీవనం, అక్కడి సంస్కృతిలో ఇమడలేక – వాటితో సర్దుబాటు కాలేక పడే ఇబ్బందులు, సాటి తెలుగువాళ్ళ ప్రవర్తన – వీటన్నింటికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నవల విస్తృతి పెరిగింది.

**నర్తకి (అమెరికా సాంఘిక నవల), సోమ సుదేష్ణ, పేజీలు : 208, వెల : 150/-, ప్రతులకు : నవోదయ పుస్తక కేంద్రాలు.**

**– రాహుల్**

## నా గది గోడకు..

నా గదిగోడకు ఓ మూలకు
రెప రెప మంటూ
కొట్టుకుంటున్న
క్యాలెండర్‌ను చూస్తానా
సిలువ వేయ బడ్డ
ఏసులా కనిపిస్తుంది
దెగ్గరికి వెళ్లి పలుకరిస్తాను
మౌనంగా విలపిస్తుంది
మొఖానికి డిసెంబర్‌ను
తగిలించుకొని
టాటా బైబై అంటుంది
మధుర స్మృతులు గుర్తొచ్చి
ఆలింగనం చేసుకుంటాను
అంతలోనే మరణరాశులు
గుర్తొచ్చి విదుల్చుకొంటాను
కోప్పడతాను తానుమాత్రం
సజీవ సమాధిలోకి
సాగిపోయే యోగిలా



సుఖదు:ఖాల జ్ఞాపకాన్ని
మిగిల్చి వెళ్లే త్యాగిలా
కదిలిపోతుంది
ఓ నిట్టూర్పు విడుస్తూ..

క్రిస్మస్ సంబురాలను
మూటగట్టుకోని
సంతోషాలను తడుముకుంటూ
బహుదూరపు బాటసారిలా
వేగంగా వెళ్లిపోతుంది

చీకట్లను చీల్చుకుంటూ
నవోదయం అడుగిడుతుంది
నవ నవోన్మేషంగా
నూతన వత్సరానికి సంతోషంగా
స్వాగతం పలుగుతాను
రొటీన్ జీవితంలోకి జారి
మరో పన్నెండు పేజీల ఆశల్ని
నా గది గోడకు దిగ్గొడతాను..!

**– కటుకోర్ఘ్వుల రమేష్, 9949083327**




# నవ వసంతమై చిగురించాలి

**శీతాకాలం రాగానే చెట్టు ఒక్కో ఆకు రాల్చుతుంది. మళ్లీ వసంతమై చిగురిస్తుంది. జీవితంలోనూ అంతే... ఒక్కో ఏడాది గడిచిపోతుంది. మరో ఏడాది కొత్త చివుళ్లు తొడుగుతుంది. 2017 అయిపోయింది. 2018 వచ్చేసింది. కాలమేమిటి.. ఇంత వేగంగా గడిచిపోతున్నది అనిపిస్తోంది. కారణాలేమైనా మనుషులం కదా.. కొన్ని చోట్ల ఆగిపోతుంటాం. కానీ కాలం నడుస్తూనే ఉంటుంది. గతకాలపు చీకటి వెలుగులను స్మరించండి. రేపటిని అందంగా తీర్చిదిద్దుకోండి. ఒక్కరోజులోనే ఏమీ మారిపోదు.. కానీ కొత్తగా ఉండాలని ఆశించడంలో తప్పు లేదు. వచ్చేటప్పుడు ఏం తీసుకురాలేదు. పోయేటప్పుడు ఏమీ తీసుకుపోం. చివరకు మిగిలేది మంచి మాట, మంచి పనులు. అందుకే ఈ నూతన సంవత్సరంలో అసూయ, విద్వేషాలను వదిలిపెట్టండి... ప్రేమానురాగాలను పంచేందుకు, నలుగురికి మేలు చేసేందుకు ప్రయత్నించండి. నూతన సంవత్సర శుభాకాంక్షలతో...**

నూతన ఉత్తేజంతో మరో సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఆనంద కేరింతల మధ్య 2018కి స్వాగతం పలికాం. సాధారణంగా నూతన సంవత్సరం అంటే కేకులు, స్వీట్లతో ఆనందంగా జరుపుకుంటాం. అదే ఉత్సాహంతో మనం కొన్ని కొత్త నిర్ణయాలను తీసుకొని వాటిని అమలుచేద్దాం. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలతో పాటు ఈ రోజు జీవితానికి సంబంధించిన ఏదో ఒక మంచి నిర్ణయంతో ప్రారంభిద్దాం...

ప్రస్తుత ఆహార అలవాట్లలో బాగా మార్పు వచ్చేసింది. బేకరి ఫుడ్‌కు బాగా అలవాటు పడ్డాం. పార్టీలకు, స్నేహితుల పుట్టిన రోజులకు బిర్యానీలు, పిజ్జాలు, బర్గర్లు తినడం ఫ్యాషన్‌గా మారిపోయింది. దాని వల్ల చాలా మంది టీనేజ్ వయసులోనే వయసుకు మించిన బరువుతో బాధపడుతున్నారు. కాబట్టి ఈ నూతన సంవత్సరం నుండి బయటి ఆహారం తీసుకోకూడదనే నిర్ణయాన్ని తీసుకోండి. దాన్ని కచ్చితంగా ఈ రోజు నుండే అమలు చేయండి. ఏది ఏమైనా ఇంటి ఆహారాన్నే తీసుకోండి.

ఇంటర్నెట్‌లు, కొత్త కొత్త సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత ఎక్కువగా వాటితోనే గడుపుతున్నాం. అర్థరాత్రి దాటిన తర్వాత కూడా నిద్రపోకుండా స్నేహితులతో సెల్‌ఫోన్ కబుర్లు, చాటింగ్‌లు, వీడియోగేమ్స్, ఇంటర్నెట్‌తో కాలక్షేపం చేయడం బాగా పెరిగిపోయింది. అటువంటి అలవాట్లను నేటి నుండి మార్చుకోండి. వారంలో శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజుల్లో రాత్రి పదిలోపు నిద్రపోయే విధంగా ప్లాన్ చేసుకోండి. పనులు వాయిదా వేయడం అలవాటుగా ఉంటుంది. కాని నేటి నుండి వాయిదా పద్ధతిని మీ మెదడు నుండి పూర్తిగా తొలగించండి.

చాలా మంది జనవరి మొదలు కాగానే ఉత్సాహంగా డైరీ రాయడం మొదలు పెడతారు. కాని కొన్ని రోజులు రాసి ఆ డైరీని మూలన పడేస్తారు. ఈ సారైనా సంవత్సరం మొత్తం మీ దినచర్యను డైరీలో భద్రపరచుకోండి.

బరువు ఎక్కువగా ఉన్నవాళ్ళు ఎప్పటి కప్పుడు బరువు తగ్గటానికి కొత్త కొత్త ప్రయత్నాలు చేస్తుంటారు. కాని మధ్యలో మానేస్తుంటారు. దాని వల్ల ఇంకా బరువు పెరుగుతుంటారు. ఈ సారి నూతన సంవత్సరం ప్రారంభం నుండి కాఫీ, టీలను పూర్తిగా మానేయండి. మీ ఆహార నియమాలను కచ్చితంగా పాటించండి.




ప్లాస్టిక్‌ను నివారించాలని ఎంతగా ప్రచారం చేసినా ప్లాస్టిక్ వాడకం మాత్రం తగ్గలేదు. కాని మీరు మాత్రం ఈ నూతన సంవత్సరం సందర్భంగా మీ కొత్త నిర్ణయాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించటానికి ప్రాధాన్యం ఇవ్వండి. సాధారణంగా ఫిల్టర్‌లో నీటిని ప్లాస్టిక్ బాటిల్స్‌లో పట్టి తాగేస్తుంటాం. వాటికి బదులు స్టీల్ లేదా గాజు గ్లాస్ వాడండి. రాత్రి సమయంలో కూడా మంచం పక్కన ప్లాస్టిక్ బాటిల్ పెట్టుకొని పడుకుంటాం. ఆ అలవాటును మర్చిపోయి స్టీల్‌చెంబులో నీటిని పెట్టుకోండి. ఇంటికి వచ్చిన బంధువులకు కూడా గ్లాసుల్లోనే నీటిని ఇవ్వండి.

నీటి కోసం ఫ్రిజ్ కంటే మట్టి కుండను వాడండి. వేసవి కాలంలో అవసరమైతే ప్లాస్టిక్ బాటిల్స్‌ను పడేసి స్టీల్ బాలిల్స్‌లో నీళ్ళు నింపుకొని ఫ్రిజ్‌లో పెట్టుకోండి.

## ఆసక్తికరంగా మలచుకోండి!

మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. చాలా మందికి తమ



శరీరం నచ్చదు. లావుగా ఉన్నామనో, బక్కగా ఉన్నామనో, తెల్లగా ఉన్నామనో, నల్లగా ఉన్నామనో. దంతాలు ఎత్తు, ముక్కులావు, జుట్టుబాగలేదు... ఇలా రకరకాలుగా తమను తాము ఇష్టపడరు చాలా మంది. వీటిలో దేన్నీ పరిగణనలోకి తీసుకోకుండా మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. చాలా మంది ఎవరో ఒకరు తోడుంటేనే ఏదైనా చేయగలం అనుకుంటారు. చివరకు బట్టలు కొనుక్కునే విషయంలో కూడా ఎవరో ఒకరి సలహాలు తీసుకుంటారు. అలా కాకుండా మీకు ఇష్టమైన పనులు, మీకు ఇష్టమైన బట్టలు కొనుక్కోండి. మీకు ఇష్టమైన ప్రదేశాలకు ప్రయాణాలు చేయండి.

ప్రతి ఒక్కరికి ఏదో ఒక అభిరుచి ఉండే ఉంటుంది. కాలంతోపాటు అన్ని మారతాయి. కొందరు తమ అభిరుచులను సైతం మరిచిపోతుంటారు. చిత్రకళ, నృత్యం, వంట అద్భుతంగా చేయడం, పాటలు పాడటం... ఏదైనా కావచ్చు. మీరు ఎంత బిజీగా ఉన్నా... మీకు ఇష్టమైన దానికోసం కొంత సమయాన్ని కేటాయించండి. మీలో ఉన్న ఆందోళనను పోగొట్టడమే కాదు... మీరు పోగొట్టుకున్న మిమ్మల్ని తిరిగి మీకు అందిస్తుంది.

జీవితం చాలా చిన్నది. ఇంత కొద్ది జీవితంలో కోపాలు, ద్వేషాలు, అసూయలు. అన్నింటినీ తరిమేయండి. మీకు నచ్చిన పనులే చేయండి. మీకు నచ్చిన మనుషులతోనే మాట్లాడండి. నచ్చని పరిసరాలను, నచ్చని మనుషుల సాహచర్యాన్ని తగ్గించేయండి. కోపంతో కాకుండా పెద్ద మనసుతో ఇగ్నోర్ చేయండి. గత ఏడాది మీకు ఇబ్బంది కలిగించినవి భవిష్యత్‌లో ఎదురు కాకుండా చూడండి. మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వండి. ఇదే మిమ్మల్ని స్థిత ప్రజ్ఞులుగా, సంతోషమైనవాళ్లుగా చేస్తుంది.

జీవితం ఒక్కటే. రెండో సారి రాదు. ఏది చేయాలనుకున్నా ఈ చిన్ని జీవితంలోనే. కాబట్టి బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్, పర్వతారోహణ, ట్రెక్కింగ్... ఏదైనా కావచ్చు మిమ్మల్ని భయపెట్టేవాటిని జయించండి. ఆ తరువాత కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. కాబట్టి ఏదో ఒకదానికి ఈ ఏడాది ప్రణాళిక వేసుకోండి.

ఇటువంటి కొత్త కొత్త నిర్ణయాలతో ఈ నూతన సంవత్సరాన్ని ప్రారంభిద్దాం. ఈ కొత్త సంవత్సరాన్ని కేవలం నిర్ణయాలు తీసుకోవడం మాత్రమే కాకుండా వాటిని కచ్చితంగా పాటించాలని కూడా ఒక కొత్త నిర్ణయాన్ని తీసుకుందాం. మరింకెందుకు... ఆలస్యం చేయకుండా ఈ రోజు నుంచే మీ కొత్త నిర్ణయాలను అమలుచేయండి.

**- మానవి డెస్క్**

## ఆనందంగా గడపాలనుకుంటున్నా...



నాకంటూ ఓ ఇల్లు ఉండాలి కదా! అందుకే త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ను గత ఏడాదే బుక్ చేసుకున్నాను. నా తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలి కాబట్టి హైదరాబాద్‌లోనే తీసుకున్నాను. అది పూర్తయ్యింది. 2018 మార్చిలోపు కొత్త ఇంటిలోకి వెళ్తాను. ఈ బిజీ షెడ్యూల్స్‌తో అక్కడ ఎంత సమయం ఉండగలుగుతాననే విషయం పక్కన పెడితే... నాకు నచ్చినట్టుగా ఫర్నీచర్, కళాకృతులు, టీవీతో అందంగా ఇంటిని అలంకరించుకోవాలను కుంటున్నాను. క్రైమ్ థ్రిల్లర్స్ అంటే నాకు చాలా ఇష్టం. నా బుక్ ర్యాక్ నిండా అవే. ఆ బుక్ ర్యాక్ కోసం ఒక అందమైన, స్టయిలిష్ చెయిర్ కొనాలనుకుంటున్నాయి. ఇంకో గదిలో ఊయల పెట్టుకోవాలి. ఇక ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా టూర్స్‌తో వచ్చే ఏడాదంతా బిజీ. అయినా దొరికిన కొద్ది సమయాన్ని నా ఇంట్లో ఆనందంగా గడపాలనుకుంటున్నా.

**- మిథాలీరాజ్, క్రికెటర్**

## సముద్ర తీరాలకు...



నాకు ట్రావెలింగ్ చాలా ఇష్టం. ప్రత్యేకించి సముద్ర తీరాల్లో బాగా ఎంజాయ్ చేస్తాను. అనేక కారణాల వల్ల 2017లో చూడాలనుకున్న అనేక ప్రదేశాలకు వెళ్లలేకపోయాయి. సముద్ర తీరాలు ఎక్కువగా ఉన్న న్యూజీల్యాండ్, సౌత్‌ఆఫ్రికా 2018లో వెళ్లాలనుకుంటున్న. ఇక సినిమాల విషయానికొస్తే.. స్టార్స్‌తో సంబంధం లేకుండా కథకు, సబ్జెక్ట్‌కు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో చేయాలనుకుంటున్నా.

**- తాప్సీ పొన్ను, నటి**

## పుస్తకం రాస్తాను...



2017 గొప్ప సంవత్సరం. ఇన్‌స్టంట్ త్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం చట్టం చేసింది. అయితే న్యాయపోరాటమే పూర్తయ్యింది. ఇంకా సామాజికంగా ఎంతో చేయాల్సి ఉంది. వచ్చే ఏడాదంతా దాని గురించి అవగాహన కల్పించడానికి ప్రయత్నించాలనుకుంటున్నా. అయితే త్రిపుల్ తలాక్ కేవలం ముస్లిం మహిళలకే సంబంధించినది. అయినా మహిళలందరూ మాకు మద్దతు పలికారు. అందుకే అన్ని వర్గాల, మతాల ప్రజలకు మా మద్దతు విస్తరించేలా ప్రయత్నిస్తాం. ఈ మొత్తం పోరాట సమయంలో నేను మహిళల జీవితాల నుంచి చాలా నేర్చుకున్నాను. కొత్త ఏడాదిలో ఆ కథలన్నింటినీ ఈ ప్రపంచంతో పంచుకోవాలనుకుంటున్నాను. వాటితో ఓ పుస్తకం రాస్తాను!

**- జకియా సోమన్,**
**భారతీయ ముస్లిం మహిళా ఆందోలన్ కో ఫౌండర్**

## ఎన్నో నేర్చుకోవాలి...



పర్సనల్, ప్రొఫెషనల్ జీవితాన్ని సమన్వయం చేసుకోవాలనుకుంటున్నాను. సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయాలనుకోవడం లేదు. ముంబైలో అనేక కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. సమయం దొరికితే నేషనల్ సెంటర్‌ఫర్ పెర్ఫామింగ్ ఆర్ట్స్ సెంటర్‌కు వెళ్తాను. పోయెట్రీ ఫెస్టివల్స్ చాలా ఇష్టం. అలాగే పుస్తకాలు చదువుతాను. ఇండస్ట్రీలో ఉన్న వ్యక్తిగా సృజనాత్మకతను ఇంకా పెంచుకోవాలి. అందుకోసం స్ఫూర్తినిచ్చేవి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని చేరుకోగలిగినా చాలు!

**- కల్కి కొచ్చి, నటి**

# అల్లరి చేయజూస్తే..!

**చదువుకోసమో.. ఉద్యోగం కోసమో ఇంటి నుంచి కాలు బయటపెట్టిన మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. బస్సులో వెళ్లితే ఒక రకమైన సమస్య.. కాలినడకన వెళ్లితే మరోరకమైన సమస్య. వీటి నుంచి బయటపడేందుకు ఇటీవల చాలామంది అమ్మాయిలు టూవీలర్ నేర్చుకుని ధైర్యంగా వెళ్తున్నారు. అయినా దాడులు ఆగలేదు. బండిపై వెళ్తున్న అమ్మాయిని అల్లరిచేయాలనుకున్న అకతాయిలకు ఎలా బుద్ధి చెప్పాలో ఈ వారం చూద్దాం..!**

## సెల్ఫ్ డిఫెన్స్



1

రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తేనే కాదు.. బండి పై వెళ్ళినా ఇబ్బందులు తప్పవు. బండి పై వెళ్తున్న మహిళను చుట్టూ ఎవరూ లేని ప్రదేశంలో ఇద్దరు దుండగులు అడ్డగించారు.



2

భయపడకుండా ఆమె బండిని ఆపారు. వారిద్దరూ తనను వేధించడానికి వచ్చారని తెలుసుకున్నారు. వారిలో ఒకడు ఆమె భుజంపై చేయి వేశాడు. తన భుజంపై పడిన చేయిని గట్టిగా పట్టుకున్నారు.



3

మరో అవకాశం ఇవ్వకుండా వెంటనే తన ఎడమచేతితో ఎల్‌బో అటాక్ చేశారు. ఊహించని ఈ ఎదురుదాడి నుంచి తప్పించుకునేందుకు ఆ వ్యక్తి ఆలోచిస్తాడు. వెంటనే బండికి ఎదురుగా వచ్చిన వ్యక్తి వైపు ఆమె దృష్టి సారించారు.



4

ఎల్‌బోపై అటాక్ తర్వాత ఏ మాత్రం గ్యాప్ ఇవ్వకుండా ఎదురుగా ఉన్న వ్యక్తి జుట్టును గట్టిగా పట్టుకుని బండికేసి గట్టిగా కొట్టాలి. తలకు గట్టిగా దెబ్బ తగలడంతో విలవిలలాడుతాడు.

ఆడపిల్లలు కనిపించగానే ఏడిపించాలని, వేధించాలని అనిపించేవారికి తగిన బుద్ధి చెప్పాలి. మరోసారి ఏ అమ్మాయిని ఏడిపించే ప్రయత్నం చేయకుండా నివారించాలంటే ఈ టెక్నిక్స్ ప్రాక్టీస్ చేయండి.



**ఎన్. లక్ష్మీ రవి,**
**ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,**
**రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,**
**గాంధీనగర్, హైదరాబాద్.**
**9490239170,**
**9949039049**

## నేరాల కట్టడే ప్రథమ ప్రాధాన్యం

- నూతన డీజీపీ మాలకొండయ్య
- పోలీసుబాస్‌గా బాధ్యతల స్వీకరణ
- సాంబశివరావుకు వీడ్కోలు


నూతన డీజీపీగా బాధ్యతలు చేపడుతున్న మాలకొండయ్య

**అమరావతి** : నేరాలను కట్టడి చేయడమే తన ప్రథమ ప్రాధాన్యమని రాష్ట్ర నూతన డిజిపిగా ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం.మాలకొండయ్య తెలిపారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సాంబశివరావు వీడ్కోలు సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడతానన్నారు. సాంబశివరావు తనకు పెద్ద సోదరునితో సమానమని, తాను ఇప్పటి వరకు ఆర్టీసీ ఎండీ, పోలీస్ అకాడమి ఇన్చార్జితో పాటు మెదక్, గుంటూరు ఎస్పీగా ఆయన నుంచే బాధ్యతల్ని తీసుకున్నానని వెల్లడించారు. డీజీపీగా కూడా ఆయన నుంచే బాధ్యతలు తీసుకుంటున్నానన్నారు. ఇద్దరమూ ఒకే ఎస్పీ దగ్గర శిక్షణ పొందామన్నారు. సాంబశివరావు తనక ఎన్నోసార్లు మార్గదర్శకత్వం చేసే వారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీస్ శాఖలోని అన్ని సంక్షేమ పథకాలనూ మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు కృషి చేస్తానన్నారు. పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు.

# కర్నూలులో దళితుల గ్రామ బహిష్కరణ


- అగ్రవర్ణాల శవం ఖననం చేసే గుంత తవ్వమన్నందుకే..
- విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేత


బహిష్కరణకు గురైన దళితులు

**కర్నూలు** : కర్నూలుజిల్లాలో పెత్తందారులు దళితులను గ్రామం నుండి బహిష్కరించారు. నిత్యావసర సరుకులు, తాగునీరు, విద్యుత్ సరఫరాను సైతం నిలిపేశారు. కేవలం అగ్రవర్ణాల శవాన్ని ఖననం చేసే గుంత తవ్వలేదన్నే కారణంతోనే ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రుద్రవరం మండలం నక్కలదిన్నెలో ఆదివారం వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో పూర్వకాలం నుంచి దాదాపు 20 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి.వారిలో ఆచారం ప్రకారం 4 కుటుంబాలు సూది జయన్న, లేగల ఎలీషా, జవాధి పుల్లన్న, దేవరాజులు మాత్రమే ఎత్తి (మనిషిని ఖననం చేసే గుంత తవ్వడం) పనులు చేసేవారు.

కాలక్రమేణా దళితులు అక్షరాస్యులుగా మారి ఎత్తిపనులకు వెళ్లడం మానుకున్నారు. దీంతో ఆగ్రహించిన అగ్రవర్ణాల వారు నాలుగేళ్ల క్రితం జయన్న, సుబ్బరాయుడు కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరించారు. మిగతా రెండు కుటుంబాలకు చెందిన ఎలీషా, దేవరాజులు కూడా ఎత్తి పనులకు వెళ్లకుండా గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం నక్కలదిన్నె గ్రామంలో ఆగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి చనిపోయాడు. ఎత్తి పనులకు రావాలని దళితులను పిలిచారు.

## 2019 నుంచి సమాజసేవకు అంకితం



**కృష్ణాజిల్లా** : 2019 జనవరి 20 నుంచి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుని సమాజసేవకు అంకితం కావాలని నిశ్చయించుకున్నానని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తెలిపారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారతిట్రస్ట్‌లో ఆదివారం విలేకరులకు అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజసేవతో ఆత్మసంతృప్తి కలుగుతోందని అన్నారు. విజయవాడ పత్రికలకు పుట్టినిల్లని, తానూ వాటి ద్వారానే విజ్ఞానాన్ని పెంపొందించుకున్నానని చెప్పారు. పత్రికలు సత్యానికి దగ్గరగా ఉండాలన్నారు. 1972 నుంచి తాను ప్రజా ఉద్యమాల్లో ఉన్నానని, విద్యార్థిగా జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని, 1977లో రాజకీయ రంగప్రవేశం చేశానని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమశిక్షణ, పట్టుదలతో ప్రజా జీవితంలో అంకితభావంతో పనిచేసి అంచెలంచెలుగా ఎదిగానని చెప్పారు. దేశంలో 65 శాతం యువశక్తి ఉందని, దీనిని సరైన మార్గంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రపంచమంతా ఆర్థిక మందగమనం ఎదుర్కొన్నా, భారత్ మాత్రం నిలదొక్కుకుందన్నారు. ప్రధాని మోడీ సంస్కరణలు దేశాన్ని ప్రగతివైపు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటుధర కల్పించడం, దళారీ వ్యవస్థను నిర్మూలించడం, ఉత్పత్తిదారుడు, వినియోగదారుడికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని అన్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు.

# సొంతూరికి సేవ

- రేపటి నుంచి జన్మభూమి
- కొత్త ఏడాదిలో రాజధాని పనులు
- సీఎం చంద్రబాబు బహిరంగ లేఖ

**అమరావతి** : రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సొంత గడ్డ రుణం తీర్చుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 2018 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 'అధికారం చేపట్టిన 42 నెలల కాలంలో పరిపాలనా యంత్రాంగాన్ని మిషన్ మోడ్‌తో పనిచేయించాం. అనితర సాధ్యమైన ఫలితాలు సాధించాం.. రాష్ట్రపతి చేతుల మీదుగా దేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీని అందించే ఫైబర్ గ్రిడ్‌ను ప్రారంభించాం' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. 'సంక్రాంతికి ముందు వచ్చే పెద్ద పండుగ 'జన్మభూమి–మా ఊరు' ఈ పండక్కి తెలుగువారు ఎక్కడున్నా సొంత ఊరుకు రావాలి. సంబరాలు జరుపుకోవాలి. సొంతగడ్డ రుణం తీర్చుకోవాలి' అని ఆయన కోరారు. నూతన సంవత్సర ఆరంభంలోనే ప్రపంచశ్రేణి రాజధాని నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 'కొండలను పిండి చేయగల శక్తి తెలుగువారిది. ఆ శక్తి యుక్తులతో ప్రపంచాన్ని ఏనాడో గెలిచారు.' అని పేర్కొన్నారు. మన రాష్ట్రం ప్రపంచంలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని తెలిపారు. పరిశ్రమలు నెలకొల్పడానికి అనేక సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయన్నారు. 1996 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి బలమైన పునాదులు వేశామని, దేశంలోనే అగ్ర రాష్ట్రంగా ఎదిగామని తెలిపారు. ఆ తర్వాత పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. 2014లో చేసిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యామని పేర్కొన్నారు. '60 ఏళ్లుగా శ్రమించి నిర్మించుకున్న, సంపాదించుకున్న సంస్థల్ని కోల్పోయాం. రాజధాని ఎక్కడో తెలియని పరిస్థితుల్లో అప్పుల భారంతో దిక్కుతోచని స్థితిలో బయటకు వచ్చాం' అని ఆవేదన వ్యక్తం చేశారు.

## పీసీసీలో భారీ మార్పులకు శ్రీకారం !

**హైదరాబాద్:** రాష్ట్ర పీసీసీలో భారీ మార్పులు జరుగుతాయని ప్రచారం జరుగుతున్నది. తెలంగాణలో అనుకూల వాతావరణం ఉండడంతో కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం తెలంగాణపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. వివాదాలకు తావులేకుండా వచ్చే ఎన్నికలకు అందరినీ కలుపుకుని పోయేవారికి బాధ్యతలు అప్పగించేందుకు ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఏర్పాట్లు చేస్తున్నారని తెలిసింది. సీనియర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోని నాయకత్వంలో ఎవరిని ఉంచితే బాగుంటుందని ఆలోచిస్తున్నారని సమాచారం. ఇబ్బందులు ఉంటాయని అనుకుంటే పీసీసీ అధ్యక్షుడితో పాటు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పాతవారిని కొనసాగిస్తూ ప్రచార కార్యదర్శిగా రేవంత్‌రెడ్డిని, మరో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పొన్నం ప్రభాకర్‌ను నియమిస్తారని సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు. లేకపోతే పూర్తి స్వరూపం మారినా ఆశ్చర్యపోనవసరం లేదని మరికొందరు చెబుతున్నారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడిపై కొంతమందిలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ ప్రకారంగా పరిశీలిస్తే పీసీసీ అధ్యక్షుడిని మార్పుదల చేయడం ఖాయమన్న ప్రచారం జరుగుతున్నది. పీసీసీ అధ్యక్షుడిగా మల్లు భట్టి విక్రమార్క, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా పొన్నం ప్రభాకర్ పేర్లు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డికి జైపాల్‌రెడ్డితో పాటు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇతర సీనియర్ల మద్దతు ఉన్నట్టు తెలిసింది. మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌లపైనా కూడా వ్యతిరేకత వ్యక్తం చేయలేదని సమాచారం.

## నియో కర్సర్‌లో ఉపాధి కోర్సులు

నవతెలంగాణ బ్యూరో –హైదరాబాద్

హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో మూడు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎస్‌వీకే ప్రాజెక్టు మేనేజర్ రాణాప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్‌టీ, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటరింగ్ పరిఫరల్ (కంప్యూటర్ హార్డ్‌వేర్)పై డాటా ప్రో సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందన్నారు. జనవరి మొదటి వారంలో ప్రధాన మంత్రి కౌశల్ యోజన అనే కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల మొదటి వారంలో ప్రారంభ మయ్యే కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు 9494860022 లేదా 949486 7070 లేదా 9100693547 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

## జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో –హైదరాబాద్

జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ పవన్‌కళ్యాన్ ఆది వారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో తొ లి సభ్యత్వాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం పార్టీలోని ముఖ్యులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం కో సం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

## మెట్రోలో సాంకేతిక సమస్య


- మూడు గంటలు నిలిచిన సర్వీసులు

నవతెలంగాణ–సిటీబ్యూరో

సాంకేతిక సమస్య కారణంగా హైదరాబాద్ మెట్రో రైలు సేవలు ఆదివారం పాక్షికంగా నిలిచిపోయాయి. మూడు గంటలకుపైగా ఇరువైపులా రైళ్ల రాకపోకలు ఆగాయి. సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చింది. నాగోల్ నుంచి అమీర్‌పేట వచ్చిన ఓ మెట్రో రైలు అమీర్‌పేట స్టేషన్‌లోనే నిలిచిపోయింది. ఎల్‌అండ్‌టీ సాంకేతిక నిపుణులు ప్రయత్నించినా రైలు మొరాయించడంతో నిలిచిన రైలును ప్రకాశ్‌నగర్‌లోని అదనపు ట్రాక్‌పైకి తీసుకెళ్ళారు. దీంతో అమీర్‌పేట్–నాగోల్ మధ్య మెట్రో సేవలకు అంతరాయం కలిగింది. దీంతో మిగిలిన రైళ్ల సేవలకు అడ్డంకి తొలగింది. ఆదివారం, పైగా డిసెంబర్31 కావడంతో రద్దీ ఎక్కువగా ఉండటం, మెట్రో సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. టిక్కెట్ కొన్న తర్వాత రెండు గంటల వరకే పనిచేసే నిబంధన ఉండటం, బయటకు వెళ్ళేందుకు సెన్సార్లు స్పందించకపోవడంతో మెట్రో సిబ్బంది ఇతర మార్గాల ద్వారా అనుమతించారు. అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో సాంకేతిక కారణంతో రైలు నిలిచిపోయిందని హెచ్‌ఎంఆర్ ఎమ్‌డీ ఎన్వీయస్ రెడ్డి తెలిపారు. దీంతో సుమారు రెండు, మూడు గంటలు ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. మొరాయించిన రైలును ప్రకాశ్‌నగర్‌లోని అదనపు ట్రాక్‌పైకి తీసుకెళ్ళి రైళ్ళను పునరుద్ధరించామని వివరించారు. రైలు నుంచి పిల్లలు దూకినట్టు వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ఇద్దరు మావోయిస్టులు మృతి



**చింతూరు** : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా చింతగుప్ప పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. కోబ్రా దళాలు, సిఆర్‌పిఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించగా మావోయిస్టులు ఎదురుపడ్డారని, దీంతో ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా, ఒకరి మృతదేహం లభ్యమైందని సుక్మా ఎస్పి జితేంద్ర శుక్లా తెలిపారు. ఘటనా స్థలంలో 12 బోర్ రైఫిల్, 315 బుల్లెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## ఢిల్లీ పబ్‌లో కాల్పులు, వ్యక్తికి గాయాలు

**న్యూఢిల్లీ** : దక్షిణ ఢిల్లీ గ్రేటర్ కాలిష్ ప్రాంతంలోని ఓ పబ్‌లో పార్కింగ్ వివాద విషయమై ఉమేష్ అనే వ్యక్తి వినయ్‌పై కాల్పులు జరిపాడని పోలీసులు తెలిపారు. సంఘ వ్యతిరేక శక్తులను బార్‌లోకి అనుమతించినందుకు పబ్ లైసెన్స్‌ను రద్దు చేయడానికి లైసెన్స్ శాఖకు లేఖను రాస్తామని పోలీసులు పేర్కొన్నారు. కాల్పులపై సమాచారం అందడంతో ఘటనాస్థలానికి చేరుకున్న తాము గాయపడిన వినయ్‌ను ఎయిమ్స్ ట్రామా కేర్ సెంటర్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. అతని పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఉమేష్‌ను ప్రజలు చితకబాది, తుపాకిని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు.

# డ్రైవర్ల నెత్తిన.. బోర్డు తప్పిదాలు

## రైళ్ల వేగాన్ని పెంచారు... ట్రాక్‌ల నిర్మాణం మరిచారు

- దమ.రైల్వేపై పాలకుల నిర్లక్ష్యం

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రైల్వే బోర్డు చేస్తున్న తప్పిదాలను కప్పి పుచ్చేందుకు రైళ్లు సమయ పాలన పాటించటంలేదన్న ముద్ర వేసి దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని సమకూర్చుతున్న దక్షిణ మధ్య రైల్వేపై రైల్వే బోర్డు చిన్నచూపు చూస్తోంది. ఆదామం సమకూర్చడంలో వెనుకబడి ఉన్న ఉత్తర భారతంలో ఉన్న రైల్వే జోన్లకు డిమాండ్ లేకున్నా కొత్త కొత్త రైళ్లు, భారీ ప్రాజెక్టుల నిర్మాణాలు, డబ్లింగ్, త్రిబులింగ్ వంటి ట్రాక్‌ల నిర్మాణం, వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీల నిర్మాణాలకు అనుమతులిస్తున్న రైల్వే బోర్డు అత్యధిక ఆదాయం తెచ్చిపెడుతున్న దక్షిణ మధ్య రైల్వే అభివృద్ధిపై చిన్న చూపు చూస్తోంది. జోన్ పరిధిలో రైళ్ల వేగాన్ని పెంచిన రైల్వే బోర్డు వాటికి సరిపడా ట్రాక్‌ల నిర్మాణాలకు నిధులు మాత్రం కేటాయించలేదు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని అనేక మార్గాల్లో సింగ్ ట్రాక్‌లు ఉండటంతో మేజర్ స్టేషన్ల మధ్య అదే ట్రాక్‌పై రెండు, మూడేసి రైళ్లు నడిస్తుంటాయి. ఎదురుగా ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, శతాబ్ది, రాజధాని వంటి రైళ్లు వస్తుంటే వాటికి దారిచ్చేందుకు ప్యాసింజర్లను, ఒక్కోసారి ఎక్స్‌ప్రెస్ రైళ్లను సైతం సమీపంలోని స్టేషన్‌లో ఆపేయాల్సి వస్తుంది. ఉదాహరణకు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుంటే హైదరాబాద్ నుంచి కడప, తిరుపతి, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లే రైలును పదిహేను నిమిషాల ముందే ఏదో ఒక స్టేషన్‌లో ఆపేస్తారు. ఆ రైలు స్టేషన్ దాటి వెళ్లిన తర్వాత మరో పది నిమిషాల తర్వాత గానీ దీనికి సిగ్నల్ ఇవ్వరు. ఈ కారణం చేతనే ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు అనుకున్న సమయానికి గమ్య స్థానాలకు చేరుకోవు. అయితే రైళ్లు ఆలస్యంగా నడవడానికి డ్రైవర్లు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ రైల్వే బోర్డు చేస్తున్న వాదనల్లో ఏమాత్రం నిజం లేదు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో విజయవాడ–హైదరాబాద్, విజయవాడ–చెన్నై, విశాఖ–విజయవాడ మార్గాల్లో మాత్రమే డబ్లింగ్ లైన్లు ఉన్నాయి. కాచిగూడ–బెంగళూరు, సికింద్రాబాద్–తిరుపతి, కాచిగూడ– కడప, హైదరాబాద్– నాగ్‌పూర్, హైదరాబాద్ –ముంబాయి, సికింద్రాబాద్–నాందేడ్, సికింద్రాబాద్–గుంటూరు (వయా నల్లగొండ) తదితర మార్గాల్లో సింగిల్ ట్రాక్‌లే ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే, ఈ జోన్ పరిధి నుండి ప్రతి నిత్యం ఐదొందల రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. డబ్లింగ్ లైన్లలో సమస్యలు తక్కువగా వస్తుంటాయి కాబట్టి ఆయా మార్గాల్లో తిరిగే రైళ్లు గంటల్లో కాకపోయినా నిమిషాల వ్యవధిలో ఆలస్యంగా నడుస్తుంటాయి. అదే సింగిల్ ట్రాక్‌పై ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు వస్తుంటాయి. వాటికి దారిచ్చేందుకు అనేక చోట్ల క్రాసింగ్‌లు చేయాల్సి వస్తుంది. ఆయా మార్గాల్లో డబ్లింగ్, త్రిబులింగ్ ట్రాక్‌లు ఉంటే రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడదు. సింగిల్ ట్రాక్‌పై నడిచే రైళ్లన్నీ ఆలస్యంగానే నడుస్తాయని రైల్వే బోర్డుకు తెలిసినపపటికీ వారి తప్పిదాన్ని డ్రైవర్లు, సిబ్బందిపై నెట్టే ప్రయత్నం చేస్తోంది. రైళ్ల ఆలస్యానికి డ్రైవర్లు, సిబ్బందే కారణమంటూ బలవంతంగా ముద్ర వేసి వారిని చిన్న చూపు చూస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మహబూబ్‌నగర్–కాచిగూడ, హైదరాబాద–బెంగళూరు, హైదరాబాద్–ముంబాయి మార్గాల్లో డబ్లింగ్, త్రిబులింగ్ ట్రాక్‌ల నిర్మాణాలకు రైల్వే బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టినప్పటికీ వాటి నిర్మాణాలకు రైల్వే బోర్డు నిధులు మాత్రం కేటాయించడంలేదు.



### రైళ్ల ఆలస్యం ఆదాయానికి గండి

జోన్ పరిధిలో తిరిగే అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో రైల్వే ఆదాయానికి భారీగా గండిపడింది. రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు చేసిన మార్గాల్లో ట్రాక్‌లకు డబ్లింగ్, త్రిపులింగ్‌ల నిర్మాణాలకు నిధులు కేటాయించకుండా ఉన్న ట్రాక్‌లపై నడుస్తున్న రైళ్లకు వేగాన్ని పెంచింది. అయితే కొంత కాలంపాటు సమయపాలన పాటించి ప్రయాణికులు, అధికారుల మన్నెలు పొందిన రైళ్లు క్రమంగా అదే తంతును కొనసాగిస్తున్నాయి.

### వేగం పెరిగిన రైళ్ల వివరాలు

దక్షిణ మధ్య రైల్వే జోన్, ఇతర జోన్ల నుంచి దక్షిణ మధ్య రైల్వే మీదుగా వెళ్లే రైళ్లకు రైల్వే బోర్డు వేగాన్ని పెంచింది. తిరుపతి–హైదరాబాద్ మధ్య తిరిగే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ సహా నాలుగు రైళ్లకు గమ్యస్థానాల్ని పొడిగించటంతో పాటు ముఖ్యమైన స్టేషన్లలో 146 రైళ్ల సమయాన్ని మార్చింది. తిరుపతి–హైదరాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిజామాబాద్ వరకు పొడిగించారు, మచిలీపట్నం–సికింద్రాబాద్ మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ బీదర్ వరకు, కొల్హాపూర్–హైదరాబాద్ మధ్య తిరిగే కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ మణుగూరు వరకు పొడిగించింది. అలాగే మచిలీపట్నం–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ 35 నిమిషాలు, సికింద్రాబాద్–మణుగూరు ఎక్స్‌ప్రెస్ పది నిమిషాలు, హైదరాబాద్–గుంతకల్ ఐదు నిమిషాలు, సికింద్రాబాద్–కర్నూల్ సిటీ ఐదు నిమిషాలు, సికింద్రాబాద్–గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఐదు నిమిషాల పాటు వేగం పెంచారు. మంగుళూరు సెంట్రల్–కాచిగూడ ఎక్స్‌ప్రెస్ తెల్లవారు జామున 03.30కి బదులు అర్ధరాత్రి 11.50 గంటలకు కాచిగూడ చేరుకునే విధంగా సమయాన్ని మార్చారు. అయితే ఈ రైలు దాదాపు నాలుగు గంటల ముందే కాచిగూడకు చేరుకుంటుంది. విశాఖపట్నం–హెచ్‌ఎస్ నాందేడ్ రైలు వంద నిమిషాలు, హైదరాబాద్–కొచ్చువేలు 45నిమిషాలు, తిరుపతి–పాండిచ్చేరి, తిరుపతి–భువనేశ్వర్ మధ్య తిరిగే రైళ్లకు 40 నిమిషాలు వేగం పెంచింది. షాలిమార్–సికింద్రాబాద్, తిరుపతి–రామేశ్వరం రైళ్లుపాత సమయం కంటే 30 నిమిషాల ముందే గమ్యస్థానం చేరుకునే విధంగా రైళ్ల వేగాన్ని పెంచింది. ఆయా రూట్లలో తిరిగే మొత్తం 19 రైళ్లకు వేగం పెంచుతూ రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

మణుగూరు–సికింద్రాబాద్ ప్యాసింజర్ 90నిమిషాల ముందే ఆయా స్టేషన్లకు చేరుకునే విధంగా వేగాన్ని పెంచింది. ఖాజీపేట–మణుగూరు 35 నిమిషాలు, డోర్నకల్–భద్రాచలం రైలు 20 నిమిషాలు వేగం పెరిగాయి. మొత్తంగా 33 ప్యాసింజర్ రైళ్ల వేగం పెరిగింది. చాలా రైళ్ల వేగం 5, 10 నిమిషాలు పెరిగింది. డెమూ రైళ్లలో కరీంనగర్–సిర్పూర్ కాగజ్‌నగర్ అత్యధికంగా 25 నిమిషాలు వేగం పెరిగింది. 33 ప్యాసింజర్, మూడు డెమూ రైళ్ల వేగం పెరిగింది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను సూపర్‌ఫాస్ట్‌గా మార్చింది.

### బాగుపడని డ్రైవర్ల బతుకులు

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో దాదాపు రెండొందల డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డ్రైవర్లను భర్తీలు చేయకుండా రైల్వే బోర్డు విదుల్లో కొనసాగుతున్న డ్రైవర్లకు అదనపు భారం మోపుతున్నారు. వారి నిద్రాహారాలు మాన్పించి డబుల్, త్రిబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. జబ్బు చేసినా, జ్వరం వచ్చినా అధికారులు చెప్పినట్టు డ్యూటీ చేయాల్సిందే. లేదంటే వారి ఆగ్రహానికి బలికాక తప్పదు. ఏదో కారణం చూపించి సదరు డ్రైవర్‌కు నోటీసులో లేక అన్‌ఫిట్ అనే ముద్రవేసి అతనికి దక్కాల్సిన బెన్‌ఫిట్లు అందకుండా చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

# గురుకుల పీజీటీ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణలోని వివిధ గురుకులాల్లో ప్రకటించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. పీజీటీలో 921 పోస్టులకు 838 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో 83 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయలేదు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆప్షనల్ సబ్జెక్టులు (మ్యాథమెటిక్స్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్)ల్లో 513 పోస్టులకు 475 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ఇందులో 126 మ్యాథమెటిక్స్ పోస్టులకు 114 మంది, 22 బయలాజికల్ సైన్స్ పోస్టులకు 21 మంది, 177 సోషల్ సైన్స్ పోస్టులకు 166 మంది, 188 ఫిజికల్ సైన్స్ పోస్టులకు 174 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఆప్షనల్ సబ్జెక్టుల్లో అర్హులైన అభ్యర్థుల్లేక 38 పోస్టులకు ఎంపిక చేయలేదని తెలిపారు. గతనెల 20న ప్రకటించిన పీజీటీ భాషాపండితుల సబ్జెక్టుల్లో 408 పోస్టులకు 363 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు.

ఇందులో తెలుగుకు 101 మంది, హిందీకి 43 మంది, ఉర్దూకు 21 మంది, ఇంగ్లీష్‌కు 198 మంది చొప్పున మొత్తం 363 మంది ఎంపికయ్యారు. 2017, జులై 18,19 తేదీల్లో గురుకుల పీజీటీ పోస్టులకు మెయిన్స్ రాతపరీక్షలు జరిగాయి. 2017, అక్టోబర్ 20, 31, నవంబర్ 1,2,8,15,19 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించారు. గురుకులాల్లో పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ నెంబర్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వాణీప్రసాద్ తెలిపారు.

వికలాంగుల కేటగిరీలో ఎంపికైన అభ్యర్థుల ఫలితాలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు టీజీటీ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైతే, టీజీటీ పోస్టులు అవసరం లేదని లిఖితపూర్వకంగా రాసిస్తే ఆ స్థానంలో ఇంకొకరిని ఆ పోస్టులకు ఎంపిక చేయడానికి అవకాశముంటుందని సూచించారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. కోర్టు తీర్పునకు లోబడి ఈ పీజీటీ ఫలితాలు ప్రకటించామని తెలిపారు.

### తొలి పర్యటన



ప్రపంచంలోనే పౌరసత్వం పొందిన మొట్టమొదటి రోబోట్‌గా పేరుగాంచిన సౌదీ అరేబియాకు చెందిన సోఫియా తొలిసారిగా భారత్ పర్యటనకు వచ్చింది .

## ఏపీని పట్టించుకోని బీజేపీ: సీపీఐ

**అమరావతి** : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీ రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. దక్షిణాదిలో బీజేపికి ఓట్లు రావన్న ఉద్దేశంతోనే పట్టించుకోవడం లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాలకు మాత్రం కేంద్రం వేలు, లక్షల కోట్లలో సాయం చేస్తోందన్నారు. పోలవరం విషయంలో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల మధ్య రాజకీయంగా విభేధాలుండడం వల్లే పరిష్కారానికి నోచుకోవడం లేదని, దీనిపై జోక్యం చేసుకోవాలని ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోడీకి స్వయంగా వివరించామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.33వేల కోట్లు చెల్లించాల్సి ఉన్నందున 2019 నాటికి పోలవరాన్ని పూర్తిచేయడం సాధ్యం కాదన్న విషయాన్ని మోడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాజకీయ పోరాటం ద్వారానే పోలవరం పూర్తవుతుందన్నారు. రాష్ట్రానికి చెందిన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ రాష్ట్రప్రయోజనాల్ని సాధించు కోలేకపోవడం దురదృష్టక రమన్నారు. రాష్ట్రానికి న్యాయం చేస్తారో లేదో వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీని అతలాకుతలం చేయాలని బీజేపీ కంకణం కట్టుకుందని, దీనికి మోడీనే స్వయంగా దిశానిర్దేశం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీని నిలదీసే దమ్ము టీడీపీకి లేదన్నారు. ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం అమల్లోకి వస్తే సామాన్యులకు కష్టాలు తప్పవన్నారు. బ్యాంకుల నుంచి వేలాది కోట్లు రుణాలు ఎగ్గొట్టే కార్పొరేట్లను కాపాడేవిధంగా ఈ బిల్లును తీసుకొస్తున్నార న్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నేటి నుంచి విజయవాడలో పుస్తక ప్రదర్శన

**విజయవాడ** : విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే పుస్తక ప్రదర్శన నేటి నుంచి స్వరాజ్య మైదానంలో ప్రారంభం కానుంది. 29వ విజయవాడ పుస్తక ప్రదర్శనను ఉదయం 11 గంటలకు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ప్రదర్శన ప్రారంభించిన అనంతరం ప్రారంభ సభ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు.

## జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

**హైదరాబాద్** : జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తొలి సభ్యత్వాన్ని పవన్ స్వీకరించారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలకు సభ్యత్వ నమోదు పత్రాల్ని అందజేశారు. సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా జనసేన ఐటి విభాగం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించిన పవన్, సంతృప్తిని వ్యక్తం చేశారు.

## అమిత్‌షా కాల్ నితిన్ కూల్

### తగిన శాఖలను ఇస్తానని హామీ



**గాంధీనగర్** : గుజరాత్ డిప్యూటీ ముఖ్యమంత్రి నితిన్ పటేల్ తనకు సరైన శాఖలను కేటాయించక పోవడంతో అసంతృప్తి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి. విజయ్‌రూపానీ బిజెపి ప్రభుత్వంలో ఆయనకు ఇచ్చిన కొత్త శాఖల నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు రెండు రోజులుగా గైర్హాజరు కావడమే దీనికి కారణం. ఎట్టకేలకు ఆదివారం ఆయనకు కేటాయించిన శాఖలకు బాధ్యతలు నిర్వహించడానికి సమాయత్తం అయ్యారు. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా తనకు ఫోన్ చేసి తగిన శాఖలను కేటాయిస్తానని హామీ ఇచ్చినందుకు సెక్రటరీయేట్ వెళ్ళి ప్రస్తుత శాఖ (రోడ్డు, భవనాలు, ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, నర్మద, కాపిటల్ ప్రాజెక్ట్) బాధ్యతలను నిర్వహిస్తానని నితిన్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన ఆర్థిక, పట్టణాభివృద్ధి శాఖలను నుండి నితిన్ను తొలగించడంతో అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. శనివారం కూడా పదవి కోసం కాదని గౌరవం కోసం పోరాడుతున్నా నని పేర్కొన్నారు. పార్టీలో తన గౌరవ మర్యా దలు తిరిగి పునరుద్ధరించాలని పేర్కొన్నారు.

# బహుజనోద్ధరిణి సావిత్రిబాయి పూలే



మహేష్‌దుర్గే

అది 1830వ దశకం. బ్రాహ్మణవాద సాంప్రదాయ చీకటి గమ్యం ఆనాటి స్త్రీ జీవితం. సామాజిక కట్టుబాట్ల బేడీలు కదలనీయని కాలం. చదువు- సంపదలు అనంతదూరం. సనాతన భావజాలంలో మగ్గుతూ దాసిగా గడపటం తప్ప చెప్పుకునే విధిలేని గాథ... అలాంటి సమయంలో ఆధిపత్యాన్ని అధిగమించాలి, సమానత్వాన్ని సాధించాలి అంటే చదువును మించిన పునాది లేదని గ్రహించిన మహాత్మ జ్యోతిరావుపూలేతో కలిసి బహుజనోద్ధరణకు నడుంబిగించి మహాత్మురాలైంది సావిత్రిబాయిపూలే. విద్యపై, ఆస్తిపై హక్కును సాధించిన నాడే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మిన వ్యక్తి సావిత్రిబాయి. ఆ నమ్మకాన్ని నిజం చేయాలని వెన్నుతట్టిన భర్త జ్యోతిరావు పూలే కావడం ఓ గొప్ప మలుపు. ఆ మలుపే గొప్ప స్త్రీ జనోద్ధారక సంఘ సంస్కర్త కావడం, ఆ మలుపే నేడు తన జయంతిని పురస్కరించుకుని జనవరి 3 "భారతదేశ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం"గా రూపుదిద్దుకోవడం మహదానందం. 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా, నయాగాం గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించింది మహాత్మా సావిత్రిబాయిపూలే. లక్ష్మీబాయి, ఖండోజిల సుపుత్రిక. చలాకీగా, చురుగ్గా తోటిపిల్లతో సఖ్యతగా మెకలగటం తన వ్యక్తిత్వం. 5,6 సం॥ల వయసులోనే వ్యవసాయంలో తల్లిదండ్రులకు సహకరించడం, పశువులతో ఆడుకోవడం మహా ఇష్టం. సావిత్రిబాయికి చదువుకోవాలనే ఆశ. కానీ బ్రాహ్మణీయ భావజాల పురుషాధిక్య సమజంలో బాలికల విద్యనిషేధం. తొమ్మిదేండ్ల చిరుప్రాయంలోనే (1840) పన్నెండేండ్ల జ్యోతిబాపూలేతో వివాహమైంది. ఇద్దరిదీ ఒకే మనస్తత్వం కావడంతో జ్యోతిబా సహచర్యం అఖండ విజయాలు సాధించిపెట్టింది.

**తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా...**

వివాహానంతరం జ్యోతిబాపూలే ప్రోత్సాహంతో ఇంటి వద్దే అక్షరాభ్యాసం చేసింది. సనాతన ధార్మిక కట్టుబాట్ల అసమాన సమాజంలో అణగారిన వర్గాలకు, మహిళలకు విద్య నిషేధమున్న కాలమది. బ్రాహ్మణవాద ఆధిపత్య భావజాలాన్ని ధిక్కరించి మహిళలకు చదువు చెప్పడానికి సిద్ధమైంది. 1847-48లో అహ్మదాబాద్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 జనవరి 1న పూణెలో నిమ్నవర్గాల బాలికల కోసం పాఠశాల ప్రారంభించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ఖ్యాతి పొందింది. అదే సంవత్సరం జనవరి 12న బహుజనుల కోసం పాఠశాల నెలకొల్పారు. అప్పటికీ తన వయసు 18 సంవత్సరాలే. దంపతులిద్దరు కలిసి మొత్తం 52పాఠశాలలు నెలకొల్పారు. ఈ కాలంలోనే ఆధిపత్య వర్గాలనుండి అనేక దాడులను, అవమానాలను ప్రతిఘటించారు. 1849లో దంపతులిద్దరూ గృహ బహిస్కరణకు గురయ్యారు. అడుగడుగునా కష్టాలనుభవించారు.

**సంఘసంస్కర్తగా...**

అడుగడుగునా కష్టాలను, అవమానాతలను భరిస్తూ అసమానతలను రూపుమాపాలనే ఆలోచన మరింత పెంచుకున్నారు. మానవ హక్కులు సాధించడం కోసం, స్త్రీలను చైతన్య పర్చడానికి 1852లో "మహిళా మండల్" పేరుతో సంఘాన్ని స్థాపించారు. కులవివక్ష, లింగ వివక్ష, పితృస్వామ్య భావజాలాలకు వ్యతిరేకంగా పోరాడారు. స్త్రీ సాధికారత కోసం నినదించారు. మహిళల హక్కులే మనవ హక్కులని నినదించిన తట్టతొలి భారత మహిళ సావిత్రిబాయి పూలే. అసత్యభావజాల నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను బద్ధలు కొట్టడం, బాల్యవివాహాలు, పితృస్వామ్యం వంటి అనాగరికతను నాశనం చేయడమే ధ్యేయంగా 1873లో భర్తతో కలిసి "సత్యశోధక్ సమాజ్"ను స్థాపించారు. ఈ పేరులో మూఢ విశ్వాసాల సంస్కృతికి స్వస్తి పలకాలని, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాలని ఉద్యమించారు. బాల్యంలోనే వైధవ్యం ఎదుర్కొంటున్న ఆడపిల్లలకు ఆశ్రయం కల్పించారు. వితంతువులైన మహిళలకు శిరోముండనం చేయడాన్ని వ్యతిరేకించారు. క్షౌరకులను ఏకం చేసి వితంతువులకు తలవెంట్రుకలు తీయలేమని సమ్మె చేయించిన మహామనిషి సావిత్రిబాయి. కులబలం ఆధారంలేని గర్భిణులకు ఆశ్రయమిచ్చి బారసాల చేసి ఆదుకున్న సేవాతత్పరురాలు... అటువంటి వారిలో ఒక మహిళ మగబిడ్డను కని చెప్పకొని వెళ్లిపోతే ఆ దంపతులు దత్తత తీసుకుని పెంచి డాక్టర్ చదివించిన ఘనులు. ఆయనే డాక్టర్ యశ్వంత్. 1870లో, 1896లో కరువు వచ్చి ఆకలి చావులు చస్తుంటే వేల మంది అనాథ బాలబాలికలను అక్కున చేర్చుకుని మధ్యాహ్న భోజన వసతి కల్పించి చదువు చెప్పారు. 1890 నవంబర్ 28న జ్యోతిబాపూలే మరణించారు. ఆ తరువాత 1897లో పూణెలో ప్రబలిన ప్లేగు వ్యాధి గ్రస్తులను పెంపుడు కుమారుడు యశ్వంత్ నిర్వహిస్తున్న ఆస్పత్రిలోనే వైద్యసేవలందించారు. ఆఖరికి తనూ అదే వ్యాధితో తుదిశ్వాస విడిచింది. ఇలా సారావ్యతిరేక ఉద్యమం, అనాథాశ్రమాలు, సత్యశోధక ఉద్యమం, తొలి కార్మిక ఉద్యమం వంటి అనేక సామాజిక ఉద్యమాల్లో భర్తతో పాలుపంచుకున్నది.

**సాహిత్యకారిణిగా...**

సావిత్రిబాయి సంఘసంస్కర్తయేకాకుండా తన అనుభవాలు, ఆలోచనలు రచనలు చేసి "కావ్యఫూలే" 41 కవితలు (1854లో) ప్రచురించారు. "భావన్ ఖషి సుభోద్ రత్నాకర్" పేరుతో జ్యోతిబాపూలే జీవిత చరిత్ర (1891) కవితా సంపుటాలను 1892లో తన ప్రసంగాలు పుస్తక రూపంలో వెలువరించారు. ఇలా ఆచరణ వాదిగా నిలిచిన సావిత్రిబాయి పూలే నుండి మనందరం స్ఫూర్తి పొందాల్సిన అవసరమున్నది.

**స్త్రీల అభ్యున్నతే సమస్త జాతి అభ్యున్నతి**

భారతదేశ సామాజిక పీడనలో మొట్టమొదటిది కులవ్యవస్థ అని ప్రపంచమెరిగిన సత్యం. కానీ ప్రపంచం మొత్తంగా "అందుగలదందులేదని సందేహంబు వలదు" అన్నట్లు స్త్రీ వివక్ష ఉన్నది. స్త్రీ పుట్టుకతోనే వివక్షకు నెలవైంది. ఏ కులమైనా, ఏ జాతైనా ఏ ప్రాంతమైనా స్త్రీ జాతి ఛాందస భావజాలానికి, పురుషుని కింద నలుగుతూనే ఉంది. ప్రత్యేకంగా భారత సామాజిక వ్యవస్థ పరంగా పరిశీలించినట్లయితే సనాతన హిందూ భావజాల ప్రభావం ఈనాటికీ మహిళను మనిషిగా చూడనీయడంలేదు. అనేక ప్రాంతాల్లో, అనేక జాతుల్లో, కేవలం ఊడిగం చేసే ఇంటి పని మనిషిగా సేవకురాలిగా, కనీస గుర్తింపు లేకుండా పురుషుల ముందు నిలబడే హక్కు, మాట్లాడే హక్కు, చదువుకునే హక్కు, ఆస్తి హక్కు వంటివేవీ లేకుండా దాశ్య శృంఖలాల్లో మగ్గుతోంది. బాల్యవివాహాలు, వితంతు జీవనం, వరకట్నం, భ్రూణహత్యలు, అత్యాచారాలు, భౌతిక, మానసికదాడులు, హత్యలు ఎదుర్కొంటున్నారు. అనేక మంది ఆత్మహత్యలకు గురవుతున్నారు. ఇటువంటివన్నిటిని అధిగమించి ఆనాడే సావిత్రిబాయి పూలే బ్రాహ్మణవాద అశాస్త్రీయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. స్త్రీ అభివృద్ధి కాకుండా సమస్త జాతి అభివృద్ధి కాదని నినదించారు. ఆమె జీవితం భారత స్త్రీజాతికి గర్వకారణం.

సెల్ : 9700888972

# ఆదర్శ విప్లవ స్త్రీ సావిత్రిబాయి పూలే

అస్నాల శ్రీనివాస్

చరిత్రను వెనక్కి నడిపించే ప్రతిఘాతక శక్తుల విష కౌగిలి నుంచి చరిత్రను ముందుకు నడిపించాల్సిన ప్రగతిశీల జననేతలు, ప్రతిభామూర్తులు, వైతాళికశక్తులు విధిగా ఉదయించి తీరాల్సిన కాలమది. ఆనాడు పీష్వాలు పాలిస్తున్న మరాఠా రాజ్యం స్వార్థపరతకు, అసూయ ద్వేషాలకు, కులతత్వానికి నెలవుగా ఉండేది. దేశ చరిత్రలో నిమ్నవర్గాలు, రైతులు, స్త్రీలపై కనీవిని ఎరుగని వివక్ష, హింసను ప్రయోగిస్తున్న కాలమది. రెండో బాజీరావు పాలన కాలంలో ఇది మరింతగా విషమించి సంస్కృతి విషపరిణామంతో, మత ఛాందసత్వంతో ప్రజలంతా నిస్సహాయంగా బాహ్యంగా, మానసికంగా, బాధలనుభవించి సమాజ క్షీణదశకు, పతనానికి దారి తీస్తున్న చీకటి కాలమది. ఈ నేపథ్యంలో కింది వర్గాల ప్రజలకు సాంఘిక, రాజకీయ రంగాలలో నూతనోత్తేజాన్ని, అభ్యుదయకరమైన ఆలోచనలను, ఆచరణను ఇవ్వడానికి ఓ సామాజిక విద్యా దీపస్తంభాన్ని అందించాల్సిన చారిత్రక కర్తవ్యం అనివార్యంగా మరాఠా రాజ్యంపైనే కూడా పడింది. చారిత్రక వైతాళికులను ప్రసవించాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని చరిత్ర మాత చేపట్టి పురిటి నొప్పులు భరించి కనిపెంచిన విప్లవ ప్రతిభాశాలి సావిత్రిబాయి పూలే. బహుజన సమాజంతోపాటు, అన్ని వర్గాల స్త్రీలు "ఓనమాలు" కూడా దిద్దలేని అజ్ఞానం, మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్న అంధకార యుగంలో వేగుచుక్కగా ఉదయించిన సావిత్రిబాయి పూలే 1831వ సంవత్సరం జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా జిల్లాలో గల నయాగావ్ గ్రామంలో జన్మించారు. బాల్యం నుండే సహజాతంగా అబ్బిన పట్టుదల, కరుణ, సమత, జిజ్ఞాస వంటి గుణాలు భర్త జ్యోతిరావుపూలే సహచర్యంలో మరింతగా వికాసం చెంది జీవితాంతం శ్రేయోమార్గంలో శ్రమించిన భారతమాత ప్రియ పుత్రిక సావిత్రిబాయి పూలే.

మరాఠ ప్రాంతంలో పీష్వాల పాలన అంతమై, ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చినా గ్రామాలలో ఆధిపత్య వర్గాల స్వభావం, పాలనా స్వరూపం మారలేదు. 1813 చార్టర్ చట్టం, 1835 మెకాలే విద్యా విధానంతో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం బలోపేతమై పాశ్చాత్య విజ్ఞానాన్ని, శాస్త్రీయ విద్య వ్యాప్తికి కృషి చేయడం ప్రారంభించింది. ఫలితంగా కింది జాతుల ప్రజలకు విద్యావకాశాలకు కొంత ప్రోత్సాహం లభించింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న జ్యోతిరావు పూలే తన విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ స్కాటిష్ బడులలో మరాఠీ, ఆంగ్లంలో నేర్చుకున్నాడు.



అమెరికన్ స్వాతంత్రోద్యమ నేత జార్జ్ వాషింగ్టన్ పోరాట పటిమ, జాన్ స్టువర్ట్ మిల్ గ్రంథం "ఆన్‌లిబర్టీ"లో గల ఉదాత్త ప్రజాస్వామిక భావాలతో ప్రేరేపితుడైన జ్యోతిరావుపూలే సావిత్రిబాయికి సహచరుడిగా లభించడం మహత్తరమైన ఘట్టం. ఈ సమాన జంట భారతదేశ సాంఘిక విద్య విప్లవానికి తమ శక్తినంత ధారపోసి నిజమైన జీవితానందం, నైతిక సౌందర్యం, మానవ విమోచన ఉద్యమాలలో ఉన్నదని గుర్తించి, దారి దీపాలుగా వెలిగి, ఆ వెలుగును తర్వాత తరాలకు అందించి, అంబేడ్కరుకు స్ఫూర్తిని కల్గించి, తమ త్యాగ ఫలితాలను అనుభవిస్తున్న కోట్లాది హృదయాలలో దేదీప్యమానంగా వెలుగుతూ తమ జన్మను పూలే దంపతులు సార్థకం చేసుకున్నారు.

జ్యోతిరావుపూలే అహమ్మద్‌నగర్ వెళ్లినప్పుడు అక్కడ అమెరికన్ మిషనరీ వారు ఆడపిల్లల కోసం నడిపే బడిని చూసి ఎంతో ఆకర్షితుడై సమాజ ఆంక్షలను ధిక్కరిస్తూ తనకు వచ్చిన విద్యను సావిత్రిబాయికి నేర్పించాడు. ఆసక్తి కలిగిన మరాఠీ, ఆంగ్లంలో చదవడం, రాయడం నేర్చుకుంది. ఇది ఆమె జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. వెంటనే పూలే దంపతులు పూనెలోని బుధవారపేటలో బాలికా పాఠశాలను 1848 జనవరి 1న ప్రారంభించారు. బాలికల పాఠశాల కావడంతో పని చేసేందుకు మగవారెవరూ ముందుకు రాలేని స్థితిలో తనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, ముఖ్య ఉపాధ్యాయురాలిగా పాఠశాలను ధైర్యంగా నిర్వహించింది. "విద్య లేక వివేకం తగ్గింది, వివేకం లేక నీతి తగ్గింది. నీతి లేక పురోగతి తగ్గింది, పురోగతి లేక సంపద తగ్గింది, సంపద లేక శూద్రులు, స్త్రీలు వెనుకబడిపోయారు. ఇంత అనర్థం ఆ విద్య వల్ల జరిగిందని ప్రజలకు ప్రభోదిస్తూ చైతన్యపరుస్తూ, మనువు పెట్టిన ఆంక్షలన్ని నిజం కాదు, వాటిని ఇప్పుడు పాటించవలసిన అవసరం లేదు. రండి చదువుకోండి, మేము మీకు చేయూతనిస్తాం, మమ్ములను అనుసరించండి, చదువు మీకు ఆనందాన్ని, విజ్ఞానాన్ని ఇస్తుంది" అని ప్రచారం చేస్తూ బాలికలను బడికి తీసుకొని వచ్చేవారు. బాలికలకు ఆటపాటలు నేర్పించి వారి అభిమానాన్ని ప్రేమను సంపాదించి వారిని చదువు వైపు మరలించేవారు. పిల్లలకు తన హృదయాన్ని అంకితం చేసి వారు నిరంతరం ప్రేమ, సంతోషాలలో ఉండేటట్టు చేసి పాఠశాలను సంతోషవనంగా మార్చి వారి మానసిక వికాసానికి శక్తియుక్తులను ఉపయోగించింది. సంప్రదాయవాదుల అవహేళనలు, బెదిరింపులు, అవమానాలు, దాడులకు సైతం ఏ మాత్రం చలించక "ప్రాణం పోయిన సరే లక్ష్యసాధనలో వెనక్కి పోను"అంటూ కర్తవ్య దీక్షతో ముందుకు సాగారు. ప్రభుత్వ విద్యావ్యాప్తికి విక్టోరియా రాణి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా కోరారు. 1846 నుండి 1876 వరకు పూలే జంట యాభైకి పైగా పాఠశాలలను శూద్రులు, అతి శూద్రులు, బాలికల కోసం స్థాపించారు. వీరి కృషి ప్రభుత్వాన్ని, ఇతర సంస్థలను కదిలించి అనేక పాఠశాలల స్థాపనకు దారి తీసింది. హంటర్ కమిషన్ (1882) కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పిస్తూ సమాజ సంపద సృష్టికర్తలైన శ్రామిక వర్గాలకు అందుబాటులో విద్య, ఉపాధ్యాయ వృత్తిలో అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విధంగా తమ అసమాన చలనశీలతతో భారత ప్రజాతంత్ర విద్యా విప్లవానికి ప్రారంభకులుగా చరిత్రలో నిలిచారు.

సావిత్రిబాయి స్వయంగా స్త్రీలలో చైతన్యం పెంపొందించేందుకు, మహిళా సేవామండలిని ప్రారంభించింది. అంటరానితనం నిర్మూలన, సతి, బాల్యవివాహం, వైధవ్యం, ఆడశిశు హత్యలు వంటి మూఢ సంప్రదాయాలను రూపుమాపటానికి భారతదేశంలో స్థాపించిన తొలి సంస్థ. ఈ సంస్థ 1852 జనవరి 14న మకరసంక్రాంతి సందర్భంగా "సార్వజనిక్ తిలగుండ్ సమారోహ్" అనే ఉత్సవాన్ని కులమతాలకతీతంగా భాగస్వామ్యం చేసి నిర్వహించింది. హేతువాదం, మానవవాదం పునాదులుగా సమాజం పురోగమించడం కోసం శాయశక్తులా ప్రయత్నం చేసింది. వితంతువులు, అత్యాచార బాధితులు, వారి పిల్లలకు ఆశ్రయం కోసం "బాల హత్య ప్రతిబంధక గృహాన్ని" 1853 జనవరి 1న ఏర్పాటు చేసింది. వీటితోపాటు జ్యోతిరావ్ నిర్వహించిన రైతాంగ, కార్మిక హక్కుల పోరాటాలలో, "సత్య శోధక సమాజ్" నిర్మాణంలో క్రియాశీల పాత్రను పోషించింది.

రాయికి కుంకుమ పెట్టి, నూనెలో ముంచి, దేవుడనే దేవత అంటున్నారే, నిజానికది రాయే కదా అంటూ రాళ్లకు మొక్కితే పిల్లలు పుడితే, మరి ఆకారణంగా స్త్రీ, పురుషులు పెండ్లెందుకు చేసుకుంటారని ప్రశ్నించారు. అమ్మ గురించి రాస్తూ ఆమె ముందు సముద్రం కూడా చిన్నబోతుంది, ఆమె ముందు ఆకాశం కూడా తలదించుకుంటుంది అని ఆర్తియంగా రాశారు. అజ్ఞానం గురించి రాస్తూ "శత్రువొక్కటే మనందరికి, దానిని తరిమికొడదాం" ఆ దుష్టశత్రువు పేరు అజ్ఞానం, దాని గొంతు పిసికి జీవితం నుండి దూరం పారదోలుదాం అని చైతన్య గీతికలు రాశారు. ఇంకా మనిషి వ్యవహారించాల్సిన తీరును వ్యంగంగా ఒక కవితలో విద్య లేదు, జ్ఞానం లేదు, చేతులు ముడుచుకొని కూర్చుంటారు, ఆలోచన లేదు, ఆచరణ లేదు, జ్యోతిష్యం, పంచాంగం చుట్టూ తిరుగుతారు. బానిసత్వం గురించి బాధపడని వారు అభివృద్ధి సంకల్పం లేని వారు, మానవత్వాన్ని అణగదొక్కేవారు వారిని మనుషులని ఎలా చూడాలని నవ్య మానవునికి ఉండాల్సిన లక్షణాలను హృద్యంగా వ్యక్తం చేసారు.

1890లో పూలే మరణం తర్వాత దుఃఖాన్ని దిగమింగుకొని అతని సామాజిక చైతన్య ఆశయ సాధన కార్యక్రమాలను కొనసాగించారు. 1896వ సంవత్సరంలో మహారాష్ట్రలో కరువు వచ్చినప్పుడు ప్రభుత్వం ద్వారా సహాయ కార్యక్రమాలు జరిగేందుకు విశేష కృషి చేశారు. విద్యా సంస్థల్లో చదువుకునే పిల్లలను "ఈ పిల్లలే ఈ దేశానికి ఆస్తి, ఈ దేశ ఆస్తులే నా ఆస్తి" అని కరువు కోరల నుండి పిల్లలను కాపాడుకుంది. కరువు తర్వాత ప్లేగు వ్యాధి భారిన పడిన ప్రజలకు సేవలు అందించింది. ఈ విరామమెరగని సేవా ఫలం వలన ఆరోగ్యం క్షీణించి 1897వ సంవత్సరం మార్చి 10వ తేదీన సావిత్రిబాయి మహాపరినిర్యాణం చెందింది. 150 సంవత్సరాల క్రితమే ఈ భారతావనిలో మానవుడు మానవత్వాన్ని మననగలాలని, ప్రతి మనిషికి ఒకే విలువ ఉండాలని, విద్య, ఆరోగ్యం ప్రజల హక్కు అని వంటి లక్ష్యాలతో సామాజిక విప్లవాన్ని ప్రారంభించిన అనేక విజయాలను మనకు సమకూర్చిన పూలే దంపతుల ఆశయాల సంపూర్ణ సాధనకు పరిశ్రమించాల్సిన బాధ్యత పౌర సమాజం, ప్రభుత్వంపై ఉన్నది.

సెల్ : 9652275560

# దళిత, గిరిజనుల సంక్షేమానికి బాటలు పడేనా?



డా॥సిలువేరు హరినాథ్

70 ఏండ్ల స్వతంత్ర్య భారతావనిలో నేటికింకా దళిత, గిరిజనుల పట్ల అంటరానితనం, ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నవి. మహిళలపై లైంగికదాడులు పెట్రేగిపోతున్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17లో నిర్దేశించినట్లు సమాజంలో అంటరానితనం రూపుమాపాలి. ఆ దిశగా పాలక పార్టీలు చర్యలు తీసుకోవాలి. అనేక ప్రాంతాల్లో ప్రజల మధ్య తీవ్రస్థాయిలో వ్యత్యాసాలు కొనసాగుతున్నాయి. ఆర్టికల్ 46లో పేర్కొనట్టుగా దళిత, గిరిజనులు విద్యా, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందేలా చూడాలి. దశాబ్దాల కాలంపాటు మార్గదర్శకాలు ఆచరణలో లేకపోవడం వల్ల దళిత, గిరిజనులు వెనుకంజలో ఉన్నారు. దేశంలో దళితుల అక్షరాస్యత 1961లో 10.27 శాతం ఉండగా అది 2011 లో 66.10 శాతంగా నమోదైంది. గిరిజనుల అక్షరాస్యత 1961 లో 8.53 శాతం ఉండగా 2011లో 58.96 శాతం ఉంది. అంటే 50 సంవత్సరాల కాలంలో దళితులు 56.03 శాతం, అలాగే గిరిజనులు 50.43 శాతం మేర పురోగతి సాధించారు. కానీ ఆర్థికంగా వీరు ఎలాంటి పురోగతి చెందకపోవడం వల్ల నేటి సమాజంలో వీరికి సరైన ప్రాతినిధ్యం లభించడం లేదు. ఇది నెరవేరాలంటే ఆర్టికల్ 338/ 338ఎ/ 339లో సూచించినట్టుగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. 12వ పంచవర్ష ప్రణాళికలు పూర్తిచేసుకొని ఇప్పుడు నిటి ఆయోగ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నప్పటికీ దళిత, గిరిజనుల అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన చర్యలు అమలు చేయకపోగా వీరి సమగ్ర సమాచారం కూడా అందుబాటులో లేకుండా పోయింది.

దేశంలో అధికారంలో ఉన్న నాటి కాంగ్రెస్‌పార్టీ 1994లో గిరిజన సంక్షేమం కోసం ట్రైబల్ సబ్‌ప్లాన్‌ని అమల్లోకి తీసుకురాగా 1979-80 మధ్య కాలంలో దళిత సంక్షేమం కోసం స్పెషల్ కంపోనెంట్ సబ్‌ప్లాన్‌ని అమల్లోకి తీసుకొచ్చింది. దీన్ని 2006లో షెడ్యూలు కులాల సబ్‌ప్లాన్‌గా పేరు మార్చారు. కానీ దానికి నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించలేకపోవడమే కాకుండా కేవలం పది సంవత్సరాల కాలపరిమితి విధిస్తూ చట్టాన్ని అమలు చేశారు, కానీ నిధుల వినియోగంలో వీరికి దక్కాల్సిన కేటాయింపులు ఇతర రంగాలకు ఖర్చు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ 2017 మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి ఫండ్ యాక్ట్‌గా అమల్లోకి తీసుకొచ్చింది.

తెలంగాణలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3.5 కోట్ల జనాభా ఉండగా వీరిలో దళితుల జనాభా 54.08 లక్షలు. రాష్ట్ర జనాభాలో దళితులు 15.45 శాతం ఉన్నారు. వీరిలో 49.80 శాతం పురుషులు కాగా మహిళా జనాభా 50.20 శాతం. గిరిజన జనాభా 31.7 లక్షలు. అంటే 9.08 శాతం. గిరిజనుల్లో 50.59 శాతం పురుషులు ఉండగా 49.41 శాతం మహిళలు ఉన్నారు. రాష్ట్ర అక్షరాస్యత 66.54 శాతం ఉండగా దళితుల అక్షరాస్యత 58.90 శాతం. వీరిలో పురుషుల అక్షరాస్యత 68.04 శాతం ఉండగా మహిళలది 59.49 శాతం. గిరిజనుల్లో 49.51 శాతం అక్షరాస్యత ఉండగా వీరిలో పురుషులది 59.49 శాతం, మహిళల్లో 39.44 శాతం నమోదైంది. అయితే గతంలో వీరికి తగిన స్థాయిలో విద్యా అవకాశాలు లేకపోవడం వల్ల ఈ వ్యత్యాసాలు కనబడుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం 2007-2011 మధ్యకాలంలో మొత్తం రూ.27,590.84 కోట్లు కేటాయించగా సుమారు 24.97 శాతం నిధులు వీరి అభివృద్ధికి ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు కేటాయించారు. గిరిజన అభివృద్ధికోసం రూ.11,240.70 కోట్లు కేటాయించగా 20.79 శాతం నిధులు దారి మళ్లించారు. ఈవిధంగా రాష్ట్ర విభజన వరకు కొనసాగిందని చెప్పవచ్చు. దళిత, గిరిజనుల విద్యా విధానం చూసినప్పుడు 2015-16 విద్యా సంవత్సరంలో 1-5 తరగతుల్లో దళిత విద్యార్థులు 21.87 శాతం, గిరిజన విద్యార్థులు 38.53 శాతం, 6-8 తరగతుల్లో దళితులు 29.93 శాతం గిరిజనులు 52.57 శాతం అదేవిధంగా 9-10 తరగతుల్లో దళితులు 41.4 శాతం, గిరిజన విద్యార్థులు 61.33 శాతం మంది మధ్యలోనే బడి మానేయడం జరిగింది. వీరి కుటుంబాలు పేదరికంలో ఉండటం వల్ల విద్యార్థులు

**కుటుంబాలు పేదరికంలో ఉండటం వల్ల విద్యార్థులు చిన్నప్రాయంలోనే బాలకార్మిక ఊబిలో చేరి తమకు మించిన భారాన్ని భుజాన వేసుకుంటున్నారు. అంతేకాదు వీరి ఆరోగ్య పరిస్థితులు కూడా మెరుగ్గా లేవని చెప్పాలి. ఇటీవల జాతీయ ఆహార సంస్థ విడుదల చేసిన 2017 నివేదికలో దళితుల్లో 32.4 శాతం మంది బాలురు, 25.2 శాతం మంది బాలికలు, గిరిజనుల్లో 32.6 శాతం మంది బాలురు, 31.7 శాతం మంది బాలికలు పౌష్టికాహార లోపంతో ఉన్నారని స్పష్టమైంది.**

చిన్నప్రాయంలోనే బాలకార్మిక ఊబిలో చేరి తమకు మించిన భారాన్ని భుజాన వేసుకుంటున్నారు. అంతేకాదు వీరి ఆరోగ్య పరిస్థితులు కూడా మెరుగ్గా లేవని చెప్పాలి. ఇటీవల జాతీయ ఆహార సంస్థ విడుదల చేసిన 2017 నివేదికలో దళితుల్లో 32.4 శాతం మంది బాలురు, 25.2 శాతం మంది బాలికలు, గిరిజనుల్లో 32.6 శాతం మంది బాలురు, 31.7 శాతం మంది బాలికలు పౌష్టికాహార లోపంతో ఉన్నారని స్పష్టమైంది. అంటే గ్రామీణ ప్రాంతంలో వీరికి సరైన ఆహారం అందడంలేదని స్పష్టం అవుతుంది. అందువల్ల ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేకదృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌లో దళిత సంక్షేమానికి 14,375.13 కోట్లు కేటాయించింది. అంటే మొత్తం ప్రగతిపద్దులో వీరికి 16.33 శాతం నిధులు కేటాయించారు. వీటిలో ముఖ్యంగా షెడ్యూలు కులాల అభివృద్ధి సంస్థకు 15.40 శాతం, గ్రామీణ అభివృద్ధికి 13.23 శాతం, ఎస్సీ కార్పొరేషన్‌కి 11.37 శాతం, సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థకు 8.63 శాతం, అలాగే వ్యవసాయ రంగానికి 7.24 శాతం నిధులు కేటాయించారు. గిరిజన అభివృద్ధి కోసం 8,165.81 కోట్లు కేటాయించారు. అంటే రాష్ట్ర ప్రగతి పద్దులో 9.27 శాతం నిధులు అన్నమాట. వీటిలో గిరిజన అభివృద్ధి సంస్థకు 31.98 శాతం, గ్రామీణాభివృద్ధికి 9.64 శాతం, వ్యవసాయరంగానికి 6.90 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌కి 3.31 శాతం నిధులు కేటాయించారు.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 268 సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు, 145 గిరిజన సంక్షేమ విద్యాసంస్థలున్నాయి. వీటిలో 154 నూతన విద్యాసంస్థలు 2016లో ప్రారంభించినవే. అలాగే ఉన్నత విద్యలో వీరిని ప్రోత్సహించేందుకు గాను 2016లో దళిత బాలికల కోసం 30 డిగ్రీ కళాశాలలు, గిరిజనుల కోసం 22 డిగ్రీ కళాశాలలను 2017 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు.

ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు భూపంపిణీ కార్యక్రమం 2014లో ప్రారంభించింది. అయితే 2014 నుండి 2017 ఆగస్టు నాటికి 4007 మంది లబ్దిదారులకు 10,562.16 ఎకరాల భూమి మాత్రమే పంచడం జరిగింది. ఈ పథకం నిరంతర ప్రక్రియ అయినప్పటికీ మరింత వేగం పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ వ్యవహారంలోనూ ముందుగా భూమి లేని నిరుపేదలను గుర్తించి వారికి న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉంది. గిరిజనుల భూములను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

సెల్ : 9949030630

# మళ్లీ గ్రామాలలో దొరల పాలన



పి.పాండు నాయక్

గ్రామాలలో ఎప్పుడో అంతరించిపోయిన పటేల్, పట్వారీ వ్యవస్థకు ప్రతిరూపంగా రైతు సంఘాల పేరుతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్త దొరస్వామ్య వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నారు. రైతులకు ఎకరానికి రూ.8 వేల ఎరువులు, విత్తనాల సబ్సిడీని ఇచ్చే పేరుతో ఈ కొత్త వ్యవస్థకు ప్రాణం పోస్తున్నారు. మన ముఖ్యమంత్రి భాషలో చెప్పాలంటే ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రైతు సంఘం ఏర్పాటు చేసి దాని ద్వారా గ్రామంలోని రైతులతో బ్యాంకులలో ఖాతాలను తెరిపించి అందులోకి రైతుల సబ్సిడీ మొత్తాలకు జమచేస్తారు. పైకి ఇదొక్కటి మాత్రమే కనిపిస్తుం ది. ఖమ్మం జిల్లాలో జరిగిన ఒక పార్టీ నేతల మీటింగ్‌లో చిన్న, సన్న కారు రైతులను ఎలా దోచుకు తినాలో, వారిని ఏ విధంగా మోసం చేయాలో నాయకులకు వివరించారు. ఆ తరువాత రాజకీయంగా ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో 11 మంది సభ్యులతో గ్రామ సమన్వయ సమితి ఏర్పాటు చేశారు.. గ్రామ సమితులు కలిసి మండల రైతు స మాఖ్యగాను, మండల సమాఖ్యలు కలిసి జిల్లా సమాఖ్యలుగాను, జిల్లా సమాఖ్యలు అన్ని కలి సి రా ష్ట్ర సమాఖ్యగాను చేశారు. గ్రామ రైతు సమితికి, మండల, జిల్లా, రాష్ట్ర సమాఖ్యలకు సభ్యులతో పాటు అధ్యక్షులు/ఛైర్మన్లను కూడా నియమించారు. వారే గ్రామంలో అత్యున్నత అధికారం కలిగిన దొరలుగా మారుతారు. ఉదాహరణకు చెప్పాలంటే గ్రామంలో ఉన్న భూమి ఎవరిది అని తేల్చే అధి కారం దొరలదే. వారు చెప్పిన ప్రకారంగానే భూముల వివరాలు రిజిష్టర్లలో మార్పులు చేర్పులు చే యాలని చెప్పుకొస్తున్నారు. వారికి తెలియకుండా ఏ భూమిని రిజిష్టర్ చేయడానికి, కొనుగోలు, అమ్మకాలు చేయడానికి వీలులేదు. భూక్రయవిక్రయాలు, వారసత్వ మార్పులు, వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ల గురించి రైతు సంఘాలకు ఖచ్చితంగా తెలపాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది.

మరోపక్క కార్యనిర్వాహక వ్యవస్థను నీరుగార్చారు. కల్తీ విత్తనాల పంపిణీపై డిసెంబర్ 2015న నివేదిక ఇస్తే నిందితులపై చర్యలు లేకపోగా, నివేదిక ఇచ్చిన అధికారిపైనే వేటు వేసిన దాష్టీకం తెలంగాణ సర్కార్‌దే. వ్యవసాయ అధికారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం రూ.8 వేల సబ్సిడీ మొత్తాన్ని జమచేస్తుంది. ఈ సబ్సిడీ మొత్తం కోసం రైతుల నుంచి ఎలాంటి దరఖాస్తులను ప్రభుత్వం తీసుకోదు. రైతులు పండించిన పంటను నేరుగా మార్కెట్‌కు వెళ్లి అమ్ముకునే అవకాశం ఉండదు. గ్రామ సమితుల చైర్మెన్లు మార్కెట్ యార్డులలోని వ్యాపారులతో ధరలపై సంప్రదింపులు చేసి అంగీకారం తెలిపిన తర్వాతనే మార్కెట్‌కు రైతులు సరుకును తీసుకెళ్లాలి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాలేదనుకుంటే రైతు సంఘమే పంటలను కొనుగోలు చేస్తుంది. దీనికోసం రాష్ట్ర రైతు సమాఖ్యకు ప్రభుత్వం మూలనిధిని కేటాయిస్తుంది. అలాగే ప్రభుత్వమే వారికి రుణం తీసుకోవడానికి హామీగా ఉంటుంది. దీని ఫలితం ఏమౌతుందంటే.. పంచాయతీరాజ్ చట్టంలోని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీచైర్మన్ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతాయి. తహసీల్దార్లు, ఆర్.ఐలు, వీఆర్వోలకు ఎలాంటి విలువ ఉండదు. ఎలాంటి నియంత్రణలేని ఒక ప్రైవేటు వ్యవస్థ గుప్పిట్లోకి గ్రామాలు వెళ్లిపోతాయి. గ్రామంలో భూ పంచాయితీలను ఈ కొత్త దొరలే తీరుస్తారు. వారు చెప్పిన ప్రకారంగానే రిజిస్టర్లు తయారవుతాయి. పట్టాదారు పాసు పుస్తకాలు జారీ అవుతాయి. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు వ్యవసాయశాఖ అధికారుల ప్రమేయం లేకుండా ఇవ్వడం వల్ల అవి కూడా దుర్వినియోగమయ్యే అవకాశం ఉంటుంది. సమితి సభ్యులు చెబితేనే బ్యాంకుల్లో ఖాతాలు, ప్రభుత్వం ఇచ్చే రూ.8 వేల సబ్సిడీ దక్కుతుంది. ఈ కారణంగా గ్రామంలోని రైతులంతా వారికి భయపడుతూ బాంచన్ దొర అంటూ బతకాల్సివస్తుంది. వారు ధృవీకరించిన తర్వాతనే భూములకు సంబంధించిన క్రయవిక్రయాలు జరగాలన్న నిబంధనల కారణంగా భారీ ఎత్తున కమీషన్ల రూపంలో అవినీతి జరిగే అవకాశం ఉంది. ఎలాంటి వివాదాలు లేకున్నా, తాము అడిగింది ఇవ్వకపోతే భూముల రిజిస్ట్రేషన్లను అడ్డుకొనే ఆస్కారం ఎక్కువగానే ఉంది. మార్కెట్ యార్డులకు సరుకు పంపించడానికి కూడా వారి అనుమతి అవసరం కావడం వల్ల వ్యాపారులతో కుమ్మక్కై రైతులను దోచుకునే అవకాశం ఉంది. వేల కోట్ల రూపాయాల నిధులు ఈ కొత్త వ్యవస్థ చేతిలో ఉన్న కారణంగా ఈ వ్యవస్థ అధికారిక వ్యవస్థకు సమాంతర వ్యవస్థగా తయారవుతుంది.

గత 30 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న వారి భూములు కూడా ప్రభుత్వ భూములగానే పరిగణించి, వాటిని కబ్జా చేయడానికి సిద్ధపడుతన్నారు అధికార పార్టీ నేతలు. ఈ కొత్త వ్యవస్థ అమలులోకి వచ్చి అధికారపక్షానికి చెందిన వారు గ్రామాలపై పెత్తనం చెలాయించడం మొదలుపెడితే ఇక అధికారపార్టీకి ఎదురు ఉండదు. 2018 ఏప్రిల్ మాసంలో రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలను కూడా నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాలను పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకోవడానికి ఈ కొత్త వ్యవస్థను ముఖ్యమంత్రి స్థానంలో ఉండి రూపొందిస్తున్నారు.

సెల్ : 9885333196

# కూతురు బాధ్యత ఎప్పటికీ తండ్రిదే



సిహెచ్.రమణకుమార్ రెడ్డి

బిడ్డల పెంపకంలో, పెండ్లీల విషయంలో తండ్రి తీసుకునే బాధ్యత, చేసే పనులు, ఆయన పడే తపన చాలా వరకు లోకానికి (బాహ్య ప్రపంచానికి) కనిపించదు. బిడ్డ పుట్టినప్పటి నుండి ఆ బిడ్డ జీవితంలో స్థిరపడే వరకు జరిగే ప్రతి చర్య, నడిచే ప్రతి అడుగు అన్నింట్లో అగుపించీ అగుపించకుండా ఉండే అదశ్య హస్తం నాన్న. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్ల తండ్రి బంధానికి, బాధ్యతకు మధ్య నలిగిపోతూ ఉంటాడని చెప్పవచ్చు. అయినా అదేంటో గానీ మన కంటికి నాన్న "కరకు మనిషి"గానే కనిపిస్తాడు. తుళ్లిపడే చిట్టి అడుగుల చిన్నారి పాపైనా, ఎగిసిపడే నవ యవ్వన యువతైనా, తండ్రికి బుడిబుడి నడకల బంగారుతల్లిలాగే అగుపిస్తుంది. అందుకే ఆ అడుగులు బడివైపు వేసినా, కాలేజీ వైపు వేసినా, ఉద్యోగం వైపు వేసినా పెండ్లి మండపం వైపు వేసినా ఆ అడుగులు ఎక్కడ తుళ్లిపడతాయోనని అనుక్షణం కాపలా ఉంటాడు నాన్న. బుడిబుడి అడుగుల పసిపాపకు వడివడిగా నడవొచ్చనే ధైర్యం నాన్న. పడిపోతానన్న భయమే లేని పసిపాపల మనోబలం నాన్న.

కూతురును బాగా చదివించాలనే తపన ఉన్నా చుట్టూ ఉన్న సమాజపు ఒత్తిడి, కూతురుకు గొప్ప చదువు చెప్పిస్తే అంతకన్నా గొప్ప అల్లుడిని తేవాలి (కొనాలి) అనే భయం, కూతురు వెళ్లిపోయేది, ఏనాటికైనా కొడుకే దిక్కు అని తరతరాలుగా మన నరనరాన జీర్ణించుకుపోయిన ఛాందస భావం. కూతురు చదువుకోసం, కట్నం కోసం రెండు విధాల ఖర్చు చేస్తే కొడుక్కేమివ్వలేనేమో అనే భయం, అన్నీ కలిపి నాన్న మస్తిష్కంలో కథాకళి ఆడుతుంటే విప్లవాత్మక నిర్ణయాలు నాటితరం నాన్న తీసుకోలేకపోయినా నేటితరం నాన్న కొంతమేర ధైర్యంగానే బిడ్డలకు అండగా నిలుస్తున్నాడు. అత్తారింటికి వెళ్లే పిల్ల అంటూ ఆడపిల్ల పుట్టినప్పటినుండే వస్తువులు, నగలు చేయించే అమ్మ వెనుకున్న మనోబలం నాన్న. కర్ణ వేదన, ముక్కుపుడక, చీరకట్టించడం అంటూ సాగిపోయే వేడుకల్లో ముందుండి నిలిచేది అమ్మే అయినా వెనుక నుండి నడిపేది నాన్నే కాదా. పెండ్లీడుకొచ్చిన బిడ్డలకు వరుడిని వెతకడం పేద, మధ్యతరగతి తండ్రులకు కత్తిమీద సాములాంటిదే.

ఆడపిల్లల పెండ్లి విషయంలో మగపిల్లల తల్లిదండ్రులు మొదట అమ్మాయి బాగుంటే చాలు మేమింకేం డిమాండ్ చేయం అంటూ సాగదీస్తారు, అమాయకపు ఆడపిల్లల తల్లిదండ్రులు తమ గారాల పట్టి మంచి ఇంటికి వెళ్లాలనే తపనతో సహజంగా పెండ్లిచూపుల ఏర్పాట్లు చేస్తారు. అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చుతారు, తీరా మాటా ముచ్చటకు వచ్చేప్పటికి అబ్బాయి తరుపు వారు ఒక్కొక్క కోరికల చిట్టా విప్పుతూ ఉంటారు. తెల్లమొహం వేయటం ఆడపిల్లల తల్లిదండ్రుల పని అవుతుంది. కన్నబిడ్డకు సంబంధం నచ్చింది, బిడ్డ చివరి కోరిక తీర్చాలనే తపనతో ఆ తండ్రి ఎన్నో విషయాల్లో రాజీ పడతాడు. తాను మోయలేని భారమని తెలిసినా తలవంచుతాడు. తల్లికి విషయం తెలిసినా బిడ్డమీద ప్రేమతో భర్తతో 'చూడయ్యా ఏదో ఒకటి చేయి' అంటూ ముందుకు తోస్తుంది. బిడ్డ కండ్లలో ఆనందం చూడాలనే తపనతో ఆ తండ్రి అనుభవించే సంఘర్షణ ఎవరికీ అర్థం కాదు. పదిరూపాయల పెన్నుకు కూడా బిల్లు తీసుకునే ఈ కాలంలో లక్షలు, కోట్లలో చెల్లించినా సరే కట్నానికి లెక్కా పత్రాలుండవు. బతుకంతా కష్టపడి, కోరికలను చంపుకుని సంపాదించిన సొమ్మును బిడ్డమీద మమకారంతో కట్నంగా ఇచ్చే కన్నతండ్రికి రశీదు కాదుకదా కనీసం గర్వంగా ఫొటో దిగే భాగ్యం కూడా ఉండదు. వకీలైనా, పోలీసైనా, పొలిటీషియనైనా అక్కడ అందరిదీ ఒక్కటే హోదా "ఆడపిల్ల తండ్రి".

పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్టు పెండ్లి కొడుక్కు ఇచ్చే కట్న కానుకలు ఒక ఎత్తైతే పెండ్లి చేయటం మరో ఎత్తు. అబ్బాయికి అందుబాటులో ఉన్న పట్నంలో విశాలమైన కల్యాణ మండపంలో పెండ్లిచేయాలి. అలక కట్నాలు, ఆడబిడ్డ కట్నాలు, అల్లుడికి బట్టలు ఇలా అంతూపొంతూ లేని కోర్కెలు. ఫలానా ఊరిలో అయితే మా బంధువులు రావడానికి అనుకూలంగా ఉంటుంది, కల్యాణ మండపంలో ఏసీ ఉండాలి, మండపం డెకరేషన్ సినిమా సెట్టింగును తలపించాలి. ఫొటో, వీడియో, నిశ్చితార్థం ఫంక్షన్లు, లంచ్ / డిన్నర్‌లో ఉండాల్సిన పదార్థాలతో కూడిన చాంతాడంత పట్టిక, బరువైన నగలు, విలువైన బట్టలు, అదిరిపోయే ఆర్కెస్ట్రాలు ఆ తరువాత డీజేలు.. చెప్పుకుంటూ పోతే అంతులేని కోర్కెల చిట్టాలకు బసవన్నలాగ తలూపడమే ఆడపిల్ల తండ్రి విధి. పెండ్లికూతురు మెడలో వేసుకునే బంగారు నగలు, పెండ్లిలో కట్టుకునే బట్టలు మొదలు అత్తింటికి తనతో తెచ్చుకునే ప్రతి వస్తువు మీదా పెత్తనం చూపే వారు అడుగడుగునా గండాలు/సుడిగుండాలు సష్టిస్తుంటే పెండ్లి చూపులు మొదలు ఆడపిల్ల పెండ్లయి అత్తవారింటికి వెళ్లే వరకు ఆ తండ్రికి కంటిమీద కునుకు ఎడారిలో ఒయాసిస్సే అవుతుంది.

సందిట్లో సడేమియా అంటూ చిన్నబిడ్డ పెండ్లి ఇంత ఘనంగా చేస్తున్నారు, నాకైతే ఏమీ పెట్టలేదని సాగదీసే పెద్ద అల్లుడు, ఉన్నదంతా బిడ్డకే ఇచ్చేస్తే మాకేం మిగులుతుందని గుర గురలాడే కోడలు, గుర్తింపుకోసం తగువులాడే అక్కాచెల్లెళ్లు(మేనత్తలు). ఒకవైపు ముద్దుల తల్లి పెండ్లవుతుందనే సంతోషం, మరోవైపు తలకుమించిన భారం. ఎటుపోయి ఎటు వెళ్తుందో అనే భయం ఆ తండ్రి కండ్లలో నిద్రను దోచేస్తుంది. తన బాధను భయాన్ని ఎవరితోనూ చివరికి భార్యతో కూడా పంచుకోలేని నిస్సహాయ స్థితి. అనవసరంగా వారి సంతోషాన్నెందుకు దూరం చేయాలనే ఆలోచన అంతా కలిసి ఆ తండ్రి మనసు మొద్దుబారిపోతుంది.

కన్నబిడ్డ అత్తారింటికి వెళ్లి "ఆడపిల్ల"గా మారినా తండ్రి భుజంమీది బాధ్యతల బరువు వేలాడుతూనే ఉంటుంది. మొదటి పండుగ, మొదటి కానుపు, బారసాల(నామకరణం), సారె పెట్టుపోతలు అంటూ బాధ్యతల సమాహారం సాగుతూనే ఉంటుంది. మెట్టినింట్లో అరిగిన "మట్టె"లకు కూడా ఆడపిల్ల పుట్టినింటివైపే చూస్తుంది. ఆటుపోట్లతో అనుక్షణం కదలాడే సముద్రం కూడా నాన్న ముందు దిగదుడుపే. అందుకేనేమో జన్మనిచ్చింది మొదలు జన్మంతా కంటికి రెప్పలా కాపుకాసే "నాన్న" కన్నబిడ్డలకు కరకుగానే కనిపిస్తాడు. ఆ కరుకుదనం వెనుకున్న అమత హృదయాన్ని చుసేవాళ్లెంతమంది? నాన్నను నాన్నలా గుర్తించే వారెందరు.

సెల్ : 9440449392

## ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

**మీ రచనలు పంపవలసిన చిరునామా :**

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

S & D

# నవచిత్రం

## నూతనోత్సాహంతో సందడికి రెడీ..

**గతేడాది విజయపరంపరను కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా నూతనోత్సాహంతో సందడి చేసేందుకు తెలుగు సినిమా సిద్ధమైంది. నవ్యపంథాను ఆకళింపు చేసుకుని సరికొత్త ఉత్తేజంతో 2018లోకి అడుగు పెడుతూనే తన ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేయబోతోంది. ఇందులో భాగంగా పలు వైవిధ్యమైన చిత్రాలను జనవరిలో విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసింది. అంతేకాదు సంక్రాంతి, రిపబ్లిక్ డే నేపథ్యాలను పురస్కరించుకుని పలు భారీ చిత్రాలను బరిలోకి దించుతోంది.**



అనుపమా పరమేశ్వరన్

చిత్ర పరిశ్రమకు సంక్రాంతి పెద్ద పండుగ. ఈ పండుగని పురస్కరించుకుని పలు సినిమాలు బరిలోకి దిగుతుంటాయి. గతేడాది 'ఖైదీ నెం150', 'గౌతమిపుత్ర శాతకర్ణి', 'శతమానంభవతి' చిత్రాలు విడుదలై ప్రేక్షకుల విశేష ఆదరణతో మంచి విజయాల్ని సొంతం చేసుకున్నాయి. అలాగే భారీ కలెక్షన్లనూ రాబట్టాయి. అదే బాటలో ఈ ఏడాది కూడా అగ్ర హీరోల చిత్రాలు బాక్సాఫీసు దగ్గర అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. పవన్‌కళ్యాణ్ నటించిన 'అజ్ఞాతవాసి' ఈనెల 10న విడుదలవుతోంటే, నందమూరి బాలకృష్ణ నటించిన 'జై సింహా' 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరి అగ్ర హీరోల చిత్రాలపై అభిమానుల్లోనే కాదు ప్రేక్షకుల్లో సైతం అమితాసక్తి నెలకొని ఉంది.

'జల్సా', 'అత్తారింటికి దారేది' వంటి బ్లాక్‌బస్టర్స్ తర్వాత పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'అజ్ఞాతవాసి'. ఇందులో పవన్ సరసన కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్లుగా నటిస్తుండగా హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చిన్నబాబు) నిర్మిస్తున్నారు. అనిరుథ్ సంగీతం సమకూర్చిన పాటలు ఇప్పటికే శ్రోతలను అలరిస్తున్నాయి. ఇందులో 'కొడకా కోటేశ్వరరావు..' అనే పాటను పవన్ పాటడం విశేషం. ఈ పాటను న్యూ ఇయర్ గిఫ్ట్‌గా ఆదివారం విడుదల చేశారు.

గతేడాది 'గౌతమిపుత్ర శాతకర్ణి'తో ఆకట్టుకున్న బాలకృష్ణ ఈ సంక్రాంతికి 'జై సింహా'తో రాబోతున్నారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'శ్రీరామరాజ్యం', 'సింహా' తర్వాత బాలకృష్ణ, నయనతార జంటగా నటించిన చిత్రమిది. నటాషా జోషి, హరిప్రియ ఇతర కథానాయికలుగా నటిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ చిత్రంలో చిన్న పాటి సందేశం కూడా ఉండబోతుందట. ఇదిలా ఉంటే, ఇదే సంక్రాంతి బరిలోకి ఈ నెల 12న సూర్య నటించిన అనువాద చిత్రం 'గ్యాంగ్' కూడా విడుదలకానుంది. సూర్య హీరోగా నటించిన ఈ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించారు. ఇందులో సూర్య సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటించగా, రమ్యకృష్ణ కీలక పాత్ర పోషించారు. వీటితోపాటు మరికొన్ని చిత్రాలను విడుదల చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

ఇక గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కూడా పలు భారీ బడ్జెట్ చిత్రాలు సందడి చేయబోతున్నాయి. ద్విభాషా చిత్రాలు 'రాజారథం', 'దండుపాళ్యం 3' రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 25న విడుదల కానున్నాయి. అలాగే ఈ నెల 26న 'భాగమతి', 'ఆచారి అమెరికా యాత్ర', 'బట్టర్ ఫ్లైస్', సందీప్ కిషన్ హీరోగా కృష్ణ తనయ మంజుల దర్శకురాలిగా మారి తెరకెక్కించిన 'మనసుకు నచ్చింది' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. విశాల్ నటించిన 'అభిమాన్యుడు' కూడా ఇదే రోజు విడుదలవుతోంది. 'శ్రీ చిలుకూరి బాలాజీ', 'సారథి', 'స్టూడెంట్ పవర్' 'హౌరాబ్రిడ్జ్', 'ఇగో', 'శరభ' సినిమాలు సైతం ఈ నెలలోనే విడుదలై సందడి చేయబోతున్నాయి. దాదాపు పదికి పైగా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్లు కొల్లగొట్టేందుకు సమాయత్తమవుతున్నాయి.


'అజ్ఞాతవాసి'లో పవన్‌కళ్యాణ్

# ఆస్కార్ బరిలో గెలుపెవరిది?

## షో

**అత్యంత ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డులపై ఈ ఏడాది ఆరంభం నుంచే అందరిలోనూ ఉత్సుకత పెరిగింది. 90వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) ప్రదానోత్సవం లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో మార్చి 4న అంగరంగ వైభవంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలువురు సినీ విశ్లేషకులు ఫలానా చిత్రానికి ఆస్కార్ గ్యారంటీ అంటూ జోస్యం చెబుతున్నారు. వారి జోస్యాన్ని నిజం చేసేందుకు ఉత్తమ చిత్ర విభాగంలో దాదాపు 14 చిత్రాలు ఆస్కార్ బరిలో అమీతుమీకి సిద్ధమవుతున్నాయి.**

### డన్‌కిర్క్

రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఫ్రెంచ్ పట్టణ డన్‌కిర్క్ సముద్ర తీరాన్ని జర్మన్ సైన్యం ఆక్రమిస్తుంది. వీరి నుంచి తప్పించుకోవడానికి బ్రిటీష్, దాని మిత్ర రాజ్యాల సైన్యం పోరాటం చేస్తారు. తొమ్మిది రోజులపాటు జరిగిన భీకరయుద్ధం అనంతరం యుద్ధం కంటే ప్రాణం ముఖ్యమని సముద్రం గుండా బ్రిటీష్ సైన్యం పారిపోవాల్సి వస్తుంది. యుద్ధం చేసినా చనిపోతారు, సముద్రంలోకి వెళ్ళిపోయినా చనిపోతారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బ్రిటీష్ సైన్యం ప్రాణాలతో బయటపడేందుకు చేసే సాహసోపేత పోరాటమే ఈ సినిమా. 1940లో చోటు చేసుకున్న యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ రూపొందించారు. ఆనాటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చూపించిందీ చిత్రం.










### ది పోస్ట్

వియత్నాం వార్ సమయంలో అమెరికా చేసిన కుట్రలకు సంబంధించిన 'పెంటగాన్ పేపర్స్'ను వాషింగ్టన్ పోస్ట్, ది న్యూయార్క్ టైమ్స్ పత్రికలు లీక్ చేశాయి. ఈ ఇతివృత్తాన్ని ప్రధానంగా తీసుకుని అమెరికా ప్రభుత్వానికి, మహిళా పత్రికాధినేతకు మధ్య జరిగిన పోరాటం నేపథ్యంలో 'ది పోస్ట్' చిత్రాన్ని తెరకెక్కించారు. స్టీవెన్ స్పీల్‌బర్గ్ ఈ చిత్రాన్ని రూపొందించారు.

### గెట్ అవుట్

ఆఫ్రికన్-అమెరికన్‌కు చెందిన నల్లజాతీయుడు క్రిస్. తెల్లజాతీయురాలైనా రోజ్‌ను ప్రేమిస్తాడు. తన ప్రేమ గురించి మాట్లాడేందుకు ప్రియురాలి ఇంటికి వెళతాడు. అక్కడ రోజ్ తల్లిదండ్రులు తప్ప మిగతా పనివాళ్ళంతా నల్లజాతీయులే. ఈ క్రమంలో క్రిస్‌ను చంపేందుకు, అక్కడి నుంచి పంపించేందుకు అక్కడి వారంతా ప్రయత్నాలు చేస్తుంటారు. మరి వాళ్ళు అలా చేయడానికి కారణమేంటనేది సినిమా. జోర్డన్ పీలె దర్శకత్వంలో హర్రర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన సినిమా ఇది.

### ఫాంటమ్ థ్రెడ్

ఉడ్‌కాక్ గొప్ప ఫ్యాషన్ డిజైనర్. హీరోలకు, సంపన్న వర్గాల పిల్లలకు, సామాజిక కార్యకర్తలకు, రాజకీయ నాయకులకు వివిధ రకాల డిజైనింగ్ డ్రెస్సులను తయారు చేస్తూ బాగా పాపులర్ అవుతాడు. అతని ఉన్నతికి సోదరి కిరిల్ సహకారం చాలా ఉంటుంది. రాయల్‌గా సాగుతున్న ఉడ్‌కాక్ జీవితంలోకి ఓ అమ్మాయి వస్తుంది. ఆమె ప్రేమలో పడతాడు. ఆ తర్వాత ఉడ్‌కాక్ అన్నింటిని కోల్పోయి బికారిగా, సాధారణ స్థాయికి చేరుకోవడం, అనంతరం చోటు చేసుకున్న సంఘటనల సమాహారమే ఈ చిత్రం. పాల్ థామస్ అండర్సన్ దర్శకత్వంలో పీరియడ్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కింది.

### కాల్ మి బై యువర్ నేమ్

1983 ఇటలీలో జరిగే కథ ఇది. 17ఏండ్ల టీనేజ్ కుర్రాడు ఎలియో వేసవి సెలవుల్లో తన ఫ్యామిలీతో సరదాగా గడుపుతుంటాడు. ఈ క్రమంలో తన తండ్రి ఓలివర్, ప్రియురాలు మార్జియాతోపాటు మరో స్నేహితుడితో అతని అనుబంధం ఎలా సాగిందనేది సినిమా. పాపులర్ నవల 'కాల్ మి బై యువర్ నేమ్' ఆధారంగా ఈ రొమాంటిక్ కమింగ్ ఏజ్ డ్రామా చిత్రాన్ని రూపొందించారు. టీనేజ్ కుర్రాడిలోని మానసిక సంఘర్షణను, కోరికలను, ఆలోచనలను ప్రతిబింబించే ఈ సినిమాను ల్యూకా గాడనినో రూపొందించారు.

### లేడీ బర్డ్

17ఏండ్ల టీనేజ్ అమ్మాయి లేడీ బర్డ్‌కు, తన తల్లికి మధ్య ఉన్న అనుబంధాన్ని తెలిపే చిత్రమిది. హైస్కూల్ సీనియర్ టీనేజ్ గర్ల్ ఓ స్కూల్‌లో జాయిన్ అవుతుంది. ఆ తర్వాత తనలో వచ్చిన మార్పేంటి?, మానసికంగా, శారీరకంగా, కుటుంబ పరంగా, స్నేహితుల పరంగా తన ప్రవర్తన ఎలా ఉందనేది చిత్ర కథాంశం. ఈ కమింగ్ ఏజ్ కామెడీ డ్రామా చిత్రాన్ని గ్రెటా గెర్విగ్ రూపొందించారు.

### మడ్ బాండ్

రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఇద్దరు సైనికులు(ఒకరు వైట్, మరొకరు బ్లాక్) తిరిగి ఇంటికి బయలు దేరి వస్తుంటారు. ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న జాత్యాంకారాన్ని, వేధింపులను తెలియజేసే చిత్రమిది. ఈ అమెరికన్ పీరియడ్ డ్రామా చిత్రాన్ని డీ రీస్ రూపొందించారు.

### థ్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్ మిస్సోరీ

ఇదొక డార్క్ కామిక్ డ్రామా చిత్రం. కూతురు హత్యకు సంబంధించిన హంతకులను కనిపెట్టడం కోసం ఓ తల్లి పడే వేదన, సంఘర్షణ, తిరుగుబాటును తెలిపే చిత్రం. తన కూతురు హత్యకు గల కారకులను కనిపెట్టాలని తల్లి మిల్డర్డ్ హయాస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తుంది. ఎన్ని రోజులైనా ఆ కేసులో ఎలాంటి పురోగతి లేకుండాపోతుంది. విసిగిపోయిన ఆ తల్లి పోలీసులకు వ్యతిరేకంగా మూడు వివాదాస్పద పెయింటింగ్ బోర్డులను పెడుతుంది. పోలీసులు ఆమెపై కోపగించుకుంటారు. అంతేకాదు ఆమెతో తరచూ గొడవకు దిగుతుంటారు. దీంతో పోలీసులను ఎదుర్కొంటూ, తన కూతురిని హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు తల్లి చేసే సాహసం నేపథ్యంలో మార్టిన్ మెక్‌డోనాగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.



### ది ఫ్లోరిడా ప్రాజెక్ట్

కూతురు మూనీతో కలిసి తల్లి హాల్లే ఫ్లోరిడాలోని తక్కువ బడ్జెట్ హోటల్‌లో నివసిస్తుంటుంది. హాల్లే చాలా కోపిష్టి. రెబల్ కూడా. అయినప్పటికీ సంక్షేమ పథకాలతో మనుగడ సాధిస్తుంటుంది. ఈ క్రమంలో హాల్లే, మూనీ మధ్య అనుబంధం ఎలా సాగింది?, వీరికి హోటల్ మేనేజర్ ఏ విధంగా సహాయపడ్డాడు?, తోటి పిల్లలతో మూనీ చేసే అల్లరి ఏంటనేది సినిమా. ఈ డ్రామా చిత్రాన్ని సీయాన్ బేకర్ రూపొందించారు.

### ది షేప్ ఆఫ్ వాటర్

1962లో అమెరికాలోని కోల్డ్‌వార్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది. అత్యంత కట్టుదిట్టమైన సెక్యూరిటీ ఉన్న బయోలాజికల్ ల్యాబ్‌లో ఎలిసా అనే మూగ మహిళ పనిచేస్తుంటుంది. ఆ ల్యాబ్‌లో ఆంఫీబియన్ (కప్ప తరగతికి చెందిన ఓ రకమైన జీవం)పై ప్రయోగాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఓ కొత్త రకమైన జీవిని తయారు చేస్తారు. ఆ జీవి ఎలిసాకు బాగా కనెక్ట్ అవుతుంది. దానితో అనుబంధం ఏర్పర్చుకుంటుంది. దీంతో అనంతరం చోటు చేసుకున్న భయానక, ఆసక్తికర సన్నివేశాల సమాహారమే ఈ చిత్ర కథాంశం. ఈ ఫాంటసీ డ్రామా చిత్రాన్ని దర్శకులు గుల్లెర్మో డెల్ టోరో తెరకెక్కించారు.

### డార్కెస్ట్ హవర్


రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు రోజుల్లో జరిగిన ఇతివృత్తంతో రూపొందించిన చిత్రమిది. విన్‌స్టన్ చర్చిల్ బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన కొద్ది రోజులకే నాజీ జర్మన్ నుంచి అడ్డంకులు ఎదురవుతుంటాయి. రెండు దేశాల మధ్య అనిశ్చితి చోటు చేసుకుంటుంది. శాంతి భద్రతలు అదుపు తప్పుతున్న సమయంలో బ్రిటన్ ప్రధాని ముందు రెండే ఆప్షన్లుంటాయి. ఒకటి శాంతి కోసం జర్మన్‌తో రాజీ కుదుర్చుకోవడం, లేదంటే దానికి వ్యతిరేకంగా యుద్ధంలోకి దిగడం. ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు?, దీని కారణంగా అతనిలో, ప్రభుత్వంలో జరిగిన సంఘర్షణ ఏంటనేది ఈ చిత్ర కథాంశం. ఈ బయోగ్రాఫికల్ వార్ డ్రామా చిత్రానికి జోయి రైట్ దర్శకత్వం వహించారు.

### ది బిగ్ సిక్

పాకిస్థాన్‌కు చెందిన హాస్యనటుడు కుమైల్ నాంజియాని, గ్రేడ్ స్టూడెంట్ ఎమిలీ గార్డనర్ ప్రేమలో పడతారు. వారి సంస్కృతులు భిన్నమైనవి. దీంతో వీరి కుటుంబాల్లో కల్చర్‌కు సంబంధించి ఘర్షణ ఏర్పడుతుంది. ఆ టైమ్‌లో ఎమిలీ అనారోగ్యానికి గురవుతుంది. దీంతో ఫ్యామిలీ స్ట్రగుల్స్‌ను ఎదుర్కొని, తన ప్రేమను గెలుచుకోవడానికి కుమైల్ ఏం చేశాడనేది సినిమా. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని మైఖేల్ షోవాల్టర్ రూపొందించారు.

### వండర్ ఉమెన్

ప్రిన్సెస్ డయానా అమోజాన్ రాజ్యానికి యువరాణి. ఒళ్లు గగుర్పొడిచే యుద్ధ విద్యలు నేర్చుకుంటుంది. ఓ విమానం కూలిపోయినప్పుడు వేరే ప్రపంచ వల్ల తమ రాజ్యానికి ప్రమాదం పొంచి ఉందని తెలుసుకుంటుంది. దీంతో అక్కడికి వెళ్ళి మనుషుల ప్రపంచంతో యుద్ధం చేస్తుంది. ఈ క్రమంలో తనలో దాగి ఉన్న అద్భుతమైన శక్తులను పొందగలుగుతుంది. ఆ తర్వాత తన అసలైన విధి ఏంటనేది తెలుసుకోవడమే ఈ చిత్ర కథాంశం. ఈ అమెరికన్ సూపర్ హీరో చిత్రాన్ని దర్శకుడు ప్యాట్టీ జెంకిన్స్ తెరకెక్కించారు.










### స్టార్ వార్స్: ది లాస్ట్ జెడీ

అంతరిక్షంలో ఉన్న గ్రహాలపై ఆధిపత్యం కోసం రెండు వర్గాల మధ్య సాగే యుద్ధం నేపథ్యంలో 'స్టార్ వార్స్' సిరీస్ చిత్రాలు రూపొందుతున్న విషయం విదితమే. తాజాగా జెడీ అనే కల్పిత ప్రపంచంపై ఆధిపత్యం కోసం సూపర్ మ్యాన్ శక్తులు, సాంకేతిక పరమైన శక్తిని కలిగిన వర్గాల మధ్య పోరాటాన్ని ఈ చిత్రం ప్రతిబింబిస్తుంది. 'స్టార్ వార్స్' సిరీస్‌లో భాగంగా స్టార్ వార్స్ సీక్వెల్ ట్రయాలజీలో విడుదలైన రెండవ చిత్రమిది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. రియాన్ జాన్సన్ ఈ యాక్షన్ అడ్వెంచర్ డ్రామా చిత్రానికి దర్శకత్వం వహించారు.
























# రూటు మారిన చదువులు

## యూఎస్ కాదు..కెనడా వైపు చూపు

న్యూఢిల్లీ: అమెరికాలో వర్క్‌పర్మిట్ వీసాలతో పాటు విదేశీ విద్యార్థులపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ట్రంప్ విధానాలతో భారతీయ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూటపూటకో కొత్త నిబంధన ప్రవేశపెడుతున్న తీరుతో.. అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులను, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి ముఖ్యకారణం.. అమెరికా ఉద్యోగాల్లో స్థానిక యువతకే తొలి ప్రాధాన్యం...నైపుణ్యమున్న విదేశీయుల సేవలను మాత్రమే వినియోగించుకుంటాం...అంటూ ఊదరగొడుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే బదులు కెనడాకు వెళ్లడమే సముచితమని భారతీయ విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని న్యూఢిల్లీలోని కెనడా హై కమిషన్, యూఎస్ ఎంబసీ లు ధ్రువీకరించాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం చేసినప్పటి నుంచి యూఎస్‌కు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని న్యూయార్క్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (ఐఐఈ ) సంస్థ పేర్కొన్నది. ఆ సంస్థ వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం...2015-16లో ఎఫ్-1 వీసాల కోసం 62,537 మంది దరఖాస్తు చేసుకోగా, 2016-17లో కేవలం 52,281 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అమెరికాలో చదువుకునేందుకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతున్నది. అయితే, కెనడాలో ఉన్నత చదువు కోసం 2015లో 39,525 మంది, 2016లో 39,790 మంది, 2017 ( (అక్టోబర్ నాటికి ) 41,805 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత విద్య కోసం కెనడాకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య మూడేండ్ల నుంచి క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్నది. కెనడాలో ఉన్నత విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు, త్వరితగతిన అర్హులకు వీసాలు మంజూరు కావడమే ఇందుకు ప్రధాన కారణం. 2016-17లో అమెరికాలో చదువుకునేందుకు 1,86,267 మంది భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, వారిలో దాదాపు లక్ష మంది దరఖాస్తు చేసుకున్న తర్వాత నిర్ణయాన్ని మార్చుకున్నారు. అమెరికా ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ట్రంప్ విధానాలతో భారతీయ విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొనడమే ప్రధాన కారణం. ఇపుడు చాలా మంది కెనడాలో ఉన్నత విద్య పూర్తి చేయాలని దరఖాస్తు చేసుకొని వెళ్లారు. 2016లో స్టడీ పర్మిట్ వీసాలపై 52,870 మంది భారతీయ విద్యార్థులు కెనడాకు వెళ్లారు. 2017లో 54,425 మంది వెళ్లారు. కెనడాకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతున్నది. అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ విధానం (ఓపీటీ ) ప్రకారం యూఎస్‌లోనే ఉండిపోతున్నారు. ట్రంప్ సర్కార్ తాజాగా తీసుకొచ్చిన హెచ్-1బీ వీసా నిబంధనల కారణంగా ఓపీటీ ద్వారా అమెరికాలో ఉంటున్న భారతీయ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఉండగా, నైపుణ్యమున్న భారతీయ విద్యార్థులకు కెనడా స్వర్గధామంగా మారింది. స్టెమ్ ( సైన్స్, టెక్, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ ) విధానం ద్వారా నైపుణ్యమున్న భారతీయ విద్యార్థులకు కెనడాలో మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి. కెనడాలో స్థిరపడిపోవాలనుకునే భారతీయ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు శాశ్వత పౌరసత్వం కల్పిస్తున్నది. 2015లో 1,170 మంది, 2016లో 2,360 మంది, 2017లో 7,120 మందికి కెనడా పర్మినెంట్ రెసిడెన్స్ స్టేటస్ లభించింది. ట్రంప్ విధానాలతో విసిగిపోయిన భారతీయ విద్యార్థులు కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు చేయాలని భావిస్తున్నారు.

## మ'రుణ' విషాదం

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోయి దిగుబడి సరిగా రాలేదు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక భార్యాభర్తలిద్దరూ పురుగులమందు తాగారు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి విజయ మృతిచెందింది. బాపులాల్ విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. వారికి ఇద్దరు ఐదేండ్ల పిల్లలున్నారు. మృతురాలి తండ్రి సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## సర్కారు నిర్లక్ష్యం వల్లే ఆత్మహత్యలు : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పట్ల కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) విమర్శించింది. ఈ మేరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం విప్లవకుమార్, ఎ విజయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మోడెం శ్రీనివాస్‌రెడ్డి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఉద్యోగాలు భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. కొట్లాడి సాధించిన తెలంగాణలో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే సీఎం కేసీఆర్ కనీసం స్పందించకపోవడం దారుణమని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ప్రతిభ ఉంటే కాదు..పైసలిస్తేనే

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

2017-18 విద్యాసంవత్సరంలో జరిగిన కాళోజి నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కాలేజీల్లో కలిపి 2000 వరకు సీట్లున్నాయి. వీటిలో వివిధ రిజర్వేషన్లలో భాగంగా స్పోర్ట్స్ కోటాకు 0.5శాతం కింద 10సీట్లు కేటాయించారు. వీటిని జీవోనెంబర్ 10ఆధారంగా ప్రాధాన్యత ఇస్తారు. వీటి ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. ప్రస్తుతం ఒక్కో మెడిసిన్ సీటు ప్రయివేటు కాలేజీల్లో బీ కేటగిరిలో రూ.55 లక్షల నుంచి రూ.65లక్షలు ఉండగా, సీ కేటగిరి (ఎన్ఆర్ఐ) రూ.1.15కోట్లు పలుకుతున్నది. అదే స్పోర్ట్స్ కేటగిరిలో సర్కారీ కాలేజీల్లో ఏడాదికి రూ.పదివేలు, ప్రయివేటు కాలేజీల్లో రూ.60వేలు ఉంది. స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లత పరిశీలన కోసం 8మంది డిప్యూటీ డైరెక్టర్ల స్థాయి ఉన్న అధికారులతో ఒక కమిటీ ఉంటుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు ఈ కమిటీలో చోటు కల్పించవద్దు. కానీ ఈ విద్యాసంవత్సరం వేసిన కమిటీలో మాత్రం ఒకరిద్దరు అధికారులకు స్థానం కల్పించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై విజిలెన్స్ విచారణ చేయిస్తున్నట్టు తెలుస్తోంది.

**అంతర్జాతీయస్థాయిలో ఆడినా సీట్లు రాలే..**

హైదరాబాద్ నగరానికి చెందిన భరత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్షితారాజ్ అనే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు. రూలర్ స్కేటింగ్ హాకీలో రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయిలో అనేక పతకాలను సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్నారు. వీరిద్దరూ 2017లో మెడికల్ సీట్ల కోసం స్పోర్ట్స్ కోటాలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ అధికారులు వీరిద్దరికీ ప్రాధాన్యత ఇవ్వకుండా సర్టిఫికెట్లు చెత్తబుట్టలో పడేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఫెడరేషన్ ఇచ్చిన సర్టిఫికెట్లనూ పట్టించుకోలేదు. దీనంతటికీ కారణం వారిద్దరూ అధికారులకు డబ్బుల రూపంలో మాముళ్లు (లంచం) ఇవ్వకపోవడమే. దరఖాస్తు పరిశీలన చేసిన అధికారుల్లో ఒకరిద్దరికి కొన్ని డబ్బులు ఇచ్చినా..ఇంకా పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్టు స్పష్టంగా తెలుస్తోంది. వారు మాట్లాడిన ఆడియో రికార్డులు బహిర్గతం చేస్తున్నాయి.

2008 నుంచి 2016 వరకు అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులకు నిబంధనల ప్రకారం ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో ఆయా క్రీడలో పాల్గొన్న వారికి ఆయా క్రీడావిభాగాల ఫెడరేషన్స్ సర్టిఫైడ్ చేస్తే దాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో ఈ మధ్యకాలంలో ఐదుగురు విద్యార్థులకు మెడిసిన్‌లో, ఇద్దరు విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో సీట్లు కేటాయించారు. చిత్రంగా వీరిందరినీ ధృవీకరించిందీ ప్రస్తుతమున్న అధికారుల్లోనూ ఉన్నారు. కానీ ఈ విద్యాసంవత్సరం మాత్రం అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులుగా ఉన్న ఇద్దరు విద్యార్థులను మాత్రం పక్కన పెట్టారు. వీరికి ఫెడరేషన్‌తో పాటు శాయ్ సర్టిఫికెట్లు ఉన్నా పరిగణనలోకి తీసుకోలేదు.

**పాల్గొంటే..పతకం వచ్చినట్టు రికార్డు..**

ఆటల్లో పాల్గొన్న వారికి, ఆయా స్థాయిలను బట్టి పాల్గొనట్టు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను క్రీడాకారులకు అందిస్తాయి. కానీ కొందరు డబ్బులిచ్చి వాటిని కొనుగోలు చేసినట్టు ఆరోపణలూ ఉన్నాయి. అయితే ఈ విద్యాసంవత్సరం ఆంధ్రప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని రూలర్ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీలో జాతీయస్థాయిలో 2017లో పాల్గొన్నది. జాతీయస్థాయిలో పతకం రాలేదు. కానీ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(సాట్స్) అధికారులు ఆమెకు పతకం వచ్చినట్టు రికార్డుల్లో రాసేశారు. దీంతో ఆమెకు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కాలేజీలో ఓపెన్ స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. అయితే ఇదే విద్యార్థిని ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ హెల్త్‌యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు కోసం దరఖాస్తు చేసుకుంటే, అక్కడ మాత్రం కేవలం ఆ విద్యార్థిని కేవలం పోటీల్లో మాత్రమే పాల్గొన్నట్టు అక్కడ అధికారులు ధృవీకరించారు. ఈ సీటు విషయంలో సాట్స్ అధికారులకు భారీగా డబ్బులు ముట్టినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

కమిటీలోని ఇద్దరు సీనియర్ అధికారులకు కార్లు కొనివ్వగా, మిగిలిన వారికి రూ.రెండు, మూడు లక్షల చొప్పున అందజేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్రీడాకోట సీట్లపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## భ్రష్టుపట్టిన రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చింది. డబ్బు, అధికారం, పేరు ప్రతిష్టల కోసం రాజకీయాల్లోకి రావడం లేదని ఆయన తేల్చి చెప్పారు. కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన రజనీకాంత్ అంటే రాష్ట్ర జనంలో ఇప్పటికే మంచి అభిప్రాయమున్నది. 2016లో జరిగిన ఎన్నికల్లో అన్నా డీఎంకే పార్టీ ఘన విజయం సాధించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జయలలిత.. అనారోగ్యంతో కొంతకాలానికే కన్నుమూశారు. దీంతో అన్నాడీఎంకేలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం పళనిస్వామి ప్రభుత్వం కొనసాగుతున్న ప్పటికీ ఇటీవల జరిగిన ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ ఘోరంగా ఓడిపోయింది. అంతేకాక.. తమిళనాడులో ప్రభుత్వం త్వరలోనే కూలిపోవడం ఖాయమని స్వతంత్ర అభ్యర్థిగా భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన టిటివి దినకరన్ చేసిన ప్రకటన కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నది. అయితే.. అసెంబ్లీ ఎన్నికలు మళ్లీ 2021లో జరిగే అవకాశమున్నది. దీనికి దాదాపు మూడేండ్ల సమయం ఉన్న నేపథ్యంలో రజనీకాంత్ పార్టీ స్థాపించి బలోపేతం కావొచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. తమిళనాడులో ఇప్పటికే రాజకీయ అనిశ్చితి నెలకొని ఉన్నది.

**రజనీతో బిజెపి పొత్తు పెట్టుకుంటే రాష్ట్రం వదిలి వెళ్తా : సుబ్రహ్మణ్య స్వామి**

రజనీ కాంత్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటే తానీ రాష్ట్రం వదిలి మరో రాష్ట్రం వెళ్ళిపోతానని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి అన్నారు. రాజకీయాల్లోకి వస్తానని, పార్టీ పెడతానని రజనీకాంత్ చేసిన ప్రకటనపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

## దళిత క్రిస్టియన్లకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట్

నవతెలంగాణ-వరంగల్

దళిత క్రిస్టియన్లకు ఎస్సీ సర్టిఫికెట్లను ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశలో ఆయన మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లపై ప్రభుత్వానికి ప్రేమ వుంటే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి వారికి ఎస్సీ హోదా ఇవ్వాలని తీర్మానించి కేంద్రానికి పంపాలన్నారు. అధికార కాంక్షతో రాష్ట్ర ప్రయోజనాలను టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి తాకట్టుపెడుతోందన్నారు.



## నేటి నుంచి వ్యవసాయానికి 24గంటల కరెంట్

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తు హెచ్చరికలు చేసింది. టీఎస్‌ట్రాన్స్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్‌లు 24గంటల విద్యుత్ సరఫరా కోసం దాదాపు రూ. 12,610 కోట్ల వ్యయంతో కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న విద్యుత్ సరిపోకుంటే, బహిరంగ మార్కెట్లో అప్పటికప్పుడు విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు కూడా విద్యుత్ సంస్థలు ఏర్పాట్లు చేసుకున్నాయి. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా వల్ల రాష్ట్రంలో డిమాండ్ వచ్చే మార్చి నాటికి 11వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. ప్రస్తుత డిమాండ్ 9,500 మెగావాట్లుగా ఉంది. డిమాండుకు తగినట్టు విద్యుత్‌ను అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకర రావు తెలిపారు. ఇప్పటికే అన్ని రకాల ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం అయ్యాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కోసం రైతాంగం పడిన వెతలు గుర్తున్నాయని, ఇకపై ఆ కష్టాలు ఉండబోవని స్పష్టం చేశారు. 24గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరా ప్రారంభ కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్స్) జి శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ (ఆపరేషన్స్) స్వామిరెడ్డి, డీఈ రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముష్కరదాడి

(మొదటిపేజీ తరువాయి)

వివరాల ప్రకారం.. జిల్లాలోని లాథ్‌పొరాలో ఉన్న సీఆర్‌పీఎఫ్ 185 బెటాలియన్‌లో మూడు బ్లాకులున్నాయి. కాగా.. ఈ శిబిరంపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత(2 గంటలకు) ముష్కరులు దాడికి తెగబడ్డారు. గ్రెనేడ్‌లు విసురుతూ ఆస్పత్రి, కంట్రోల్ రూం ఉన్న బ్లాక్ 3లోకి ప్రవేశించారు. వచ్చిరాగానే కాల్పులకు తెగబడ్డారు. బలగాలు అప్రమత్తం కావడంతో ఇరు వర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్ దాదాపు 12 గంటల పాటు కొనసాగినట్టు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. ఘటనలో ఐదుగురు జవాన్లు చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఇద్దరు ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది.ఒకవేళ సైనికాధికారుల కుటుంబీకులు నివాసముంటున్న బ్లాక్ 1లోకి ఉగ్రవాదులు ప్రవేశించి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనను జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్రంగా ఖండించారు. ఉగ్ర దాడిని పిరికిపందల చర్యగా ఆమె అభివర్ణించారు.

## విద్యుత్ ప్రమాద మృతుల ఎక్స్‌గ్రేషియా పెంపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంపుదల చేస్తూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) ఉత్తర్వులు జారీ చేసింది. డిపార్ట్‌మెంట్‌కు చెందని సాధారణ వ్యక్తులు విద్యుత్ ప్రమాదాల్లో మరణిస్తే ఇప్పటి వరకు రూ.4లక్షల నష్టపరిహారాన్ని చెల్లించేవారు. 2018 జనవరి 1 నుంచి ఈ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు టీఎస్ఈఆర్సీ పేర్కొంది. విద్యుత్ ప్రమాదంలో మరణించే గేదెలు, ఆవులు, దున్నపోతులు వంటి పశువులకు గతంలో మాదిరే రూ. 40వేలు, గొర్రెలు, మేకలకు రూ.7వేలు చొప్పున నష్టపరిహారాన్ని చెల్లిస్తారు. వివిధ ప్రజా, రైతు, వినియోగదారుల సంఘాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీఎస్ఈఆర్సీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



## రాష్ట్ర ప్రజలకు సీఎం,గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్రాభివద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలన్నీ 2018 సంవత్సరంలో కూడా విజయవంతంగా ముందుకు సాగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

S & D

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲208 | 34,056 | |
| నిఫ్టీ ▲52 | 10,530 | |
| డాలరుకు రూపాయి విలువ | 63.87 | |
| బంగారం(10.గ్రా) | రూ. 29,925 | |
| వెండి (కేజీ) | రూ. 41,000 | |





| కోడిగుడ్లు | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 368 | విజయవాడ | 374 |
| ఒక్కగుడ్డుకు | 4.30 | చెన్నై | 397 |
| వరంగల్ | 370 | ముంబయి | 410 |



## స్మార్ట్‌ఫోన్లపై ఫ్లిప్‌కార్ట్ భారీ ఆఫర్లు!




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ కొత్త ఏడాదిలో వినియోగదారుల కోసం సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. 'మొబైల్ బొనాంజా' పేరిట పలు కంపెనీలకు చెందిన మొబైల్ ఫోన్లపై భారీ ఆఫర్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ నెల జనవరి 3 నుంచి 5 వరకు వివిధ రకాల స్మార్ట్‌ఫోన్లపై భారీ డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా రూ.149కే బైబ్యాక్ గ్యారంటీ ఆఫర్, నోకాస్ట్ ఈఎంఐ ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశంలో ప్రస్తుతం అధికంగా డిమాండ్ కలిగిన స్మార్ట్‌ఫోన్లలో రెడ్‌మి నోట్ 4 ముందంజలో ఉంది. 4జీబీ ర్యామ్‌తో లభించే ఈ ఫోన్ ధర రూ. 12,999 ఉండగా.. రూ. 10,999కి లభించనుంది. ఇదే వరుసలో రూ. 14,999 విలువ చేసే షియోమీ మి ఏ1 రూ. 12,999కి లభించనుంది. గూగుల్ పిక్సెల్2, మోటో జీ5 ప్లస్, మోటో సీ, మోటో సీ ప్లస్, లెనోవా కె5 నోట్, శాంసంగ్ గెలాక్సీ ఎస్7, గెలాక్సీ ఆన్5, జే3పై స్మార్ట్‌ఫోన్లపై ఫ్లిప్‌కార్ట్ భారీ డిస్కౌంట్లు అందించనుంది.

## అయిదు టెలికాం సంస్థలకు నోటీసులు!

**న్యూఢిల్లీ:** టాటా టెలీసర్వీసెస్, టెలినార్, రిలయన్స్ జియోలతో సహా అయిదు టెలికాం ఆపరేటర్లకు ఈ నెలలో నోటీసులు జారీ చేయనున్నట్లు డిపార్టుమెంట్ ఆఫ్ టెలికాం (డీవోటీ) వెల్లడించింది. తద్వారా రూ.2,578 కోట్లు రికవరీ చేయనుంది. ఈ టెలికాం ఆపరేటర్ల నుంచి రెవెన్యూలు తక్కువగా ఉన్నాయన్న కాగ్ హెచ్చరికల నేపథ్యంలో డీవోటీ ఈ చర్యలకు సిద్ధమయ్యింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) డిసెంబర్ 19న పార్లమెంటుకు సమర్పించిన నివేదిక ప్రకారం, టాటా టెలీసర్వీసెస్, టెలినార్, వీడియోకాన్ టెలికాం, క్వాడ్రంట్ (వీడియోకాన్ గ్రూప్ అనుబంధ సంస్థ) రిలయన్స్ జియో సంస్థలు తమ రెవెన్యూలను రూ.14,800 కోట్లుగా చూపించినట్టు వివరించింది. దీని ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.2,758 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపింది. దీంట్లో లైసెన్స్ ఫీజులో రూపంలో రూ.1,015.17 కోట్లు, స్పెక్ట్రమ్ వాడకంలో రూ.511.53 కోట్లు తక్కువగా చెల్లించగా, దీనికితోడు చెల్లింపులో జాప్యంపై వర్తించే వడ్డీకి రూ.1,052.13 తక్కువగా ఉన్నట్టు కాగ్ తన నివేదికలో పేర్కొంది.

# శీతాకాల సమావేశాలపై మార్కెట్ల దృష్టి!

### గణాంకాలు, అంతర్జాతీయ సంకేతాలు కీలకమే



**నవతెలంగాణ, బిజినెస్ డెస్క్:** ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లకు పలు అంశాలు కీలకంగా మారనున్నాయి. ఇందులో ప్రధానంగా పార్లమెంటు శీతాకాల సమావేశాలపైనే స్టాక్ మార్కెట్లు దృష్టిసారించనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీనికితోడు సూక్ష్మ గణాంకాలు, అంతర్జాతీయ సంకేతాలు కూడా మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయని వారంటున్నారు. వీటితో పాటు దేశీ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు సరళి, ప్రపంచ మార్కెట్ల పోకడ, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల గమనం, డాలర్‌తో రూపాయి మారకం కదలికల వంటి తదితర అంశాల ప్రభావం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లపై ఉంటుందని చెబుతున్నారు. గడిచిన వారంలో స్టాక్ మార్కెట్లు మంచి లాభాలతో ముగిశాయి. జనవరి డెరివేటివ్ సిరీస్ గడువు ముగిసే రోజు అయినప్పటికీ వారం చివరిలో ప్రధాన సూచీలు పుంజుకోవడం, ఇంట్రాడేలో కొత్త రికార్డులను నమోదు చేశాయి. మరోవైపు అంతర్జాతీయంగా ప్రతికూల అంశాలు నెలకొన్నప్పటికీ బీఎస్ఈ సెన్సెక్స్ 209 పాయింట్లు ఎగిసి 34,057 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 53 పెరిగి 10,531 వద్ద స్థిరపడింది. బీఎస్ఈలో రంగాల వారిగా రియాల్టీ, లోహ, ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో నూతన సంవత్సరంలో స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులను నమోదు చేయవచ్చునని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**వెలుగులోకి ఆటో రంగ షేర్లు**

డిసెంబర్ నెల వాహన విక్రయాలను సోమవారం (జనవరి 1న) వెల్లడించనున్న నేపథ్యంలో వాహన కంపెనీల షేర్లపై ఇన్వెస్టర్లు దృష్టి పెడతారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఆటో రంగ కౌంటర్లు యాక్టివ్‌గా ట్రేడయ్యే అవకాశముందని వారంటున్నారు.

**తయారీ గణాంకాలు**

డిసెంబర్ నెలకు చెందిన భారత తయారీ రంగ గణాంకాలను మార్కిట్ ఎకనామిక్స్ మంగళవారం (జనవరి 2న) వెలువరించనుంది. నిక్కి ఇండియా పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ప్రకారం, అక్టోబర్‌లో 50.3 వద్ద ఉన్న ఈ సూచీ, నవంబర్‌లో 52.6కి పెరిగింది. అదేవిధంగా దేశీయ సేవల రంగం గణాంకాలను గురువారం (జనవరి 4న) విడుదల చేయనుంది. నిక్కి ఇండియా పీఎంఐ ప్రకారం, నవంబర్‌లో నెలలో ఈ సూచీ పడిపోయింది. అక్టోబర్‌లో 51.7 వద్ద ఉన్న ఈ సూచీ, నవంబర్‌లో 48.5కి దిగజారింది. ఈ గణంకాల నేపథ్యంలో మదుపర్లు ఇటువైపు దృష్టిసారించనున్నారు.

**అంతర్జాతీయ పరిణామాలు**

ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ గత పాలసీ సమీక్షా వివరాలు బుధవారం (జనవరి 3న) వెల్లడించనుంది. ఈ కమిటీ తాజా పరపతి సమీక్షలో 25 బేసిస్ పాయింట్లు వడ్డీ రేటును పెంచింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రెట్లు 1.25-1.5శాతానికి చేరాయి. కాగా 2017లో మొత్తంగా ఫెడ్ వడ్డీ రేట్లను మూడుసార్లు పెంచింది. మరోవైపు గత వారం అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఈ వారం చమురు ధరలకు ప్రాధాన్యత ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. సెలవుల కారణంగా ఎఫ్ఐఐల లావాదేవీలు తక్కువ స్థాయిలో ఉంటాయని, దాంతో మార్కెట్ స్తబ్దుగానే ఉండొచ్చని మార్కెట్ వర్గాల అంచనా. కొత్త సంవత్సరం సందర్భంగా సోమవారం అమెరికాతో పాటు పలు ప్రపంచ మార్కెట్లు పనిచేయవు.

### తరలిపోయిన ఎఫ్‌పీఐలు

విదేశీ ఇన్వెస్టర్లు డిసెంబర్ నెలలో దేశీయ ఈక్విటీల నుంచి రూ.5900 కోట్లు పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. ప్రధానంగా ద్రవ్యలోటు, ముడి చమురు ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈఏడాది చివరి నాటికి దేశంలోకి ఎఫ్‌పీఐలు ప్రవాహం నికరంగా రూ.51,000 కోట్లకు చేరుకున్నాయి.

---

సీపీఐ(ఎం) వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా

## సారంపల్లి వాసుదేవరెడ్డి



**నవతెలంగాణ-వరంగల్**

సీపీఐ(ఎం) వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా సారంపల్లి వాసుదేవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ వరంగల్ అర్బన్ జిల్లా 19వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. కార్యదర్శివర్గ సభ్యులుగా జి ప్రభాకర్‌రెడ్డి, ఎన్ రత్నమాల, టి ఉప్పలయ్య, రాగుల రమేష్‌లతో పాటు మరో 14 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శిగా పంతం రవి



**నవతెలంగాణ-సిరిసిల్ల**

సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శిగా పంతం రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ మహాసభలు రెండోరోజైన ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా కార్యదర్శితో పాటు మొత్తం 12 మందితో ఎన్నికైన జిల్లా నూతన కమిటీని ప్రకటించారు.

కాంగ్రెస్ పునాదుల్లోనే

## మత సామరస్యం : ఉత్తమ్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కాంగ్రెస్ పునాదుల్లోనే మత సామరస్యం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారరెడ్డి అన్నారు. 133 ఏండ్ల చరిత్ర కల్గిన కాంగ్రెస్, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ అని తెలిపారు. దేశ ప్రజలతో పూర్తిగా మమేకమై పని చేస్తోందని చెప్పారు. దేశంలో మత సామరస్యం నెలకొల్పడం, సామాజిక న్యాయం కొనసాగించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన తెలిపారు. దూరదర్శన్ మాజీ జాయింట్ డైరెక్టర్ మాజీ ఏపీ పోలీస్ సీపీఆర్.ఓ సుజాత్ అలీ నేతత్వంలో పలువురు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. మోడీ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దేశానికి స్వాతంత్రం తెచ్చినా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసినా కూడా అది కాంగ్రెస్‌తో మాత్రమే సాధ్యమని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్ ప్రసాద్, డాక్టర్ ముజఫర్ అలీ, న్యాయవాది సత్యనారాయణ శర్మ సహా పలువురు ఎన్.ఆర్.ఐలు, డాక్టర్లు, న్యాయవాదులు సామాజిక సేవకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


(ఫైల్)

**ఇంకా 43 హామీలు అమలు చేయలేదు : షబ్బీర్‌అలీ**

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చిందని, వాటిల్లో చాలా అమలు చేయలేదని శాసనమండలిలో కాంగ్రెస్‌పార్టీ పక్ష నేత షబ్బీర్‌అలీ అన్నారు. ఇంకా 43 హామీలు అమలు చేయాలన్నారు. ఇచ్చిన వాటిల్లోనూ పూర్తిస్థాయిలో కాలేదన్నారు.

ఎన్‌కౌంటర్‌పై

## గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం : చాడ


మాట్లాడుతున్న చాడ

**నవతెలంగాణ- చిగురుమామిడి**

టేకులపల్లి ఎన్‌కౌంటర్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండలో విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. గుజరాత్ ఫలితాలతో ప్రధాని నరేంద్ర మోడీలో తెలియని మార్పు మొదలైందన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ వచ్చే ఎన్నికల్లో మోడీ సర్కారుకు ఎదురు దెబ్బలు తగులుతాయన్నారు. జమిలీ ఎన్నికలను సీపీఐ ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాలను పెంచకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. జనవరి మొదటివారంలో తెలంగాణ జేఏసీ, వామపక్షాలు కలిసి సిద్ధిపేట నుంచి నేరెళ్ల వరకు పాదయాత్ర చేస్తాయని తెలిపారు. అనంతరం రేకొండలోని ఇటీవల మరణించిన గంద్రత్ వెంకటయ్య కుంటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అందె స్వామి, వ్యకాస జిల్లా అధ్యక్షుడు కొత్తూరి వెంకట్రాజయ్య ఉన్నారు.

# వర్గీకరణ ఉద్యమాన్ని అణచివేసే కుట్ర

- కేసీఆర్‌కో న్యాయం.. మాదిగలకో న్యాయమా?
- ఆదివాసీలు, లంబాడీల మధ్య సర్కారే చిచ్చు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- నేటి నుంచి ఎమ్మార్పీఎస్ దీక్షలు


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**నవతెలంగాణ - అంబర్‌పేట**

మాదిగలపై టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వర్గీకరణ ఉద్యమాన్ని అణచివేసేందుకు శతవిధాలా యత్నిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీలో దీక్ష చేసేందునే సిద్ధంగా ఉన్నా...మద్దతిచ్చేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధమేనా అని సవాల్ విసిరారు. జనవరి ఒకటో తేదీ నుంచి తెలంగాణ, ఆంధ్రాలో శాంతిదీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని ఓయూ గెస్ట్‌హౌజ్‌లో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో గతంలో సమావేశంలో అఖిలపక్షాన్ని త్వరలో ఢిల్లీకి తీసుకెళ్తానని హామీనిచ్చిందన్నారు. ఇంతవరకు ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కావాలనే ఉద్యమాన్ని దెబ్బతీయాలని చూస్తోందన్నారు. సీఎంకు పావుగా మారి మాదిగల ఆగ్రహానికి గురికావొద్దని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరికి సూచించారు. నేను సూచించిన 13 అంశాలకే జవాబు చెప్పలేకనే సీఎం కేసీఆర్ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని రంగంలోకి దించారన్నారు. సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించేందుకు వెళ్తే నెలరోజులుగా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. గతంలో కేసీఆర్ దీక్ష చేసినప్పుడు ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా మద్దతు తెలపలేదన్నారు. ఒక్క ఎమ్మార్పీఎస్ మాత్రమే మద్దతు తెలిపిందనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కనీసం ఆ కృతజ్ఞత మరిచాడన్నారు. మేం ఢిల్లీలో నెలరోజులు దీక్ష చేస్తే దేశంలోని అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయని, టీఆర్ఎస్ ఎంపీలు అటువైపు కూడా చూడలేదని విమర్శించారు. ఆదివాసీలు, లంబాడీల మధ్య చిచ్చు పెట్టింది సర్కారే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత విద్యార్థి రాకేశ్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్‌ను ప్రశ్నిస్తే పోలీసులు అరెస్టు చేశారని, 8 రోజులు గడుస్తున్నా అతన్ని విడుదల చేయలేదని చెప్పారు. ఆ విద్యార్థికి ఏం జరిగినా మంత్రిదే బాధ్యతన్నారు.

# సంక్షోభంలో వ్యవసాయ రంగం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య


మాట్లాడుతున్న జి.నాగయ్య

**నవతెలంగాణ-జమ్మికుంట**

దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 1 నుంచి నెలాఖరు వరకు గ్రామాల్లోని సమస్యలపై సీపీఐ(ఎం) అధ్యయనం చేయనుందని, జనవరి 16 వరకు అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని మండలకేంద్రాల్లో నిరాహారదీక్షలు చేపడతామని తెలిపారు. 19న మండలాల ముట్టడి, 22న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి ఉంటుందన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శ్రీవినాయకగార్డెన్‌లో జరుగుతున్న సీపీఐ(ఎం)జిల్లా మహాసభలో ఆయన ఆదివారం మాట్లాడారు. గుజరాత్‌లో దళితులపై, ముస్లింలపై ఆర్ఎస్ఎస్ నాయకుల దాడులు హేయమన్నారు. జీఎస్టీతో సామాన్యులకు ఒరిగిందేమీ లేదని, స్విస్‌బ్యాంకులో దాచిన డబ్బు పంచుతానని పెద్దనోట్ల రద్దు చేసిన ప్రధాని మాట తప్పారని విమర్శించారు. ఉద్యోగంలేక నిరుద్యోగులు రోడ్డునపడుతున్నపరిస్థితులు దాపురించా యన్నారు. గుజరాత్ ఎన్నికలతో మోడీ పతనం మొదలైందని, తమిళనాడులో పాగా వేసేందుకు 2జీ స్పెక్ట్రం కేసులో కనిమొళి, రాజా నీతిమంతులని తేల్చేశారని విమర్శించారు. దళితులకు మూడెకరాల పథకంలో 18 లక్షల ఎకరాలు అవసరముండగా.. కేవలం 4 వేల ఎకరాలు మాత్రమే రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చారన్నారు. దాదాపు 2లక్షలా 70వేల ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సభలో కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ .వీరయ్య, జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ద వెంకట్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాములు పాల్గొన్నారు.

## డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌కు స్పీకర్ సన్మానం

**నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. వైద్యరంగంలో అత్తుత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను స్పీకర్ మధుసూధనాచారి ఆయనను ఘనంగా సన్మానించారు. 10 టీవీ, జేఎంసీ కమ్యూనికేషన్స్, సుఖీభవ ప్రాపర్టీస్ సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్‌లోని తెలుగు లలితకళాతోరణంలో వైద్యరత్న అవార్డులు-2017 ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మణ్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు విఠల్, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ లలితకుమారి, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు సాయిరెడ్డి, పద్మాచారి తదితరులు భారీగా హాజరయ్యారు.

కాగా, తెలంగాణ ఉద్యమ సమయంలో మెడికల్ జేఏసీ తరపున శ్రీనివాస్ పాత్ర మరువలేనిది. ఉద్యమంలో ఆయన సేవలకుగాను అప్పటి ఉద్యమ నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నోసార్లు ప్రశంసించిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత ప్రభుత్వ వైద్యుల సంఘం అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏండ్లుగా పరిష్కారం కానీ డాక్టర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలను పరిష్కరిస్తున్నారు. సమాజసేనలోనూ ఆయనది అందెవేసిన చెయ్యి. వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమంది ప్రశంసలు పొందుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉద్యోగాలివ్వకుంటే

# కేసీఆర్ ప్రభుత్వాన్ని బొందపెడ్తాం

- నల్లగొండకు చేరుకున్న ఉద్యోగాల సాధన సమితి యాత్ర
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**నవతెలంగాణ - క్లాక్‌టవర్**

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయని పక్షంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని బొందపెడ్తామని ఉద్యోగాల సాధన సమితి నాయకులు హెచ్చరించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగాల సాధన సమితి(డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, టీవీవీ) ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎ.విజయ్‌కుమార్, రాములుయాదవ్, సిహెచ్.పుల్లన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. రాష్ట్రంలో ఖాళీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక కేసీఆర్ విస్మరించాడన్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు కేసీఆర్ బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ఖాళీ అవుతున్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేసీఆర్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కోట రమేశ్, బోయినపల్లి సందీప్ మాట్లాడుతూ కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదన్నారు. విద్యారంగాన్ని విస్మరించడమే కాకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఆత్మహత్యల వైపు ఉసిగొల్పుతున్నాడన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందూరు సాగర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట్ల అశోక్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బరిగెల వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్, టీవీవీ జిల్లా కన్వీనర్ గోపినాథ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సరేశ్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి పరంగి రాము, పేర్లబాలు, అక్రం పాల్గొన్నారు.




# నేరంపై కులం ముద్ర



**2008 నాటి పార్లమెంట్ ఓటుకు నోటు కుంభకోణాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూడండి. రాజ్‌దీప్ సర్దేశాయ్, సుధీంద్ర కులకర్ణి (అప్పట్లో అద్వానీకి సన్నిహితుడు) ఒకప్పుడు సీఎన్ఎన్-ఐబీఎన్ కోసం నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ ఫలితమది. ఫగ్గన్‌సింగ్ కులాస్తే, అశోక్ అర్గాల్, మహవీర్‌సింగ్ భరోగాలు అందులో ఇరుక్కున్నారు. వారంతా ఎస్సీ, ఎస్టీలే. అంతకుముందటి స్టింగ్ ఆపరేషన్‌లో నోటుకు ప్రశ్న కుంభకోణం వెలుగుచూసింది. అందులో ఇరుకున్న 11మంది ఎంపీలు 2005లో పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయారు. దాదాపు వారంతా ఎస్సీ, ఎస్టీలే. వారిలో ఆరుగురు బీజేపీకి, ముగ్గురు బీఎస్పీకి, ఒకరు కాంగ్రెస్‌కు, ఒకరు ఆర్జేడీకి చెందినవారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్న అగ్ర కులాలకు చెందిన సుప్రసిద్ధ ప్రజా ప్రతినిధులు కూడా లేకపోలేదు. సుఖ్‌రాం, జయలలిత, సురేష్ కల్మాడీలను చెప్పుకోవచ్చు. అయితే వాళ్లు చాలా కొద్దిమందే. వారికి కేసుల నుంచి తప్పించుకునే అవకాశాలూ ఎక్కువే. లేకపోతే వారి కేసులు ఎంతకాలమైనా సాగుతూ పోతూనే ఉంటాయి. వాస్తవం ఏమిటో చూడండి. సుఖ్‌రామ్ పరుపు కింద డబ్బు దొరికినా, శిక్ష పడ్డా ఆయన ఎన్నడూ జైలు శిక్ష అనుభవించాల్సి రాలేదు.**

దిగువ కులాలు, ముస్లింలలో అవినీతి, నేరగ్రస్తత సాధారణమని భావించడం సహేతుకమేనా? లేక పోలీసులు, న్యాయమూర్తుల నుంచి మీడియా, ప్రజాభిప్రాయం వరకు ఈ వ్యవస్థ అణగారినవారి పట్ల చాలా అన్యాయంగా ఉంటున్నదా? ఒకే కేసులో నిర్దోషిగా తేలిన రాజాను ఇంకా దొంగగానే చూస్తుంటే, శిక్షపడ్డ సుఖరామ్‌కు జైలుకు వెళ్లకుండానే గడిచిపోతోంది. అంటే బంగారు లక్ష్మణ్‌ను జైల్లో మగ్గుతూ చావమని వదిలేసినా, జాదవ్‌కు రాజకీయ పునరావాసం కల్పించడం సాధ్యమేనని అర్థం. అవినీతి, నేరగ్రస్తతలకూ, కులానికి లేదా మతానికి ఏదైనా సంబంధం ఉన్నదా? లేకపోతే, కులాల నిచ్చెన మెట్లపై కిందకు దిగే కొద్దీ మీరు అవినీతికి పాల్పడి (పట్టుబడి) కేసులను ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువ అవుతాయా? వాస్తవాలేమిటో చూద్దాం. 2-జీ కుంభకోణం కేసులో దోషిగా పదిహేను నెలలు విచారణలో ఉన్న ఖైదీగా జైల్లో గడిపి, ఆరేండ్లు విచారణను ఎదుర్కొన్న ఎ.రాజాను నేడు నిర్దోషిగా తేల్చారు. అయన దళితుడు. పార్టీలో సహ నేత, కేసులో సహ నిందితురాలైన కనిమొళిని కూడా అలాగే నిర్దోషి అని తేల్చారు. ఆమె కూడా వెనుకబడిన కులాలకు చెందినవారే. మధుకోడా (బొగ్గు కుంభకోణంలో ఇటీవలే శిక్ష పడింది), శిబూ సోరెన్ (లంచం తీసుకోవడం, హత్య కేసులను చివరకు కొట్టివేశారు) ఇద్దరూ ఆదివాసులు. ఇక మాయావతి దళిత మహిళ. లాలూప్రసాద్ యాదవ్, ములాయంసింగ్ యాదవ్ ఓబీసీలు. వీరు ముగ్గురు అవినీతి లేదా లెక్కకు మించిన ఆస్తుల కేసుల్లో దొరికారు. ఎప్పటికప్పుడు అప్పటి రాజకీయాలను బట్టి ఈ కేసులు ముందుకు వస్తూ, మరుగున పడిపోతూ ఉంటాయి. అధికారంలో ఉన్న పెద్దలు ఎప్పుడు వారు నోళ్లు మూయాలని లేదా వారి ఆమోదం కావాలని అనుకుంటే అప్పుడు ఆ కేసులను లక్ష్యం ఏదో నెరవేరిన వెంటనే ఊహించినట్టుగానే అది మరుగున పడిపోతుంది. అతి సుదీర్ఘ కాలపు శిక్షను (పదేండ్లు) అనుభవిస్తున్న హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓమ్‌ప్రకాష్ చౌతలా జాట్ కులస్తుడు. వెనుకబడిన కులాలకు చెందినవారు కాదు. అయినప్పటికీ కులాల అంతస్తులలో ఆయన కులం సవర్ణుల కంటే దిగువన ఉండేదే.

### పట్టుబడేవారంతా దిగువ కులాల నేతలే

2008 నాటి పార్లమెంట్ ఓటుకు నోటు కుంభకోణాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూడండి. రాజ్‌దీప్ సర్దేశాయ్, సుధీంద్ర కులకర్ణి (అప్పట్లో అద్వానీకి సన్నిహితుడు) ఒకప్పుడు సీఎన్ఎన్-ఐబీఎన్ కోసం నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ ఫలితమది. ఫగ్గన్‌సింగ్ కులాస్తే, అశోక్ అర్గాల్, మహవీర్‌సింగ్ భరోగాలు అందులో ఇరుక్కున్నారు. వారంతా ఎస్సీ, ఎస్టీలే. అంతకుముందటి స్టింగ్ ఆపరేషన్‌లో నోటుకు ప్రశ్న కుంభకోణం వెలుగుచూసింది. అందులో ఇరుకున్న 11మంది ఎంపీలు 2005లో పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయారు. దాదాపు వారంతా ఎస్సీ, ఎస్టీలే. వారిలో ఆరుగురు బీజేపీకి, ముగ్గురు బీఎస్పీకి, ఒకరు కాంగ్రెస్‌కు, ఒకరు ఆర్జేడీకి చెందినవారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్న అగ్ర కులాలకు చెందిన సుప్రసిద్ధ ప్రజా ప్రతినిధులు కూడా లేకపోలేదు. సుఖ్‌రాం, జయలలిత, సురేష్ కల్మాడీలను చెప్పుకోవచ్చు. అయితే వాళ్లు చాలా కొద్దిమందే. వారికి కేసుల నుంచి తప్పించుకునే అవకాశాలూ ఎక్కువే. లేకపోతే వారి కేసులు ఎంతకాలమైనా సాగుతూ పోతూనే ఉంటాయి. వాస్తవం ఏమిటో చూడండి. సుఖ్‌రామ్ పరుపు కింద డబ్బు దొరికినా, శిక్ష పడ్డా ఆయన ఎన్నడూ జైలు శిక్ష అనుభవించాల్సి రాలేదు. ఇప్పుడు 90 ఏండ్ల వయస్సులో ఉన్న ఆయన సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌వాది. బీజేపీని కౌగిలించుకొని నేడు ఆ పార్టీలో పునరావాసాన్ని పొందాడు. ఎన్నికలకు ముందు ఆయన పార్టీ ఫిరాయించారు. ఆయన కుమారుడు అనిల్ బీజేపీ ఎమ్మెల్యే. బీజేపీలో చేరితే రాజాకుగానీ, ఆయన పిల్లలకు గానీ అలాంటి భాగ్యం కలుగుతుందని మీరు ఆశించగలరా? అవినీతి పట్ల నా "కులతత్వవాద" దృష్టిపై విరుచుకుపడటానికి ముందు మీరు దయచేసి నాలుగు వాస్తవాలను చూడండి. ఒకటి, సుఖ్‌రామ్, రాజా ఈ ఇద్దరూ వారు టెలికాం మంత్రులుగా ఉండగానే వారిపైన అవినీతి ఆరోపణలను మోపారు. రెండు సుఖ్‌రాంకు శిక్షపడగా, రాజాను వదిలిపెట్టారు. మూడు, ఒకరి వద్ద ఆయన పరుపు కిందనే డబ్బు దొరికింది. మరొకరి వద్ద విచారణ సాగించిన న్యాయమూర్తి వెటకారంగా ప్రశ్నించినట్టుగా డబ్బు ఎక్కడుందీ? డబ్బు దొరకలేదూ అంటే ఇక అవినీతి ఎక్కడిది. కాబట్టి నిర్దోషిగా ప్రకటించారు. ఇక నాలుగో వాస్తవం అత్యంత ముఖ్యమైనది. సుఖ్‌రామ్ బ్రాహ్మణుడు. ఆయన ఏదో ఒకసారి దారి తప్పి ఉంటారంతే. అలాంటి వాళ్లు సాధారణంగా అవినీతికి పాల్పడరు. ఇక రాజా అంటే దళితుడు. అలాంటి వాళ్ల నుంచి అంతకన్నా ఎక్కువ ఏం ఆశించగలరు? అధికారాన్ని, బాధ్యతలను వాళ్లు సక్రమంగా నిర్వహించలేరు అంతే. సాధారణంగా అనుమానించాల్సినవారు వారే.

### కులాన్ని బట్టే కటకటాలు లెక్కించాలా?

ఇక ఇప్పుడు బీజేపీకి చెందిన ఆసక్తికరమైన ఓ కేసును పరిశీలిద్దాం. రెండు భిన్న సందర్భాల్లో ఆ పార్టీకి చెందిన ఇద్దరు నేతలు లంచం పుచ్చుకుంటూ కెమెరాకు దొరికిపోయారు. ఒకరు దలీప్‌సింగ్ జాదవ్. 2003లో రూ.9లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన ఆయన అగ్ర కులస్తుడు. బీజేపీ సంతోషంగా ఆయనకు పునరావాసం కల్పించి తిగిరి ఎన్నికల్లో నిలబెట్టింది. ఎన్నికై పార్లమెంటులో ప్రవేశించారు. పైగా "డబ్బే దేవుడు కాదు, ఆ దేవుని సాక్షిగా చెబుతున్నా డబ్బు దేవుని కంటే తక్కువదేం కాదు" అంటూ కెమెరాకు చిక్కారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో అప్పుడు జూనియర్ మంత్రిగా ఉన్న ఆయన లంచం ఇచ్చే వ్యక్తితో కలిసి బ్లాక్ లేబుల్ సీసాను ఖాళీ చేస్తూ చెప్పారీ మాట. మరొకరు తెహల్కా స్టింగ్ ఆపరేషన్‌లో (2001) కేవలం రూ.1లక్ష తీసుకుంటూ పట్టుబడ్డ బంగారు లక్ష్మణ్. జాదవ్ కేవలం జూనియర్ మంత్రే. కాని బంగారు లక్ష్మణ్ నాటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు. అయితేనేం, ఆయన ముందుగా ఒక దళితుడు. నేటికి కూడా బీజేపీలో అంత ఉన్నత స్థాయికి చేరిన ఒకేఒక్క దళితుడు ఆయనే. ఆ పార్టీ ఆయనతో తమకు సంబంధం లేదంది, ఖండించింది, పార్టీ నుంచి వెళ్లగొట్టింది, ఏకాకిని చేసింది. ఆయన జైలుకు వెళ్లారు. ఆ తెహల్కా కేసులో తనంత తాను ఒంటరిగా పోరాడుతూనే మరణించారు. ఆ స్టింగ్ ఆపరేషన్‌లో జైలుకు వెళ్లిన ఏకైక నేత ఆయనే. జాదవ్‌ను ఇంకా కాపాడుకుంటూనే వస్తున్న ఆ పార్టీ లక్ష్మణ్‌ను అంటరానివాడున్నట్టుగానే చూసింది. ఇది దురదృష్టకరమైన అభివర్ణనే అయినా అలా చెప్పక తప్పడం లేదు. ఈ వాదనను మీరు న్యాయవ్యవస్థకు విస్తరింజేయాలంటారా? మన ప్రధాన న్యాయమూర్తులలో ఎక్కువ మంది అవినీతిపరులని చాలా మందే పరోక్షంగా సూచించారు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం ఊపు మీద ఉన్నప్పుడు ఆ ఉద్యమంలోని పలువురు ప్రముఖులు సైతం అలా అన్నారు. కానీ పేరు పెట్టి దాడిని ఎక్కుపెట్టింది ఎవరిపైన? జస్టిస్ కేజీ బాలకృష్ణన్ ఒక్కరిపైనే. ఆయన దళితుడు. దశాబ్ది దాటినా నేటికీ ఆయన వ్యతిరేకంగా కనిపెట్టింది ఏదీ లేదు.

### వ్యవస్థలోనే ఉన్న పక్షపాతం

ఈ విషయాన్ని మరింతగా శోధిద్దాం. వృత్తిపరమైన ఓ చిన్నపాటి పొరపాటు చేసినందుకు ఉన్నత న్యాయస్థానం పట్ల కోర్టు ధిక్కారానికి పాల్పడ్డందుకు జైలుకు వెళ్లిన ఏకైక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీఎస్ కన్నన్. ఆయన దళితుడు. గణనీయులైన ముగ్గురు న్యాయమూర్తులకు వ్యతిరేకంగా లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చినా వారు ఏ మచ్చా అంటకుండా బయటపడ్డారు. ఈ మూడు కేసులనూ సమాధి చేసేశారు. ఒక కేసులోనైతే, ఆ ఆరోపణల గురించి మాట్లాడటానికే వీల్లేదని మీడియాపై నిషేధం విధించేంత వరకూ కూడా ఒక హైకోర్టు వెళ్లింది. ముగ్గురిలో ఇద్దరు సుప్రీం కోర్టు చేరగా, ఒకరు పదవీ విరమణానంతరం చేపట్టగల ఒక ఉన్నత పదవిని అలంకరించారు. చివరగా ఒక్క మాట చెప్పాలి. వీరిలో ఏ ఒక్కరూ కింది కులాలకు చెందిన వారు కారు. కాబట్టి సాధారణ అనుమతులు కావు.

ఇది సామాజిక వ్యవస్థ అనే గోపురంలోని శిఖరాగ్ర భాగం ఒక నియమంగానే "ఎక్కువ పరిశుద్ధమైనది"గా ఉండటం ఫలితం కావచ్చా. లేక దిగువ సగ భాగం పట్ల ఈ వ్యవస్థ బాగా అన్యాయంగా ఉండటం ఫలితం కావచ్చు? మనదేశంలో పదవులు ఉద్యోగాల వంటి స్థానాల్లో, ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న ముస్లింల సంఖ్య వారి జనాభాతో ఏమాత్రం పొంతన లేకుండా అతి తక్కువ సంఖ్యలో ఉన్నది. ముస్లింల స్థితిగతులను అధ్యయనం చేసిన సచార్ కమిటీ నివేదిక సైతం అదే విషయాన్ని తెలిపింది. జనాభాతో పొంతన లేకుండా ముస్లింలు ఎక్కువగా ఉన్నది ఒక్క జైళ్లలోనే. కాబట్టి హిందువుల కంటే ముస్లింలలో నేరగ్రస్తులయ్యే ధోరణి ఎక్కువగా ఉంటుందా, లేక వ్యవస్థ వారి పట్ల బాగా అన్యాయంగా ఉన్నదా? "ఐసీ తైసీ డెమొక్రసీ" (పరిహాసాస్పద ప్రజాస్వామ్యం) అనేది బాగా ప్రాచుర్యం పొందిన రంగస్థల ప్రదర్శనల్లో ఒకటి. మన దేశంలో హత్య నేరానికి ఉరిశిక్షను అనుభవించేవారిలో అత్యధికులు మైనారిటీలు లేదా దిగువ కులాల వారేనని ఆ రాజకీయ వ్యంగ్య ప్రదర్శన మనకు గుర్తు చేస్తుంటుంది. ఒక బ్రాహ్మణున్ని ఉరి తీస్తామంటే వారు కత్తులు నూరుతారు, అతగాడు ఎవరనో కాదు మహాత్మా గాంధీనే హత్య చేసినా సరే. కాబట్టి కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతాయి. అవినీతి, నేరగ్రస్తుతల విషయంలో జన్యుపరమైన అంశాల ప్రభావం ఏమైనా ఉంటుందా? లేకపోతే ఈ వ్యవస్థ... పోలీసులు, న్యాయమూర్తుల నుంచి మీడియా, ప్రజాభిప్రాయం వరకు బడుగులకు లేదా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అణగారిన వారి పట్ల బాగా అన్యాయంగా ఉంటున్నాదా? పోలీసు కాల్పులకు గురయ్యే లేదా జైళ్లలో జనాభాతో పొంతన లేకుండా ఎక్కువ సంఖ్యలో ఉండే ఆఫ్రికన్-అమెరికన్ల సంఖ్యను చూడండి. కొన్ని చోట్ల జాతి అనేది మన దేశంలోని కులం స్థానంలో నిలుస్తోంది. కొన్ని మైనారిటీలు, ఆదివాసీలు కూడా మన దేశంలో అదే కోవకు చెందుతుండటంతో ఈ సమస్య మరింత జటిలం అవుతుంది. ఈ పక్షపాతం కొనసాగుతూనే ఉంటుంది. నిర్దోషిగా తేలిన రాజాను ఇంకా దొంగగానే చూస్తుండగా, శిక్ష పడ్డా సుఖరామ్ జైలుకు వెళ్లకుండా ఈ వ్యవస్థ కాపాడుతుంది. అంటే బంగారు లక్ష్మణ్‌ను ఒంటరిగా జైల్లో మగ్గుతూ చావమని వదిలేసినా, జాదవ్‌కు రాజకీయ పునరావాసం కల్పించగలుగుతుందని కూడా అర్థం.

**సాక్షి దినపత్రిక సౌజన్యంతో...**

# మేము మాట్లాడుతున్నాం

జూపాక సుభద్ర

'ఆల్ ఇండియా దళిత మహిళా అధికార మంచ్' వాళ్లు ఈ మధ్య సావిత్రి బాయిపూలే పూణె యూనివర్సిటీలో దళిత్ ఉమెన్ స్పీక్ అవుట్ (దళిత మహిళ మాట్లాడుతున్నది) క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే ఉమెన్స్ స్టడీస్ సెంటర్‌తో కలిసి సదస్సు నిర్వహించడం చాలా గొప్ప విషయం. భారతదేశ వ్యాప్తగా చాలా రాష్ట్రాల ముఖ్య దళిత మహిళల్ని, వారి నాయకత్వాన్ని, వారి పోరాటాన్ని ఆస్తిత్వాలు, వారు నిర్మించుకుంటున్న ఆధునిక దార్శనీకతలు చాలా అద్భుతమైనవిగా కనిపించినవి. ఇవన్నింటి దశ దిశ రాజ్యాధికారమైన దృష్టి కూడా చాలా ఆదర్శనీయం. ఇన్నాళ్లు మాట్లాడే అవకాశం లేక ఇంట్ల బైట కేవలం సేవకు, ఎట్టి పనుల్లో మగ్గిపోయిన అంటరాని మహిళలచే మాట్లాడించడం మంచి విషయం. "దళిత మహిళల గొంతులు విస్తరించాలి. శక్తులు కూడగట్టుకోవాలి. జీవితాల్ని మార్చుకోవాలి. దేశమంతా విభిన్న భాషల్లో, సంస్కృతులతో బతుకుతున్న అంటరాని తనాలు వెట్టి జీవితాలు మాత్రం ఒక్కటిగానే ఉన్నయి. భిన్న గొంతుల్ని అల్లుకుంటూ అలుముకుంటూ రాజకీయాధికారాల వైపు మల్లుదాం" అనే ఎజెండాలతో సాగిన ఈ సదస్సు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్ తాత్వికంగా అంటరాని జెండర్ దృక్పథాలతో పునాది ఆధునిక మిళితంగా సెషన్స్ నడిచినయి. తరతరాలుగా మా దళిత మహిళలు కేవలం చాకిరి, వెట్టి జేసుడేగాని మాకు మాట్లాడే అవకాశమే లేదు. ఈ కులస్వామ్య, మగస్వామ్య వ్యవస్థలో పురాణాల్నించి, ఇతిహాసాలు, కావ్యాల నుంచి ఇప్పటి ఆధునిక సాహిత్యాల దాకా మా అంటరాని జెండర్‌లను అంటుకోలే. ఎవరి గోస వారిదే. ఎవరూ ఎవర్ని ఉద్ధరించాలని చూడ్డం, ఎదురు చూడకూడదని అర్థమైది. అందుకే మాట్లాడాలి. ఎవరి హక్కుల కోసం వారే పోరాడాలి. ఇతర ఉద్యమ సామాజిక శక్తుల సంఘీభావాలను కూడగట్టుకోవాలి అని అర్థమైంది. ఇప్పటిదాకా వచ్చిన పురాణాల సాహిత్యాల నుంచి ఇప్పటిదాకా రికార్డులుగా వచ్చిన సాహిత్యాల్లో దళిత మహిళలు ఎట్లా బత్కింండ్రు అనేది చూడము. మా దళిత మహిళలు ఏమి తిన్నరు, ఏమి తాగిండ్రు, ఏం బట్ట కట్టిండ్రు, ఏమాడుకున్నరు, ఏం పాడుకున్నరు, మా వ్యతిరేకతలు, మా నిరసనలు, మా బతుకులు, భాగ్యాలు అన్ని అన్నింటిని అవచ్యం చేసిన ఈ కొన్ని ఉద్యమాలు, మరికొన్ని రకాల సాహిత్యాలు.

మా మాటలు పబ్లిగ్గా రావాలి. అది గూడెం పబ్లిక్, ఊరు పబ్లిగా మా మాటలు బైటికి దాటాలి. కొండలు, గుట్టలు, కోటలు దాటాలి. అనే నినాదంతో దళిత మహిళలు మాట్లాడుతున్నరు అనే సదస్సుకు ఆంధ్ర, తెలంగాణ నుంచి దాదాపు 20 మందిమి పోయినం పూణేకి. పూణే అనంగానే మొదటి మహిళా టీచర్ మాకు చదువు నేర్పిన చదువులమ్మ సావిత్రిబాయి పూలే సంస్కరణలన్నీ ఆ పూణేలో పరుచుకున్నట్టుగా కనిపించింది. జ్యోతిరావు పూలేతో కల్సి ఆమె నిర్మించిన ఆధునిక దార్శనికతలు ఎంతగా విస్తరించినయో సావిత్రిబాయి పూలే మహిళా అధ్యయన కేంద్రం చెప్పింది. నిజానికి దేశంలో ఉన్న యూనివర్సిటీల్లోని మహిళా అధ్యయన కేంద్రాలు దాదాపు సవర్ణ మహిళాధిపత్యంలోనే ఉన్నయి. ఏవో ఒకటి అర బహుజన మహిళల చేతుల్లో ఉన్నయి. ఈ సదస్సులో బన్వారీదేవి కనిపించడం ఒక ఉద్వేగం. ప్రభుత్వంలో ఏఎన్ఎంగా పనిచేస్తూ బాల్య వివాహాల రిపోర్టులో రాజపుత్రుల సంఖ్య కూడా చేర్చి ఇచ్చినందుకు రాజపుత్‌లచే సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ ఘటన విశాఖ గైడ్‌లైన్స్ నుంచి పనిచేసే స్థలాల్లో మహిళా రక్షణ చట్టం వచ్చింది. తర్వాత



అమెరికాలో పుట్టి భారతదేశ పరిశోధకురాలిగా ఉంటూ కుల జెండర్ వివక్షలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ రచనలు చేసిన గెయిల్ ఆమ్‌విత్, మరాఠి రచయిత్రి ఉర్మిళా పవర్, బుద్దిస్టు రచయిత్రి రమాపాంచాల్, రాష్ట్రీయ దళిత మహిళా ఆందోళన్ రజినీతిలక్, ముప్పయేండ్ల నుంచి దళిత మహిళల కోసం పని చేస్తున్న రూత్ మనోరమ, ఆశా కొత్వాల్, బెర్నాడ్ ఫాతిమా, పూలే అంబేద్కరిస్టు, ఉమెనిస్టులు రేఖారాజ్, దమ్మా సింగిని రమాగోరక్, గ్రేస్ బాను, మోనికా విన్సెంట్, సింధియా స్టెఫెన్ లాంటి అనేక దళిత మహిళా నాయకుల్లొచ్చారు. యంగ్ దళిత్ మహిళలు, రీసెర్చ్ స్కాలర్స్ పెద్ద ఎత్తున వచ్చారు. రచయిత్రులు, కళాకారులు వాళ్ల వాళ్ల స్థానిక కళలతో, గ్రూపులు, గ్రూపులుగా హాజరై వాళ్ల కళల్ని సినిమాలనీ, డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. కానీ రెండు రోజులు మాత్రమే జరగడం వల్ల అన్ని సెషన్స్ కళలు, వారి డాక్యుమెంటరీలను, వారి స్పీక్ అవుట్స్‌ది అన్నింటినీ చూడలేకపోయాం. ఓ పది రోజులైనా జరిగితే బాగుండేది. చివరికి సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే వాళ్ల సామాజిక కుటీరాన్ని చూడటం గొప్ప అనుభూతి. ముక్తసాల్వే బాగ యాదొచ్చింది. సదస్సంతా ఉద్వేగభరితం.




**సెల్ :9849905687**

# దళిత దంపతులపై ఎస్సై ప్రతాపం

## అవమాన భారంతో కుంగి తనువు చాలించిన మహిళ

వనం నాగయ్య

ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటుచేసుకుని నిత్యం వారితో కలిసి ఉంటూ వారి యోగక్షేమాలు చూసి ఫ్రెండ్లీ పోలీస్ అనిపించుకోవాల్సిన వారు అధికారం ఉందన్న అహాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేతిలో లాఠీ, నడుముకు తుపాకీ ఉందని పేదలపై దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారు. సరిగ్గా ఇదే తరహా చర్యలకు పాల్పడ్డ ఓ ఎస్సై దాష్టీకానికి దళిత కుటుంబంలో మహిళ అవమాన భారంతో ప్రాణాలు పోగొట్టుకుంది. ఫలితంగా ఇద్దరు వయసొచ్చిన ఆడపిల్లలతో సహా ఆ కుటుంబం రోడ్డున పడింది.

ఎన్న శ్రీను, మణి దళితులు భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఉంటున్నారు. వీరు 35ఏండ్ల క్రితం దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామం నుండి పొట్టచేత పట్టుకుని వచ్చారు. ఇక్కడే నివాసం ఉంటున్నారు. వారితోపాటు కొందరు ఇదే కాలనీలో ఉంటున్నారు. ఈ ప్రాంతానికి వలస వచ్చిన సమయంలో అందరితోపాటే శ్రీను, అతని భార్య మణి కూడా చెట్టూ పుట్టాకొట్టుకుని నివాసానికి స్థలం ఏర్పాటుచేసుకున్నారు. ఎప్పటినుండో నివాసం ఉంటున్నారని 2007లో ఎన్నం శ్రీను కుటుంబానికి అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్ శశిభూషణ్‌కుమార్ ఇందిరమ్మ ఇల్లు (లేఖనెంబర్ 12-087) కూడా మంజూరు చేశారు. అసలే రెక్కాడితేనే పూటగడిచే కుటుంబం కావడంతోపాటు ముగ్గురు పిల్లల్లో ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా కట్టుకోలేక పోయారు. ఫలితంగా తమ స్థలంలో నే గుడిసె వేసుకుని జీవిస్తున్నారు. గత మార్చినెలలో ఇల్లు కట్టుకుందామని పిల్లర్లుపోసి పని ప్రారంభించారు. అసలు కథ ఇక్కడే మొదలైంది. వీరు దళితులనీ, తమ ఇంటిపక్కన ఉంటే తమకు అవమానమని భావించాడు పక్కనే ఉన్న ఓ రిటైర్డ్ అగ్రకుల ఉద్యోగి. తన పక్కన ఇల్లు నిర్మించడానికి వీల్లేదని తెగేసి చెప్పాడు. అంతేకాదు అష్టకష్టాలు పడి భూమిలో నిర్మించుకున్న సిమెంటు పిల్లర్లను జేసీబీతో తొలగించాడు. తమ పక్కన ఉండటానికి వీల్లేదని బెదిరిస్తూ ఆ దళిత కుటుంబాన్ని వివాదాల్లోకి లాగాడు. ఈ నేపథ్యంలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి ఫిర్యాదు చేసేందుకు బాధితులు శ్రీను, మణి పాల్వంచ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వీరి ఫిర్యాదును పరిశీలించిన సదరు స్టేషన్ ఎస్సై కరుణాకర్ హుటాహుటిన జీపు వేసుకుని సిబ్బందితో ఇల్లు నిర్మించకుండా అడ్డుకున్న స్థలం వద్దకు వచ్చారు. అక్కడ పరిసరాలన్నీ పరిశీలించి న్యాయం మీపక్కనే ఉందనీ, దౌర్జన్యానికి పాల్పడిన తేళ్ల చెన్నయ్యను హెచ్చరించి వెళ్లారు. దీంతో తమకు ఎస్సై అండగా ఉంటారనుకున్న వారి నమ్మకం తెల్లారే ఆవిరైంది. ఆరోజున వారు ఫిర్యాదుచేసిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడిన ఎస్సై తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఎస్సై కరుణాకర్ చెప్పిన మాటలు నమ్మి మరుసటి రోజున ఇంటిపని ప్రారంభిద్దామని స్థలం వద్దకు వెళ్లిన శ్రీను దంపతులకు, వారి బిడ్డలకు ఊహించని షాక్ తగిలింది. వీరు వెళ్లి ఇంటిపని ప్రారంభించే సమయంలో ఇంటిముందుకు వేగంగా వచ్చి ఆగింది ఎస్సై కరుణాకర్ జీపు. సివిల్ కేసులో రెవెన్యూ అధికారులు లేకుండానే వచ్చి "మీకు అనుమతులెవరిచ్చారు?" అని ప్రశ్నించడంతో వారంతా ఖంగుతిన్నారు. వెంటనే ఆ స్థలాన్ని ఖాళీచేసి వెళ్లాలని హుకుంజారీ చేశాడు సదరు ఎస్సై. అంతేకాదు నిమిషాల్లోనే వెళ్లాలని లేకపోతే జీపులో స్టేషన్‌కు తరలించి కేసులు పెట్టి జైలుకు పంపాల్సి ఉంటుందని హెచ్చరించాడు. దీంతో ఊహించని పరిణామానికి విస్తుపోయిన ఆ దళిత కుటుంబం చేసేదేమీలేక బిక్కమొహంతో కట్టుకుంటున్న ఇల్లు వదిలి రోడ్డుమీదకు వచ్చారు. ఇక ఇదే అదనుగా పోలీసులను అక్కడే మోహరింపజేసిన సదరు ఎస్సై బాధితులను బెదిరించిన వ్యక్తికి మద్దతుగా నిలవడంతో సదరు వ్యక్తి జేసీబీతో ఇంటి పిల్లర్లను తొలగించాడు. రెక్కల కష్టంతో నిర్మించుకున్న ఇంటి పిల్లర్లను తొలగిస్తుండగా చూసి భరించలేని శ్రీను దంపతులు పోలీసుల కాళ్లావేళ్లాపడ్డారు. అయినా కనికరించకపోగా వారిని బలవంతంగా స్టేషన్‌కు తరలించాడు. అక్కడ గ్రామస్తులంతా చూస్తుండగానే శ్రీను భార్య మణిని నోటికొచ్చినట్టు దుర్భాషలాడాడు. "నీ రక్తం తాగుతా"నని ఆగ్రహంతో ఊగిపోతూ వీరికి ఎవరూ అండలేరని రెచ్చిపోయాడు. ఇల్లు కూల్చేందుకు ప్రయత్నించిన మొదటిరోజున దళితుల పక్షాన మాట్లాడిన సదరు ఎస్సై ఆ మరుసటిరోజున తను విచిత్రంగా మాట్లాడటమే కాక దళితులని కూడా చూడకుండా నోటికొచ్చినట్టు మాట్లాడి వారిని స్టేషన్‌కు తరలించడమేకాక వారిపై 447, 427, 506 సెక్షన్లకింద కేసులు పెట్టి రిమాండ్‌కు కూడా పంపాడు. శ్రీను భార్య మణి అవమాన భారంతో మంచం పట్టింది. ఇలా తీవ్రంగా అనారోగ్యం పాలై జరిగిన అవమానాన్ని తలుచుకుని గత అక్టోబర్ 31న చనిపోయింది.



తనకు కేటాయించిన స్థలంలో పిల్లర్లు కూలగొట్టిన తీరును చూపుతున్న బాధితుడు శ్రీను

### ఎస్సై వల్లే నా భార్య మృతిచెందింది



ఇంటిముందు తక్కువ కులస్తుడు ఉండకూడదనే కక్ష సాధింపుతో అర్థ, అంగ బలంతో మాపై దౌర్జన్యం చేశారు. దాడిచేసి చెన్నయ్యపై కేసు నమోదు చేయకుండా తిరిగి మా కుటుంబంపైనే ఎస్సై కరుణాకర్ వేధింపులకు పాల్పడ్డాడు. ఎస్సై చర్యల వల్లే నా భార్య మృతి చెందింది. ఈ విషయమై అనేకసార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు.

**బాధితుడు శ్రీనివాస్**

### ఎస్సై దౌర్జన్యం చేసిన మాట వాస్తవమే



నేను ఒక కేసు విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని వెళ్లాను. ఆ సమయంలో ఎస్సై కరుణాకర్ తీవ్ర పదజాలంతో నెత్తురు తాగుతానంటూ నోటికొచ్చినట్టు మణి అనే మహిళను తిట్టాడు. ఆ సమయంలో నేను అక్కడే ఉన్నా. అంతేకాక వారిని బెదిరించాడు. దీంతో వారు బెదిరిపోయి స్టేషన్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపారు.

**పద్మ, పాల్వంచ**


### అర్ధ రాత్రివేళ దాడులు చేసి భయపెట్టాడు



మా తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలతో ఇల్లు నిర్మించాలనుకుంటే కూలగొట్టించడంలో ఎస్సై కీలక పాత్ర పోషించారు. మేం కాళ్లావేళ్లాపడ్డా ఆగలేదు. పోలీసులతో అర్ధరాత్రి వేళ దాడులు చేయించాడు. మా అమ్మ చనిపోవడానికి ప్రధాన కారణం ఎస్సై కరుణాకరే. అతనిపై చర్యలు తీసుకోవాలి.

**నవ్య, మృతురాలి కూతురు**

### నాకేం తెలియదు



దళిత మహిళను దుర్భాషలాడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాల్వంచ ఎస్సై కరుణాకర్‌ను 'నవతెలంగాణ' వివరణ కోరగా తనకు ఏం తెలియదని సమాధానమిచ్చారు. ఆ విషయం తనను కాదనీ, పోలీస్‌స్టేషన్ సిబ్బందిని అడగాలని వ్యంగ్యంగా వివరణ ఇచ్చారు.

**కరుణాకర్, పాల్వంచ ఎస్సై**

**సెల్ : 9490099343**



# మెగా ఈవెంట్లు పిలుస్తున్నాయ్!

## ఆసియా గేమ్స్, కామన్వెల్త్ క్రీడలు, వింటర్ ఒలింపిక్స్ క్రీడోత్సవ మేళా

ఒలింపిక్ క్రీడోత్సవం ముగిసి చాలా కాలం గడిచింది. భారీ పతకాలు ఆశించినా రియో నుంచి రెండు మెడల్స్‌తోనే వచ్చాం. రియో భంగపాటు భారత్‌ను ఇంకా వెంటాడుతూనే ఉన్నది. కానీ మెగా పరాభవాన్ని మరిపించే అవకాశం ఇప్పుడు టీమ్ ఇండియా ముంగిట నిలిచింది. కామన్వెల్త్ దేశాల క్రీడోత్సవం, ఆసియా దేశాల ఆటల రూపంలో మనకో అవకాశం దొరికింది!.

కామన్వెల్త్, ఆసియా గేమ్స్‌లో భారత్‌ది ఆధిపత్య ముద్ర కాదు!. 2010 ఢిల్లీ కామన్వెల్త్‌లో మాత్రమే పతకాల సెంచరీ కొట్టగలిగిన భారత్ గ్లాస్గోలో చిన్నబోయింది. వర్థమాన క్రీడాకారులు వేగంగా దూసుకొస్తోన్న వేళ, సీనియర్ అథ్లెట్లు తమ క్రీడాంశాల్లో ఆధిపత్య ముద్ర వేయాలని తపన పడుతోన్న సందర్భంలో ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ భారత్‌కు అత్యంత ప్రతిష్టాత్మకం. ఈ ఏడాదిలోనే ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ కనువిందు చేయబోతున్నాయి.

- ఫటాఫట్ పతకాలపై గురిపెట్టిన టీమ్ ఇండియా అథ్లెట్లు
- 2018లో ఎదురుచూస్తోన్న మల్టీ స్పోర్ట్స్ సవాల్

నవతెలంగాణ క్రీడా విభాగం

విజయాలు, వివాదాలు, రికార్డులు ఎలాగున్నా.. నిరుడు అంతర్జాతీయ వేదికపై మల్టీస్పోర్ట్స్ ఈవెంట్‌కు చోటు లేకపోయింది. 2016లోని రియో ఒలింపిక్స్ సంబురమే మల్టీ స్పోర్ట్స్‌లో జరిగిన ఆఖరు క్రీడోత్సవం. ప్రతి ఏటా ఆయా క్రీడాంశాల్లో ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లు, ఏడాది ఫైనల్స్, ప్రతిష్టాత్మక టోర్నీలు జరుగుతూనే ఉంటాయి. అలాగే గతేడాది సైతం మనోళ్లు చెప్పుకోదగిన ప్రతిభ కనబరిచారు. కానీ అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసేది మల్టీ స్పోర్ట్స్ ఈవెంట్‌లో చూపిన ప్రతిభ, సాధించిన పతకాలే అనటంలో మరో మాట లేదు. 2016 రియో ఒలింపిక్స్‌లో రెండెంకల పతకాలను ఆశించిన భారత్‌కు ఘోరమైన భంగపాటు ఎదురైంది. రియో వైఫల్యంతో పాఠం నేర్చినట్టే కనిపిస్తోన్న నేపథ్యంలో.. ఈ ఏడాది ఆరంభంలో కామన్వెల్త్ గేమ్స్, మధ్యలో ఆసియా గేమ్స్ ప్రతిష్టాత్మకంగా మారాయి. క్రీడా శిక్షణ కేంద్రాలు ఇప్పటికే కామన్వెల్త్ గేమ్స్ దిశగా సాధనలో మునిగిపోయాయి. ఆయా విభాగాల్లో ఎంపికలు సైతం శర వేగంగా సాగుతున్నాయి. ఫిబ్రవరిలో వింటర్ ఒలింపిక్స్ సైతం జరుగబోతున్నా.. మన దేశం నుంచి ప్రాతినిథ్యం, ఆశించే పతకాలు సైతం స్వలమే. కాబట్టి ప్రధానంగా భారత అథ్లెట్ల దృష్టి ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌పైనే నెలకొన్నది.

### గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్




ఈ ఏడాది తొలి పరీక్ష మరో నాల్గు మాసాల్లోనే ఎదురుకానున్నది. ఏప్రిల్ 4-15న ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ నగరంలో 20వ కామన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. అథ్లెటిక్స్ ఈవెంట్‌లో స్ప్రింట్‌లో ద్యుతీచంద్, స్టీపుల్‌ఛేజ్‌లో సుధా సింగ్, జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా, డిస్కస్ త్రోలో వికాస గౌడలు పతకాలు సాధించగల సత్తా ఉన్న వారు. బ్యాడ్మింటన్‌లో ఈసారి ఎక్కువ మెడల్స్ ఆశించవచ్చు. సింధు, సైనా, శ్రీకాంత్, ప్రణయ్‌లు సింగిల్స్ విభాగాల్లో సిక్కిరెడ్డి, అశ్విని, ప్రణవ్ జెర్రీ, సాత్విక్ రాజ్‌లు డబుల్స్ విభాగాల్లో మేటీగా రాణిస్తున్నారు. దీంతో బ్యాడ్మింటన్‌లో కనీసం మూడు పతకాలు ఆశించవచ్చు!. జిమ్నాస్టిక్స్‌లో స్టార్ అథ్లెట్ దీప కర్మాకర్‌పైనే ఆశలన్నీ నెలకొన్నాయి. సర్జరీ తర్వాత ఇప్పుడిప్పుడే సాధన చేస్తోన్న దీప గోల్డ్‌కోస్ట్‌లో గోల్డ్‌పైనే గురిపెట్టింది. హాకీ, స్క్వాష్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లలో పోటీ నెలకొన్నా మన అవకాశాలు తీసిపారేయలేం. ఇక బాక్సింగ్, షూటింగ్‌లో భారత్ మెగా మెడల్స్ ఆశిస్తోంది. వీటిల్లో ప్రతి పతక ఈవెంట్‌లోనూ భారత్ నుంచి పోటీపడుతున్నారు. రెజ్లింగ్‌లో సుశీల్ కుమార్ సహా ఇతర స్టార్స్ బరిలోకి దిగబోతున్నారు.

2014 కామన్వెల్త్ గేమ్స్‌లో 15 స్వర్ణాలు, 15 రజతాలు సహా 19 కాంస్యాలతో భారత్ 53 పతకాలు సాధించింది. పతకాల పట్టికలో ఐదో స్థానానికి పరిమితమైంది. 2010 ఢిల్లీ గేమ్స్‌లో 38 స్వర్ణాలు, 27 రజతాలు, 36 కాంస్యాలు నెగ్గిన భారత్ 101 మెడల్స్‌తో తొలిసారి రెండో స్థానానికి చేరుకున్నది. 2006 మెల్‌బోర్న్‌లో భారత్ 50 మెడల్స్ సాధించింది. ఈ సారి సైతం ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురుకానున్నది.

### జకర్తా ఆసియా గేమ్స్




కామన్వెల్త్‌లో ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియాల నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురైతే ఆసియా గేమ్స్‌లో వరల్డ్ స్పోర్ట్స్ లీడర్ చైనా, దక్షిణ కొరియా, జపాన్‌ల నుంచి మరింత తీవ్రమైన పోటీ ఎదుర్కొంటుంది. ఆగష్టు 18-సెప్టెంబర్ 2న ఇండోనేషియాలోని జకర్తా వేదికగా ఆసియా గేమ్స్ జరుగుతాయి. ఆసియా గేమ్స్‌లో భారత్ పతకాలు నెగ్గేందుకు మరిన్ని క్రీడాంశాలు జకర్తాలో ఉన్నాయి. మార్షల్ ఆర్ట్స్ సహా కరాటే, తైక్వాండో ఉన్నా.. వీటిలో చైనా, కొరియా, జపాన్‌లు సైతం ఆరితేరిన జట్లే!. కబడ్డీలో మనకు తిరుగులేకపోయినా.. వాలీబాల్, సెపక్‌తక్రా, జూడో, రోయింగ్, సెయిలింగ్‌లో మంచి అవకాశాలు ఉన్నాయి. షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్ విభాగాల్లో ఇక్కడా భారత్ గణనీయమైన పతకాలు ఆశిస్తోంది. బ్యాడ్మింటన్ విషయానికొచ్చేసరికి షటిల్ పవర్ హౌస్ చైనా, జపాన్, కొరియాలు పోటీలో ఉంటాయి. కాబట్టి డబుల్స్ విభాగాల్లో మినహాయిస్తే సింగిల్స్ విభాగాల్లో సింధు, సైనా, శ్రీకాంత్‌లపైనే పతక ఆశలు. టెన్నిస్‌లో సానియా మీర్జా డబుల్స్‌లో పతకం ఆశిస్తోంది. రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీలు మెరిసేందుకు ఎదురుచూస్తున్నారు.

ఆసియా గేమ్స్‌లో భారత హవా కాస్త తక్కువే అని చెప్పాలి. చైనా, జపాన్, దక్షిణ కొరియాలు సింహభాగం పతకాలు ఎగరేసుకుపోగా.. భారత్ తర్వాతి స్థానంలో కొనసాగుతోంది. 2014 ఆసియా గేమ్స్‌లో 11 స్వర్ణాలు, 11 రజతాలు, 14 కాంస్యాలతో భారత్ కేవలం 36 పతకాలే సాధించి ఎనిమిదో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్, ఇరాన్‌లు మనకంటే ముందున్నాయి. కానీ చైనా 345, దక్షిణ కొరియా 228, జపాన్ 200 పతకాలు సాధించాయి. 2010లో భారత్ 65 పతకాలు నెగ్గగా, చైనా ఏకంగా 416 మెడల్స్ సాధించింది. 2006లో మనోళ్లు 32 పతకాలే తీసుకొచ్చారు. ప్రస్తుతం భారత అథ్లెట్లు పతక దాహంలో ఉండటం, టాప్ అథ్లెట్లు ప్రపంచ స్థాయి శిక్షణలో రాటుదేలుతున్న నేపథ్యంలో జకర్తాలో భారత్ మెరిసేందుకు అవకాశమెక్కువే!.



65వ సీనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్ 2017-18 గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి

### టైటిల్‌కు చేరువలో విదర్భ

**ఇండోర్ :** తొలి రంజీ ట్రోఫీ టైటిల్ విజయం దిశగా విదర్భ దూసుకెళ్తోంది. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 528 పరుగులతో కొనసాగుతోంది. వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ (133 బ్యాటింగ్) అజేయ శతకంతో మెరిశాడు. దీంతో ఢిల్లీపై 233 పరుగుల ఆధిక్యంలో విదర్భ నిలిచింది. అక్షయ్‌కు ఆదిత్య సర్వటే (79), సిద్దేశ్ నర్వాల్ (56 బ్యాటింగ్) జత కలిశారు. దీంతో మూడో రోజు మూడు వికెట్లే కోల్పోయిన విదర్భ ఏకంగా 322 పరుగులు పిండు కున్నది. అంతకు ముందు విదర్భ బౌలర్ రాజ్‌నీశ్ గుర్బానీ (6/59) చెలరేగటంతో.. ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులకే ఆలౌట్ అయింది.

**అక్షయ్ అదరహో..**

నాల్గు వికెట్లు కోల్పోయి 206 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఇన్నింగ్స్ కొనసాగించింది విదర్భ. సీజన్ లో ఐదో మ్యాచ్ ఆడుతోన్న అక్షయ్ వాడ్కర్ (133 బ్యాటింగ్, 243 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా రాణించాడు. రెండో రోజు అర్ధ శతకంతో మెరిసిన వసీం జాఫర్ (78) ఆదివారం తొలి సెషన్‌లోనే వెనుదిరిగాడు. అక్షయ్ వాఖరే (17), జాఫర్‌లను నవ్‌దీప్ సైని నాల్గు ఓవర్ల వ్యవధిలోనే బలిగొన్నాడు. ఈ దశలో ఆదిత్య సర్వటే (79) అర్ధ శతకంతో రాణించగా.. అక్షయ్ వాడ్కరే, ఆదిత్యల జోడీ ఏడో వికెట్‌కు 169 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సిద్దేశ్ నేరల్ అజేయ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. నాల్గు ఫోర్లు, నాల్గు సిక్సర్లతో చెలరేగిన నేరల్ 92 బంతుల్లో అజేయంగా 56 పరుగులు బాదాడు. ఢిల్లీ ఆటగాళ్ల చెత్త ఫీల్డింగ్ విదర్భకు కలిసొచ్చింది.

### రెండులోనే కోహ్లి



**దుబాయ్ :** 2017 ఏడాదిలో చివరిసారిగా ఐసీసీ టెస్టు ర్యాంకులు ప్రకటించింది. బ్యాట్స్‌మెన్ జాబితాలో టీమ్ ఇండియా సారథి 893 రేటింగ్ పాయింట్లతో తాజా ర్యాంకింగ్స్‌లోనూ రెండో స్థానంలో కొన సాగుతున్నాడు. చటేశ్వర్ పుజారా మూడో స్థానాన్ని నిలుపుకున్నాడు. 947 రేటింగ్ పాయింట్లతో ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తొలి స్థానం పదిలం. మెల్‌బోర్న్ బూడిద పోరులో ద్వి శతకం చేసిన ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ అలస్టైర్ కుక్ ఏకంగా తొమ్మిది స్థానాలు మెరుగు పరచుకుని టాప్ టెన్‌లో (8వ ర్యాంకు) చోటు దక్కించుకున్నాడు. బౌలర్ల జాబితాలో తొలి తొమ్మిది స్థానాలు యథాతథంగా ఉన్నాయి. టీమ్ ఇండియా స్పిన్నర్లు రవీంద్ర జడేజా 870 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో, రవిచంద్రన్ అశ్విన్ 829 పాయింట్లతో నాల్గో స్థానంలో కొనసాగుతున్నారు.

### హైదరాబాద్ హంటర్స్ పరాజయం

**న్యూఢిల్లీ :** పీబీఎల్ పోరులో హైదరాబాద్ హంటర్స్‌కు రెండో పరాజయం. ఢిల్లీ డాషర్స్ చేతిలో 0-5తో హైదరాబాద్ ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్ సహా పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్ ఓడిన హైదరాబాద్‌కు మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ విజయం 2-0 ఏ మాత్రం ఊతమవ్వలేదు. వాంగ్ వింగ్‌కీ విన్సెంట్ చేతిలో 15-13, 11-15, 4-15తో లీ ఘోర పరాజయం చవి చూశాడు. ట్రంప్ మ్యాచ్ ఓటమితో హైదరాబాద్ టై స్కోరు నెగిటివ్ పాయింట్ అయింది. మారిన్ సాధించిన ఏకైక పాయింట్‌తో టై స్కోరు సున్నా గా మారింది. ఢిల్లీ తరఫున హువేయ్ 15-14, 14-15, 15-10 విజయంతో ట్రంప్ మ్యాచ్‌లో డాషర్స్ టై స్కోరును 4-0కు పెంచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప జోడీ వరుస సెట్లలో హైదరాబాద్‌కు చెందిన ఎస్ రంకిరెడ్డి జంటపై గెలుపొందింది. నేడు లక్నో వేదికన బెంగళూరు బ్లాస్టర్స్, ముంబయి రాకెట్స్‌తో తలపడనున్నది.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.